
# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

డిసెంబర్
2023

వెల: రూ.
25/-





# శ్రీవేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 16 సంచిక: 12

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
డా॥ టి. గౌరీశంకర్

ఫొటోగ్రాఫర్:
పత్తి సుబ్రమణ్యం, శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్

**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| భక్తిముక్తిదాయకం వైకుంఠ ఏకాదశి | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 9 |
| ధనుర్మాసము – తిరుప్పావై | 18 |
| భక్త తులసీదాసు | 22 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 26 |
| అమ్మ కథలు | 32 |
| రామాయణ రత్నాకరం | 36 |
| ముకుందమాల | 41 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 45 |
| వైకుంఠ ఏకాదశి పర్వదినం | 49 |
| శ్రీమాన్ అనంతాళ్వార్ల దివ్య చరితము | 51 |
| తిరుమల సర్వస్వం | 57 |
| నమామి శ్రీ శనైశ్చరమ్ | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


సంపాదకీయం..

# భావమే ప్రధానము

భక్తిమార్గంలో మనస్సే ప్రధానం. మనస్సును భగవంతుని విషయాలపై తప్ప అన్య విషయాలపై వెళ్ళుటను ఎప్పటికప్పుడు కట్టడి చేస్తూ ఉండాలి. సంఘంలో జీవిస్తున్నాం కాబట్టి రకరకాల మనుష్యులతో కలవడం, వారి భావాలను పంచుకోవడం అనివార్యం. లోకం, మంచి చెడుల కలయిక మనకు ఇష్టం లేకపోయినప్పటికీ వ్యతిరేక భావాలు కలిగిన విషయాలు తటస్థపడుట సహజం. ద్వంద్వ అర్థాలను కల్పించి వక్రమార్గంలో పయనించునట్లు చేసేవారే అధికం. కాబట్టి భక్తిమార్గంలో పయనించేవారు అత్యంత జాగ్రత్తగా మనస్సును ఎప్పటికీ పాజిటివ్ మార్గంలో ఆలోచించునట్లు చేయుట ప్రధానం. భక్తిమార్గంలో భావమే ప్రధానం. భక్తిని తారాస్థాయికి తీసుకెళ్ళునట్లు చేసి, తరతరాలకు మార్గదర్శకంగా నిలిచిన ఆళ్వార్లు, నాయనార్లు ఎంతోమంది ఉన్నారు. వారు రచించిన తమిళ లేదా ఇతర భాషలలోని పాశురాలు కాని, పద్యాలు కాని మనకు అర్థం కాకపోవచ్చు. కాని భావాన్ని అర్థం చేసుకుంటే సరిపోతుంది. భావానికి భాష అడ్డురాదు. ప్రతివ్యక్తీ ఆళ్వార్ల స్థాయి భావజాలాన్ని ఏర్పరచకపోవచ్చు. కాని భగవంతునిపై భక్తి సంధించి తీవ్రంగా ప్రయత్నిస్తే తప్పక కొంతవరకైనా ఆ భావాలు సిద్ధిస్తాయి. అలా సిద్ధించిన భావజాలాన్ని కాపాడుకొనుట మన చేతిలో ఉన్న పని. మనిషి ఎల్లప్పుడు నెగిటివ్ ఆలోచనలను త్యజించాలి, సదా మంచినే కోరాలి, అందరి సుఖాన్ని కాంక్షించాలి. ఏది జరిగితే సంఘం సుఖంగా ఉంటుందో దానిని భగవంతుడు మెచ్చుకుంటాడు. భగవంతుని మెప్పే భక్తుని ఉద్దేశ్యంగా జీవించాలి. ఒకే లోకంలో నివసిస్తున్నప్పటికీ వ్యక్తుల దృష్టికోణాలు భిన్నంగా ఉంటాయి. పూర్వం ఈ లోకంలో ఎంతమంది చెడ్డవారున్నారు చూచిరమ్మని శ్రీకృష్ణుడు, ధర్మరాజుని కోరాడట. ధర్మరాజు చూచివచ్చి, చెడ్డవారు లేనేలేరు అంతా మంచివారే అన్నాడట. ఇదే విషయాన్ని దుర్యోధనునికి చెప్పాడట. అప్పుడు దుర్యోధనుడు చూచివచ్చి అసలు మంచివారే లేరు అన్నాడట. ఇలా లోకం ఒక్కటే అయినప్పటికీ, మనం చూచే దృష్టికోణంలో, గ్రహించే విషయంలో భేదం ఉంటుంది. సద్గ్రంథ పఠనం, భగవదారాధన, మంచివారితో చెలిమి మనిషిని ఈ రకమైన దిశకు తీసుకువస్తాయి. దీనితో పాటు అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను వదిలి, తృప్తితో జీవించువారు ధన్యులు. మనలో ప్రవేశించే ప్రతి భావము, వేసే ప్రతి అడుగు లోక కళ్యాణము వైపు, భగవంతుని వైపు పడాలి. ఇతరులు మనలు చీదరించుకొనుట, పట్టించుకోకపోవుట వలన మనము ఏకాకిగా జీవనం సాగించినప్పటికీ ఎంతమాత్రము వెరవనివాడు ధన్యుడు. మనవల్ల లోకానికి ఏవిధమైన అపకారము జరగకూడదు. ఎల్లప్పుడు భగవంతుడు మెచ్చే భావమే మనస్సున పెట్టుకోవాలి. ప్రతి ఆలోచన భగవంతుని వైపే ఉండాలి. ఈ లోకంలో మనకు అత్యంత ప్రియమైనవాడు, ఆపద సమయాలలో ఆదుకొనేవాడు, మన బాగోగులు చూచేవాడు, సర్వదా దిక్కైనవాడు శ్రీవేంకటేశ్వరుడే. ఆయననే సదా స్మరిస్తూ, ధ్యానిస్తూ, తిలకిస్తూ లోకంలోని అన్నింటిలో ఆయనను వీక్షించువారు స్వామివారికి ప్రియులు.

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| 2 సం॥ | 500-00 |
| 4 సం॥ | 1,000-00 |
| జీవిత చందా | 5,000-00 |
| పోషకులు | 10,000-00 |
| రాజపోషకులు | 50,000-00 |


**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**శ్లో ॥ తంత్రీ ప్రకర్ష మధుర స్వనయా విపంచ్యా**
**గాయత్యనంత చరితం తవ నారదోఽపి**
**భాషా సమగ్ర మసకృత్కర చార రమ్యం**
**శేషాద్రి శేఖరవిభో తవ సుప్రభాతమ్**

తాత్పర్యం : నారదుడు తన వీణను మాటి మాటికీ చేతితో మీటుచు నీ అనంతములైన వీర చరిత్రలను పాడుచున్నాడు. వేంకటేశా! నీకు శుభోదయమగు గాక!

**శ్లో॥ భృంగావళీచ మకరంద రసాను విద్ధ**
**ఝుంకార గీత నినదైః సహ సేవనాయ ।**
**నిర్యాత్యుపాంత సరసీ కమలోదరేభ్యః**
**శేషాద్రి శేఖరవిభో తవ సుప్రభాతమ్**

తాత్పర్యం : వేంకటేశా! ఆలయ సమీపములో ఉన్న సరస్సుల నుండి తామరపూలలోని మకరందమును త్రాగుటచే కల్గిన ఆనందముతో తుమ్మెదలు ఝుంకార ధ్వనులు చేయుచు నిన్ను సేవింపవలెనని పూలనుండి వరుసలుగా బయటకు వచ్చుచున్నవి. స్వామీ! నీకు సుప్రభాతమగు గాక!

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

# ముక్తిమార్గము





## శ్రీరాగం

నిత్యాత్ముఁడై యుండి – నిత్యుఁడై వెలుఁగొందు
సత్యాత్ముఁడై యుండి – సత్యమై తానుండు,
ప్రత్యక్షమై యుండి – బ్రహ్మమై యుండు సం
స్తుత్యుఁడీ తిరువేంక – టాద్రివిభుఁడు ||పల్లవి||

1. ఏమూర్తి లోకంబు – లెల్ల నేలెడు నాతఁ
డేమూర్తి బ్రహ్మాదు – లెల్ల వెదకెడు నాతఁ
డేమూర్తి నిజమోక్ష – మియ్యఁజాలెడు నాతఁ
డేమూర్తి లోకైక – హితుడు,
ఏమూర్తి నిజమూర్తి – యేమూర్తియును గాఁడు
యేమూర్తి త్రైమూర్తు – లేకమైన యాతఁ
డేమూర్తి సర్వాత్ముఁ – డేమూర్తి పరమాత్ముఁ
డామూర్తి తిరువేంక – టాద్రి విభుఁడు ||నిత్యా||

2. ఏ దేవు దేహమున – నిన్నియును జన్మించె
నే దేవు దేహమున – నిన్నియు నణంగె మరి
యే దేవు విగ్రహం – బీసకల మింతయును
దేవు నేత్రంబు – లిన చంద్రులు,
ఏ దేవుఁ డీజీవు – లిన్నింటిలో నుండు
నేదేవు చైతన్య – మిన్నిటికి నాధార
మేదేవుఁ డవ్యక్తు – డే దేవుఁ డద్వంద్వుఁ
డా దేవుఁడీ వేంక – టాద్రి విభుఁడు ||నిత్యా||

3. ఏ వేల్పు పాదయుగ – మిలయు నాకాశంబు
ఏ వేల్పు పాదకే – శాంతం బనంతంబు
ఏ వేల్పు నిశ్వాస – మీ మహామారుతము
ఏ వేల్పు నిజదాసు – లీ పుణ్యులు
ఏ వేల్పు సర్వేశుఁ - డే వేల్పు పరమేశుఁ
డే వేల్పు భువనైక – హితమనోభావకుఁడు
ఏ వేల్పు కడు సూక్ష్మ – మేవేల్పు కడు ఘనము
ఆ వేల్పు తిరువేంక – టాద్రి విభుఁడు ||నిత్యా||

భావము : ఈ శ్రీవేంకటేశ్వరుడు నిత్యస్వరూపుడై యుండుట వలననే 'నిత్యుడు' అనబడి ప్రకాశించుచున్నాడు. సత్యస్వరూపుడగుట వలననే తాను 'సత్యుడు' అనబడుచున్నాడు. లోకములో ఎల్లవారికి ప్రత్యక్షమై యుండి పరబ్రహ్మముగా నున్నాడు గావుననే భక్తులచే స్తుతింపదగి యున్నాడు.

ఏ దివ్యమూర్తి లోకములనెల్ల పాలించుచున్నాడో, ఎవనిని బ్రహ్మాది దేవతలెల్ల అన్వేషింతురో, ఎవడు ప్రపన్నులకు తనదైన (నిక్కమైన) మోక్షము నొసంగ జాలియున్నాడో, ఎవడు లోకమునకు ముఖ్యహితము గూర్చువాడో, ఎవడు ఏ యాకారమును తన యాకారముగా గలిగియుండుట లేదో (నిరాకారుడో), ఎవడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులనబడు త్రిమూర్తులు ఏకమైన మూర్తిగా నున్నాడో, ఎవడు సర్వాత్ముడో, ఎవడు పరమాత్ముడో ఆ దివ్యమూర్తియే శ్రీవేంకటగిరి నాథుడు.

ఏ దేవుని శరీరమున ఈ సమస్త భువనములు పుట్టినవో, ఎవని శరీరమున ఇవన్నియు లయమగుచున్నవో, ఈ చరాచరమైన సృష్టియంతయు ఎవ్వని శరీరమో, సూర్యచంద్రులెవ్వని నేత్రములో, ఎవడు ఈ సర్వజీవులలో అంతరాత్ముడై యున్నాడో, ఎవని చైతన్యములకెల్ల నాధారమో, ఎవడు ప్రకాశము గానివాడో, ఎవడు అద్వితీయుడో, ఆ దేవుడే ఈ వేంకటాచలనాథుడు.

భూమి, ఆకసము ఏ వేల్పు పాదయుగ్మమో, ఎవని పాదముల తుదియు, కేశముల తుదియు అంతము లేనివో, ఈ మహా వాయువెవ్వని నిట్టూర్పో, పరమభాగవతులైన ఈ పుణ్యాత్ములెవ్వనికి నిక్కమైన దాసులో, ఎవడు సర్వేశ్వరుడో, ఎవడు పరమేశ్వరుడో, ఎవడు ప్రపంచమునకు ముఖ్య హితమునే మనస్సున భావించువాడో, ఎవడు మిక్కిలి సూక్ష్మమైనవాడో, ఎవడు మిక్కిలి స్థూలమైనవాడో, ఆ దేవుడే శ్రీవేంకటేశ్వరుడు.

**భావానువాదం:**
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



# భక్తి ముక్తి దాయకం వైకుంఠ ఏకాదశి

**– చింతలపాటి శివశంకర శాస్త్రి**

శ్లో ॥ "పంకజాసన శక్ర శంకర పూజితాంఘ్రి సరోరుహమ్
దేవ దానవ సిద్ధ సాధ్య నరాది భావిత వైభవమ్
సంకటోత్తరణోజ్జ్వల ద్రుచిలోపఖిల సేవకమ్
వేంకటేశ్వర పాదపంకజమాశ్రయే నిఖిలాశ్రయమ్"

పద్మనేత్రుడు, పద్మనాభుడు, పద్మమాలాధరుడు, పద్మచరణుడు, దేవదేవుడు, అనంత శక్తిస్వరూపుడు, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, ఆపద్బాంధవుడు అయిన మహావిష్ణువు భక్తుల కష్టాలను గట్టెక్కించి, వారి కోరికలు తీర్చే ఆ దేవదేవుని స్మరణం కైవల్య దాయకం. భక్తి ముక్తి దాయకం.

'పుష్యమి' నక్షత్రంతో కూడిన పున్నమి గల మాసాన్ని పుష్యమాసం అంటారు. ఈ మాసమునకే 'సహస్యం' అను నామాంతరమున్నది. పుష్యమీ నక్షత్రం శని దేవుని నక్షత్రం. కనుక శని ప్రీత్యర్థం ఈ మాసమంతా పూజలు చేయాలి. ఈ మాసం చాలా పునీతమైన మాసం. విష్ణువు, శని, సూర్యుడు, శివుడు, పితృదేవతలు ఈ మాసంలో భక్తుల చేత కొలవబడతారు. పుష్యమాసంలోనే రైతులకు పంటలు పుష్కలంగా పండి చేతికి అందిరావడం చేత పౌష్యమాసమని అంటారు. ఈ మాసం హేమంత ఋతువునందు రావడంతో చలి మిక్కుటంగా ఉంటుంది. పగటికాలం తక్కువగా ఉండి, రాత్రి కాలం అధికంగా ఉంటుంది. ఈ మాసంలో వైకుంఠ ఏకాదశి, సంక్రాంతి మొదలైన పండుగలు ఉంటాయి.

తిథులలో పదునొకండవ తిథిని ఏకాదశి అని అంటారు. మనకు సంవత్సరంలో ఇరవైనాలుగు ఏకాదశులు వస్తాయి. అధిక మాసం వచ్చిన మాసంలో మరొక రెండింటిని కలుపుకుని ఈ ఏకాదశులు ఇరవై ఆరు వస్తాయి. ఏకాదశి తిథి శ్రీమన్నారాయణునకు అత్యంత ప్రీతికరం. విష్ణుమూర్తి అనుగ్రహ ప్రాప్తి కొరకు ఏకాదశిని నియమ నిష్ఠలతో ఆచరించెదరు.

కుంఠము కానిది వైకుంఠము. 'కుంఠం' అనగా మొక్కపోయినది అని అర్థము. పుష్యమాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అని పిలుస్తారు. శ్రీమహావిష్ణువు చాతుర్మాస్య కాలంలో దక్షిణ దిక్కున తలపెట్టి నిద్రించి, పుష్య శుక్లపక్ష ఏకాదశి నాడు మేల్కొని భక్తులకు ఉత్తరద్వార దర్శనాన్ని ఇస్తాడు. అందువలన వైకుంఠ ఏకాదశి అనంతమైన పుణ్యాన్ని ప్రసాదించేరోజు. వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తరద్వారం నుంచి స్వామివారి దర్శనం చేసుకున్నవారు అనంతమైన పుణ్యరాశిని దక్కించుకుంటారు. ధనుస్సు నెల పట్టిన తరువాత శుద్ధంలో వచ్చే ఏకాదశి వైకుంఠ ఏకాదశి. విష్ణుభక్తులకు ఈ దినం మహా పర్వదినం.

**"కశ్మి రశ్చిన్మంతరే వికుంఠాయాం మా తరి జాత త్వాద్వైకుంఠః"**

''వికుంఠ'' అనే తల్లికి కుమారునిగా అవతరించినందువల్ల స్వామి వైకుంఠుడు అని అమరకోశం వర్ణిస్తుంది. ఆ స్వామి నివాసస్థానం వైకుంఠము. మనిషికి జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలుంటాయి. ''కుట తీతి కోటిః కుట కౌటిల్యే''. వంకరగా ఉండునది అంచు. చివరకు కోటి అని పేరు. ఈ మూడు అవస్థల అంచులను తాకి మనలను పునీతులను చేసేది ముక్కోటి ఏకాదశి. ముక్కోటి దేవతలు స్వామి దర్శనానికి వెళ్ళిన రోజు కనుక ఆ రోజును ముక్కోటి అని పిలుస్తారు. యాదృశ్చికంగా ఆ రోజు ఏకాదశి అయింది. అందువలననే ''ముక్కోటి ఏకాదశి''గా ప్రసిద్ధి కెక్కింది. ముక్కోటి దేవతల బాధలు నివారింపబడిన ఏకాదశి కనుక ముక్కోటి ఏకాదశి గాను, భక్తులకు వైకుంఠ దర్శన భాగ్యము లభించినందున భగవదవలోకన దినముగాను, సంతానము లేనివారికి పుత్రులను ప్రసాదించిన ఏకాదశి గావున పుత్రైకాదశి గానూ పరిగణించుచున్నాము.

వైకుంఠ ఏకాదశి మార్గశిర మాసములో వచ్చిన ''మోక్షదైకాదశి'' అని, పుష్యమి శుక్ల ఏకాదశిని ''పుత్రదైకాదశి'' అని అంటారు. శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రము కావున ఈ ఏకాదశిని ''విష్ణువాసరం'' అని పిలుస్తారు. ఈ తిథి అత్యంత దివ్య మహిమాన్వితమైనది. శుద్ధ ఏకాదశి నాడు సూర్యరశ్ములలో పదవకిరణము చంద్రుని ప్రవేశిస్తుంది. బహుళ ఏకాదశి నాడు చంద్ర మండలము నుండి పదకొండవ కళ సూర్యుని చేరుతుంది. ఇటువంటి సూర్యరశ్ముల ప్రయాణముచే ఏకాదశికి సార్థకత ఏర్పడింది.

కృతయుగంలో చంద్రావతి అనే నగరాన్ని రాజధానిగా చేసుకొని ''ముర'' అనే రాక్షసుడు రాజ్యం చేసేవాడు. ఇతడు తాళజంఘుడు అనే వాని కుమారుడు. బ్రహ్మను గురించి ఘోరమైన తపమాచరించి మెప్పించాడు. అతని తపమునకు మెచ్చి బ్రహ్మ వరము కోరుకొనుము అనగా అయోనిజ అయిన స్త్రీ వల్ల తప్ప ఇంకెవరి చేతిలోనూ మరణము రాకూడదని వరము పొంది బలవంతుడయ్యాడు. వరగర్వముచే విర్రవీగి దేవతలను, ఋషులను, మానవులను పీడించసాగాడు. అతని దుశ్చేష్టలను భరించలేని దేవతలు శ్రీమహావిష్ణువును ప్రార్థించారు. వారి ప్రార్థనను ఆలకించిన విష్ణువు మురాసురునిపై దండెత్తి యుద్ధమాచరించాడు. యుద్ధము చాలాకాలము జరిగి విష్ణువు అలసిపోయి సింహవతి అనే గుహలో ప్రవేశించాడు. అతని సంకల్పముచే ఏకాదశి అనే స్త్రీమూర్తి ఉద్భవించి, ఆ రాక్షసుని సంహరించింది. అందుకు విష్ణువు సంతోషించి వరము కోరుకోమనగా ''తిథులన్నింటిలో అత్యంత ప్రీతిపాత్రము కావాలని, తిథులన్నింటిలోనూ శ్రేష్ఠత్వం ఇవ్వాలని, ఏకాదశి తిథినాడు ఉపవాసం ఉన్నవారికి మోక్షం ప్రసాదించాలని'' వరము కోరుకొనినది. ఆనాటినుండి ఏకాదశి పవిత్రమైన తిథిగా ఉద్భవించినది. ప్రధానమైన తిథి అయింది. విష్ణుమూర్తి అనుగ్రహ ప్రాప్తి కొరకు ఏకాదశిని నియమ నిష్ఠలతో ఆచరించెదరు.

**"గంగా గీతా తథా భిక్షుః కపిలాశ్వత్థ సేవనమ్**
**వాసరం పద్మనాభస్య పావనం కిం కలౌయుగే"**

కలియుగమున గంగానది, గీత, సాధుపుంగవుడు, కపిలగోవు, రావిచెట్టు – వీటి సేవనం విష్ణుభగవానుని పర్వదినమైన ఏకాదశీవ్రతాచరణం వీటిని మించిన పావనమైనవి ఏమి కలవు? సంసార సాగరములో చిక్కుకొని అనేకానేక కష్టనష్టాలు అనుభవించే మానవ జాతిని ఉద్ధరించేందుకు సాక్షాత్ ఆ మహావిష్ణువే ఏకాదశిని ఏర్పాటు చేశాడని, ఈ ఏకాదశిని నియమ నిష్ఠలతో ఆచరించేవారు సర్వవ్యాధుల నుండి విముక్తిని పొందుతారని, వారికి మరణానంతరం వైకుంఠ ప్రాప్తి కలిగి తీరుతుందని పద్మపురాణం పేర్కొంటోంది.

పూర్వం నారదుడు ఈ ఏకాదశి వ్రతమును గూర్చి శ్రీకృష్ణునకు తెలియజేశాడు. ''ఏకాదశి వ్రతం నామ సర్వకామ ఫలప్రదం కుర్వన్తి సర్వదా''. సర్వకామితములు తీర్చగలది ఈ తిథి. ఈ రోజున ''ఏకాదశ్య ముపవసేన్న కదాచి దతి క్రమేత్''. ఏకాదశి నాడు విగ్రహారాధన, ఉపవాసముండుట మున్నగునవి ముఖ్యమైనవి. ఉపవాసమనగా ''ఉప'' అనగా సమీపమున ''వాసం'' అనగా నివసించుట అని అర్థం. భగవంతునికి సమీపములో ఉండి స్వామివారిని అర్చించి, పురుషసూక్తం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ గావించి బ్రాహ్మణుని పూజించి దానము ఇవ్వవలెను. బహుళ ఏకాదశి ''షట్తిల ఏకాదశి'' గావున నువ్వులు దానము ఇచ్చిన స్వామి కృపను పొందెదరు.

మానవుల శరీరము నవద్వారాలున్న శరీరము. శరీరములోని జీవుని దృష్టి సప్త ద్వారాలకు ఆవల ఉన్న పరంధాముని వైపు మరలడమే ముక్కోటి ఏకాదశి పరమార్థము.

వైకుంఠ ఏకాదశి – వైకుంఠ... ఏకాదశి అనే రెండు పదముల సమ్మేళనము. వైకుంఠమంటే పరంధామము. ఏకాదశి అంటే పదకొండు ఇంద్రియాల సమూహము. ఈ పదకొండు ఇంద్రియములను అన్నింటిని వైకుంఠునికి సమర్పించి, సేవించి ఉపాసించినప్పుడే అవి పవిత్రములై జీవుణ్ణి వైకుంఠానికి చేరుస్తాయి. మనిషి ఇంద్రియములకు అధీనుడై ప్రవర్తిస్తాడు. సుఖభోగాలు మనిషిని దైవానికి దూరం చేస్తాయి. ఉపవాసాది కఠిన నియమాల వల్ల ఇంద్రియాల ప్రభావము తగ్గి, ఆధ్యాత్మిక సాధనలకు మార్గం సుగమమవుతుంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసములలో దైవచింతన ఇమిడిపోవాలి. మనస్సు నిర్మలంగా ఉండి, సదా భగవద్భజన యందు విహరించాలి.

హరి నామస్మరణ నిరంతరం చేస్తుండాలి. బుద్ధిని భగవంతుని మీద కేంద్రీకరించాలి. హరికథలను వినాలి. కామ, క్రోధ, లోభ, మదాలను త్యజించాలి. పరనింద చేయరాదు. వినరాదు. తాంబూల సేవనం చేయరాదు. అసందర్భపు ప్రేలాపనలు పనికిరాదు. ముక్కోటి ఏకాదశి తిథి నాడు రాత్రి సమయాన శ్రీమన్నారాయణుని స్మరించుకుంటూ నిదురించాలి.

వైకుంఠ ఏకాదశిని ''పుత్రదా ఏకాదశి'' అని కూడా అంటారు. దీని విశిష్టత తెలిపే కథ ఒకటి ఉంది. పూర్వము సుకేతుడు అను మహారాజు ఎన్ని సంపదలున్నప్పటికీ, కీర్తి ప్రతిష్ఠలున్నప్పటికీ పుత్ర సంతానము లేకపోవడంతో వారి జీవితంలో అది తీరని లోటుగా మారింది. పుత్ర సంతానం కోసం మహావిష్ణువుని స్తుతిస్తూ తపమాచరించగా, ఆతని తపమునకు మెచ్చి శ్రీమహావిష్ణువు ఆ మహారాజుకు పుత్ర సంతానం కలిగేటట్లు వరమిచ్చాడు. కొంతకాలంలోనే పరంధాముని వరంచే సంతానం కలిగింది. ఏకాదశి తిథి నాడు పుత్రుడు కలుగుటచే ఆ తిథిని ''పుత్రదా ఏకాదశి'' అని పిలుస్తారు.

వైకుంఠ ఏకాదశి రోజున వైష్ణవ, శైవ, శక్తి ఆలయాలలో ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేస్తారు. వైష్ణవ క్షేత్రాలలో ఉత్తర ద్వార దర్శనం పెద్ద ఉత్సవం. దక్షిణాభిముఖుడైన స్వామిని ఉత్తరం వైపున నిలిచి సేవిస్తే సద్యోముక్తి లభిస్తుందని వైష్ణవాగమాలు చెబుతున్నాయి. వైకుంఠ ఏకాదశి నాడు సూర్యోదయానికి పూర్వమే లేచి కాలకృత్యములు తీర్చుకొని, దగ్గరలో ఉన్న జలాశయానికి వెళ్ళి స్నానమాచరించాలి. నదిలో నడుము లోతు వరకు వెళ్ళి స్నానము చేయాలి. స్నానానంతరం విష్ణుమూర్తిని, తులసిని పూజించాలి. త్రికరణశుద్ధిగా నమస్కరిస్తూ...

**"యన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వదేవతాః**
**యదగ్రే సర్వవేదాశ్చ తులసీం త్వాం నమామ్యహం"**

అని స్తుతిస్తూ పూజించాలి. విష్ణువుకు తులసీదళాలతో మాలగుచ్ఛి సమర్పించి నమస్కరించాలి. పిదప విష్ణ్వాలయానికి వెళ్ళి ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకొని యథాశక్తి పూజించాలి. ఉత్తర ద్వార దర్శనమనగా ఆకాశంలో శ్రవణా నక్షత్ర మండలంలో పాలవెల్లిలో మూడుకోట్ల నక్షత్రాలు (దేవతలు) వెంట ఉండగా విశ్వవ్యాపితమైన శ్రీమన్నారాయణుని దర్శించడం అని అర్థం. ద్వారకా తిరుమల క్షేత్రంలో వేంకటేశ్వరుడు దక్షిణాభిముఖుడై వెలశాడు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా ఆ స్వామిని దర్శించుకొని భక్తి పారవశ్యంతో గోవింద నామాలు ఉచ్చరిస్తూ తన్మయులవుతారు. తిరుమలలో కూడా వైకుంఠ ఏకాదశి, ద్వాదశి నాడు అరుణోదయ వేళలో ముక్కోటి తీర్థాలు శ్రీ స్వామి పుష్కరిణిలో మునకలిడుతాయి. శుభప్రదమైన ఆ వేళలో స్నానం చేసే మహాభాగ్యం అందరికీ కలుగనే కలగదు. ఎవరైతే వేల జన్మల్లో పుణ్యాన్ని ఆర్జించుకొని ఉంటారో, వారికి మాత్రమే కోనేటిలో స్నానం చేసే భాగ్యం కలుగుతుంది. అంటే సశరీరులై ఉన్నప్పటికీ జీవన్ముక్తిని పొందుతారని అర్థం.

తిరుమల... తిరుమల గురించి, తిరుమల దైవం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వరుని గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. కొండంత దైవాన్ని ఏమని వర్ణించగలం? ఓ బంగారు మేడలో దీపకాంతుల నడుమ పచ్చటి పట్టుబట్ట కట్టి, కౌస్తుభ మణిని తాల్చినవాడు, అభయప్రదుడు, విశాలాక్షుడు, వేదవేద్యుడు, సనాతనుడు అయిన శ్రీవేంకటేశ్వరుడిని గోవిందుడని, బాలాజీ అని, తిమ్మప్ప అని భక్తులు పిలుచుకునే ఆ దేవదేవుడు, కలియుగ ప్రత్యక్ష దైవం, ఆ పరంధాముడు వెలసిన ఆనందనిలయం... భూలోక వైకుంఠం అయిన శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని మహావైభవంగా నిర్వహిస్తారు. ఏకాదశి నాటి సుప్రభాతం మొదలుకొని, ద్వాదశి నాటి ఏకాంతసేవ వరకు తిరుమల ఆలయం తెరచే ఉంటుంది. శ్రీవారి గర్భాలయానికి ఆనుకుని ఉన్న ముక్కోటి ప్రదక్షిణ మార్గాన్ని తెరచి ఉంచుతారు. ఈ ప్రవేశ ద్వారాన్ని వైకుంఠ ద్వారమని అంటారు. ఇక్కడిదాకా వెళ్ళినచో అత్యంత సమీపము నుంచి స్వామివారి దర్శనం లభిస్తుంది. ఏడుకొండలవాని దర్శనం క్షణమాత్రమే అయినా భక్తులను పులకింపచేస్తుంది. ధవళ కాంతులతో ప్రకాశించే ఆ స్వామిని దర్శించుకున్న భక్తులు తన్మయులవుతారు.

వైకుంఠ ఏకాదశి మరునాడు ద్వాదశి. ఆ రోజు సూర్యోదయ వేళ శ్రీస్వామి పుష్కరిణీ తీర్థకోటి జరుగుతుంది. ఏకాదశి నాడు మూడుకోట్ల ఏభై లక్షల పుణ్యతీర్థాలు, పుష్కరుణులు తిరుమలలోని స్వామి పుష్కరిణిలో లీనమై యుంటాయి.

**"ధనుర్మాసే సితే పక్షే ద్వాదశ్యా మరుణోదయే**
**ఆ యాతి సర్వతీర్థాని స్వామి పుష్కరిణీజలే**
**తత్ర స్నాత్వా నరః సద్యోముక్తి యేతి న సంశయః**
**యస్య జన్మ సహస్రేషు పుణ్యమే వార్జితం పురా"**

స్వామి పుష్కరిణిలో స్నానం చేయడం, ఆ పరంధాముని దర్శనభాగ్యం కలగడం కొందరికే కలుగుతుంది. అది సిద్ధించిన భక్తుని అదృష్టం వర్ణనాతీతం. ఇరువది నాలుగు ఏకాదశులలో పూజిస్తే ఎంత ఫలితము కలుగుతుందో, ఈ ముక్కోటి ఏకాదశి నాడు స్వామిని దర్శించినా, పూజించినా అంతే ఫలితము కలుగుతుంది. ఉపవాసం, దర్శనం, పూజ, సేవ సర్వపాపహరం. భక్తి ముక్తి దాయకం. ఆశ్రిత భక్తజన వత్సలుడైన ఆ దేవదేవుని వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వారము గుండా దర్శించుకొని జీవన్ముక్తులవుదాము.

**సర్వేజనా... సుఖినో భవంతు**



# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ.. నా దశ


**9వ భాగము**

### తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**– పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**


దిశ : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 9వ భాగపు లీలల ప్రచురణ. (జులై 2003 నుండి అక్టోబర్ 2003)



### రెండవ పుట్టిన రోజు పండగ

05-07-2003 : ఇంగ్లీషు తేది ప్రకారం ఇది నా రెండవ పుట్టినరోజు పండగ. దీనిని తిరుమల కొండపై స్వామివారి సన్నిధిలో జరుపుకున్నాను. తేది 04-07-2003 శుక్రవారము స్వామివారి అభిషేకసేవను చేసాము. మరియు 05-07-2003 నాడు స్వామివారిని రెండు సార్లు దర్శించుకున్నాము. ఈ సందర్భంగ నా మొదటి పుట్టిన రోజు పండుగకు స్వామివారు నాకిచ్చిన కానుకను ఈ విధంగా పునరాలోచించుకున్నాను.

నేను తేది 05-07-1960 తొలిఏకాదశి రోజు జన్మించాను. కాని నా జన్మతేది తెలియక కొన్ని సంllలు, ఆసక్తిలేక మరి కొన్ని సంllలు నా పుట్టిన రోజును ఏనాడు జరుపుకోలేదు. కనీసం దేవునికి దండం కూడ పెట్టలేదు. కాని 05-07-2002 నాడు నా పుట్టిన రోజును జరుపుకోవాలనే బలమైన కోరిక కలిగింది. ఆరోజు నా స్వామివారిని జీవితములో మొదటిసారి అభిషేకించి గులాబీలతో, మల్లెపూలతో అర్చించాను. ఆ తరువాత ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నేను నా మొదటి పుట్టిన రోజు పండుగను జరుపుకుంటున్నాను, నాచే ఈ లోకానికి ఉపయోగపడే ఏదో ఒక పనిని చేయించండి అని వేడుకున్నాను. మరియు నాకొక మంచి బహుమానం ఇవ్వమని పదేపదే ప్రార్థించాను. అంతే! అప్పుడు నాకు స్వామివారు ఎలాంటి బహుమానం ఇవ్వనున్నారో తెలియలేదు. అనంతమైన విలువైనది, నేను తృప్తిచెందే విధంగ బహుకరించారు. ఆ వరుస క్రమము ఈ విధంగ ఉంది.

ఉదయం 9.00 గంllల ప్రాంతమున

స్వామివారిని తనివితీర పూజించాను. లోకానికి ఉపయోగపడే ఏదేని ఒక మంచి పనిని నాచే చేయించుమన్నాను, మరియు నాకో బహుమానం ఇవ్వమన్నాను. ఉదయం 10.30 గంటలకు ఆఫీసుకు వెళ్ళి స్వామివారికి బొట్టుపెట్టి మ్రొక్కునపుడు "తిరుపతిలో స్వామివారి మహామంత్ర స్తూపమును నేనే కట్టాలనే బలమైన కోరిక కలిగింది. మరియు ఇదేరోజు సాయంత్రం తిరుపతిలో కీ.శే. గవర్రాజు గారికి శ్రీవెంకటేశ్వరుడు దర్శనమిచ్చి "ఈ స్తూపాన్ని నా సాయిరెడ్డి కట్టగలడ" ని చెప్పాడు. తరువాత నాచే తన ప్రథమ దివ్య మహామంత్ర స్తూపమును నిర్మింపచేసి, నా చేతనే ప్రారంభోత్సవము కూడ చేయించారు. స్వయంగా ఆ స్తూపాన్ని స్వామివారు స్వీకరించి నన్నెంతో ఆనందింపచేసారు. ఆ తరువాత శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్థాపింపచేసి, ఏడు నెలల్లో ఏడుకొండల వాడికి ఏడు కోట్ల జప సమర్పణను తేది 14-06-2003 నాడు సమర్పించే విధంగ చేసారు. లోకానికి నన్ను గోవింద దాసుగ పరిచయం చేసాడు. ఈవిధంగా ఇవి అన్నీ కూడ 05-07-2002 నుండి 05-07-2003 వరకు జరిగిపోయాయి.

ఇక నా రెండవ పుట్టిన రోజు పండుగ బహుమానం ఏముంటుందో చూడాలి. ఆయనకు నిస్వార్థసేవ చేయాలని ఉంది. నన్ను ఆయన ఒక సేవకుడిగ, పాదసేవకుడిగ స్వీకరించితే చాలు అనే భావన మాత్రమే నాలో ఉంది.

05-07-2003 కల : ఈరోజు ఉదయం దాదాపు 4.30 ప్రాంతమున ఒక మెరుపులాగ నాకు శ్రీవరాహస్వామి ముఖము, ఆయన తిరునామము కనబడ్డది. తిరుమలలోని ఆలయంలో ఉన్నట్లు దర్శించాను. ఇంతే కల. దీనిని నేను తిరుపతిలో ఉన్నప్పుడు దర్శించాను.


## ప్రథమ 7 కోట్ల జపము స్వీకరించుటకు పాదాలను చూపుట

సం॥ 2000 నుండి స్వామివారిని ఆయన లీలలను చూడాలనే కోరిక నాలో బలంగా ఉంది. కొన్ని సార్లు ఆర్తితో ప్రార్థిస్తూ నాకోరిక నెరవేర్చుమంటాను. మరి కొన్నిసార్లు మాత్రం ఎప్పటికీ విసిగించకూడదనే ఉద్దేశ్యంతో, ఆ తపనను నాలోనే పెట్టుకొని బాధపడుతుంటాను. తిరుపతిలో శ్రీవెంకటేశ్వర దివ్య మహామంత్ర స్తూపమును నిర్మించిన తరువాత, ఈ స్తూపమును స్వీకరించుటకు తన దివ్యదర్శన భాగ్యాన్ని ప్రసాదించారు. దానికి నేనెంతో ఆనందించాను. గత ఇరవై రోజుల క్రితము స్వామివారికి ప్రథమ ఏడు కోట్ల జపసమర్పణ కావించాము. అదేవిధంగ దీనిని కూడ స్వామివారు స్వీకరించాలని అందుకు తన దివ్యపాదాలను చూపెట్టాలనే ఒక బలమైన కోరిక కలిగింది. గత కొన్ని రోజుల నుండి స్వామివారి బంగారు పాదాలను చూడాలనే కోరిక రోజురోజుకు పెరుగుతోంది, కాని నా మనస్సులోని కోరికను స్వామివారికి చెప్పలేకపోయాను. ప్రతిసారి అడిగితే ఏమనుకుంటారో అని ఒకింత భయపడ్డాను. పైగా స్వామివారిని నేను తపస్సు చేసి సాధించుకోలేదు, నా అదృష్టవశాత్తు బజారులో దొరికిన 'రత్నం' లాంటివారు. కాబట్టి విసిగించకూడదనుకున్నాను అందుకని నా కోరికను నా లోపల పెట్టుకుని కుమిలిపోయాను. ఏడుస్తున్నాను కరుణించుమని లోలోన ప్రార్థించాను. ధైర్యము చేసి ఒకసారి ఇలా నాలో నేను అనుకున్నాను. నేను సేవ చేసిన తరువాతనే అనుగ్రహించమని అడుగుతున్నానే తప్ప అంతకు మించి కోరుటలేదు. కాబట్టి నా కోరికలో తప్పు లేదని నాలో నేను అనుకున్నాను. మొత్తం మీద ఆయన పాదాలను చూడాలని ఉవిళ్ళూరాను. ఒక సందర్భములో (2001 సం॥) నాపైన తన నల్లని రెండు పాదములను పెట్టాడు, కాని ఆరోజు నేను వాటిని సరిగా చూడలేదు. తృప్తి చెందలేదు. కాబట్టి నేను తృప్తి చెందే వరకు మీ బంగారు పాదాలను చూపాలని లోలోన వేడుకున్నాను.

శ్రీవెంకటేశ్వరుడు నా ఈ కోరికను నూటికి నూరుపాళ్ళు నెరవేర్చాడు.పరమానందభరితుణ్ణిచేసాడు.మైమరచిపోయాను. ఒక భక్తుడు ఇంతకంటే ఎక్కువ ఆనందస్థితిని పొందలేడనే స్థితిని కల్పించాడు. అది కూడ తొలి ఏకాదశి రోజు. తెలుగు సంవత్సరాది ప్రకారం నా పుట్టిన రోజునాడు ప్రసాదించాడు. ఎంతగా సంతోషపడ్డానంటే మరో జన్మను నా స్వామి సేవకై కేటాయించుకున్నాను. నన్ను పట్టెమంచము మీద పడుకోపెట్టి, హాయిగ ఊపుచు, మధురమైన ఆహ్లాదకరమైన పరిస్థితుల మధ్యన తన బంగారు పాదాలను చూపెట్టాడు. చూడు, ఇంకా చూడు, నీ తనివితీర చూడు, మళ్ళీ మళ్ళీ చూడు అంటూ నేను పడుకున్న పట్టెమంచమును ఊపుచూ చూపెట్టాడు. ఇంతటి భాగ్యాన్ని పొందిన నేను స్వామివారికి ఏమివ్వగలను? ఆ లీల ఈవిధంగ ఉంది.

10-07-2003: ఈరోజు తొలిఏకాదశి. ఉదయం 4.30 నుండి 5.00 మధ్యన వచ్చింది ఈ కల. ఈ కలలో స్వామివారు అద్భుతమును చూపెట్టారు. ప్రథమ జపసమర్పణ సమయము నుండి స్వామివారి పాదాలను చూడాలనే కోరికతో ఉన్నాను. ప్రతిరోజు దీనికై ఆశపడుతున్నాను కాని తెల్లవారి నిరుత్సాహపడేవాణ్ణి. రేపు తప్పక చూపిస్తారనే పూర్తి విశ్వాసముతో జీవిస్తున్నాను. ఇలా కాలం గడుస్తోంది.

హైదరాబాద్‌లోని విద్యానగర్ వి.ఎస్.టి రోడ్డులో, సెల్లారులో శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆఫీసు ఉంది. దాదాపు 1000 అడుగుల వైశాల్యములో చక్కగ ఉంది. ముందు ఒక



మొదటి 7 కోట్ల జపమును స్వీకరించానని తన పాదములను చూపుట .

బోర్లా పడుకోబెట్టింది. నేను నా తలను ఆ బల్లకు బయట స్వామి వైపు పెట్టి నా రెండు చేతులతో బల్ల చివరలను గట్టిగా పట్టుకొని క్రిందికి స్వామిని చూస్తున్నాను. ఇంతలో స్వామి, అమ్మవారు మాయమైనట్లు కేవలం స్వామి బంగారు పాదాలు మాత్రమే కనబడ్డవి. ఆయన ఇతర భాగాలు కనబడలేదు. లేదా నేను ఆయన పాదాలనే కోరాను కాబట్టి, ఆయన పాదాలయందే ఆసక్తి ఉంది కాబట్టి అవి మాత్రమే కనబడ్డవి. ఆయన పాదాలు బంగారు వన్నెతో చకచక మెరుస్తూ కనబడ్డవి. ప్రక్కన అమ్మవారు

గది, దాని తరువాత మరో పెద్ద గది, దాని ప్రక్కన నా రూము ఇలా చక్కగా ఉంది. ఈ కలలో శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆఫీసులోనే స్వామివారు ఇదంతా చూపారు.

కల : అది శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆఫీసు. నేను తలుపుతీసి వేచి ఉండు గదిలోనికి వెళ్ళాను. ఈ గదిలోని గోడకు శ్రీవేంకటేశ్వరుని మరియు కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఫోటోలు నిజంగా ఉన్నవి, మరియు కలలో కూడ దర్శించాను. దీని ప్రక్కన మరో పెద్ద గది ఉంది. ఈ గదిలో ఎదురుగా ఉన్న గోడ ముందు, అమ్మవారి మరియు స్వామివారి దాదాపు మూడు అడుగుల ఎత్తు ఉన్న బంగారు విగ్రహములను కలలో దర్శించాను. అవి అత్యంత సుందరంగ ఉండి, ధగ ధగా మెరుస్తున్నాయి. ఆ మెరుపుతో ఆఫీసు మొత్తం బంగారు కాంతితో నిండిపోయింది. ఇలా నేను స్వామివారిని మరియు అమ్మవారిని తనివితీర చాలాసేపు దర్శించాను. ఇంతలో ఈ విగ్రహాల పై ఎత్తులో కట్టెతో చేసి, పైనుండి గొలుసులతో వ్రేలాడుచున్న ఒక పట్టెమంచం దర్శనమిచ్చింది. ఇది స్వామివారి మహిమతో ఏర్పడ్డది. ఇది పైనుండి గొలుసులతో వ్రేలాడుతోంది కాబట్టి ఊయలలాగ ఉంది. ఒక మూడున్నర అడుగుల వెడల్పుతో ఆరడుగుల పొడవు ఉన్న ఒక చక్కని బల్లపైనుండి గొలుసులతో వ్రేలాడుచున్నట్లుంది. ఈ బల్ల విగ్రహాల కంటే కొంత ఎత్తులో విగ్రహాల ముందు ఉంది. ఇంతలో ఒక శక్తి నన్ను ఆవహించింది. అది నన్ను పైకి లేపి ఈ బల్ల లాంటి ఊయలపైన

కూడ ఉన్నారు కాని ఆమెవి కనబడలేదు. కేవలం స్వామివారివి మాత్రమే, రెండు పాదాలు చకచక మెరుస్తూ కనబడ్డవి. ఈ విధంగా స్వామివారి బంగారు పాదములను చూస్తున్నాను. అప్పుడు ఆ శక్తి నేను పడుకున్న ఊయలను మెల్లమెల్లగ ముందు వెనుకకు ఊపింది. దీనికి తోడు అక్కడ చల్లని ఆహ్లాదకరమైన పండు వెన్నెలలాంటి పరిస్థితులు కల్పించబడ్డవి.

నేను స్వామివారి పాదాలను హాయిగా చూస్తున్నాను. "చూడు, ఇంకా చూడు, తనివితీరా చూడు మళ్ళీ మళ్ళీ చూడు" అనే భావన నా మనస్సులో కలిగింది. ఆ భావనకు తగినట్లు, ఊయలలో ఊగుచు అత్యంత మధురమైన వాతావరణంలో స్వామివారి బంగారు పాదాలను నా తనివితీర చాలసేపు చూచాను. తరువాత కల చెదిరింది. ఇది నా జన్మను ధన్యము చేసింది. అది కూడ నా పుట్టిన రోజైన తొలి ఏకాదశి రోజు స్వామివారు తన సేవకుడికి, సేవకుడు కోరిన విధంగ కోరికను తీర్చాడు. ఆ స్వామివారికి కోటికోటి ప్రణామాలను సమర్పించాను. ఈ విధంగా శ్రీవేంకటేశ్వరుడు తన ప్రథమ 7 కోట్ల జపమును స్వీకరించి నన్ను పరమానందభరితుణ్ణి చేసాడు.

ఒక అధమ స్థాయి వ్యక్తినైన నేను తిరుమల శ్రీవేంకటేశ్వరుడు చూపు అనుగ్రహాలను చూచి పరవశించి పోయాను. ఆయన ఋణం తీర్చుకోవాలని, అందులకు ఎంతటి కష్టమైన పని యైనప్పటికి వెరవక చేయాలనే పట్టుదల నాలో తారాస్థాయికి చేరింది.

## నమో వెంకటేశాయ రథం

23-08-2003 : తిరుపతిలో నిర్మించిన శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్తూపమును 'నమో వేంకటేశాయ' పేరుతో ఒక బ్రాస్ రెప్లికను తయారు చేయాలని భావించాను. ప్రతి జపసమర్పణ కంటే 11 రోజుల ముందు హైదరాబాద్ నుండి తిరుపతి వరకు వీధి వీధి తిరుగుచు, భక్తులచే స్వామివారిని స్మరింపచేయుచు, చిన్న పేపరుపైన స్వామి మహామంత్రమును వ్రాయిస్తూ తిరుపతికి చేరి, జప పుస్తకములతో పాటు ఈమొత్తాన్ని ప్రతి సం॥ 7 కోట్ల జపములో భాగంగా సమర్పించాలని భావించాను. ఈ రథం తయారు చేయుటకు నేను నా సొంత డబ్బును సరిపడా సమకూర్చుకున్నప్పటికీ, భక్తులను భాగస్వాములు చేయాలనే ఉద్దేశ్యముతో, ఆసక్తి ఉన్నవారు చందాలు ఇచ్చుటకని ఒక పాంప్లెట్ తయారుచేసి ఈరోజు నుండి భక్తులకు పంచుట ప్రారంభించాము. ఒక నాలుగైదు నెలల తరువాత రథాన్ని ప్రారంభించాలనుకున్నాము.

ఇంతకు ముందు కీ.శే. గవర్రాజు గారి వద్ద పనిచేసిన శ్రీమాన్ పాండురంగారావు అనే వ్యక్తి ఆయనవద్ద మానేసి, పీఠం నిర్వాహణ పనులు చూచుకొనుటకు నావద్ద చేరాడు. నేను మాత్రం పీఠంతో పాటు వ్యాపారమును కూడ చూచుకుంటున్నాను.

17-09-2003 : ఈమధ్యన స్యాంత్రో జింగ్ అనే ఒక క్రొత్త కారు కొన్నాను. ఆర్.టి.ఏ రిజిస్ట్రేషన్‌లో దీని నెంబరు 7 రావాలని తలంచాను. అందుకు పదివేలు అదనంగ కట్టవలసి వచ్చింది. అందుకు ఇష్టపడక ఈ డబ్బులు మీ నమో వేంకటేశాయ రథంకు వాడతాను, నాకు 7 వచ్చే విధంగ చూడుమని స్వామిని ప్రార్థించాను. చివరికి 7 వచ్చే విధంగ 1726 నెంబరును ప్రసాదించారు. నేనెంతో సంతోషించాను.

## స్వామివారి శిక్షణ

ఇంతవరకు నేను సంతోషించే విధంగ స్వామివారు అనుగ్రహిస్తున్నారు. శ్రీవేంకటేశ్వరుడు నావాడు అనే ప్రగాఢ విశ్వాసము నాలో ఉంది. ఇప్పటి నుండి నాకు తెలియకుండానే నాలో మార్పుకోసం ప్రయత్నించాడు. ఒక ప్రక్క తన సేవను విస్తరించుకుంటూ, మరో ప్రక్క నాకు అత్యంత ఇష్టమైన వ్యాపారములో, ఆస్తులలో గొడవలు సృష్టించాడు. ఆస్తులపైన వ్యామోహాన్ని ఎన్నో రేట్లు పెంచారు. ఫలితంగా ఏ చిన్న ఆపద సంభవించినా తట్టుకోలేని స్థితి కలిగించారు. ఈ స్థితి నుండి కాపాడుటకు శ్రీవేంకటేశ్వరుణ్ణి రకరకాలుగా నాకు తెలిసిన అన్ని మార్గాలలో ప్రార్థించేవాడిని. తల్లడిల్లిపోయేవాడిని. ప్రతి రోజు ప్రతి క్షణం స్వామివారిని అత్యంత ఆర్తితో స్మరించేవాడిని. స్వామివారు కూడ నా తపనకు తగిన విధంగ స్పందించేవారు. ఎన్నో హితబోధలు చేసారు. నేనున్నాను భయపడకుమనేవారు. మొత్తం మీద స్వామివారితో ఒక ఆట ఆడుకున్నాను. చివరికి స్వామివారు నావారు మాత్రమే కాదు అనే స్థితికి చేరుకున్నాను. నన్ను ఒక ప్రయోగకరమైన మార్గంలో నడుపుచున్నారని స్పష్టంగ గుర్తించాను.

జులై 2000 నుండి రెండున్నర సం॥ల వరకు స్వామివారి లీలలనుఅనుభవిస్తూపరమానందస్థితినిపొందాను.ఆతరువాత స్వామివారి లీలలను పొందుచున్నప్పటికీ అవి నిరాటంకంగా లేవు. మధ్యమధ్యన ఎక్కువ గ్యాపులు ఉన్నవి. కాబట్టి నాలో కొంత నిరాసక్తత మొదలైంది. నిరాటంకంగా శ్రీవేంకటేశ్వరుని లీలలను అనుభవించాలనే కోరిక కలిగింది. వెంటనే స్వామి వారిని ప్రార్థించాను. పూర్వములాగ నాకు ఆస్తి తగాదాలు సృష్టించైనా సరే మీ లీలలను మధురంగ అనుభవించే భాగ్యాన్ని ప్రసాదించుమని వేడుకున్నాను. కాని ఈ ఆస్తి గొడవలలో నాకు నష్టం రాకుండా చూడమని మరీ మరీ వేడుకున్నాను. స్వామివారి లీలలను తనివితీర అనుభవించాలనుకున్నాను. కాని ఆస్తి నష్టం మాత్రం రాకూడదని తలంచాను. అనుకున్నట్లే ఇప్పటి నుండి నా జీవితము మరోమలుపు తిరిగింది. ఒక ప్రక్క భక్తిమార్గంలో ఎన్నో లీలలు చూపెట్టి పైమెట్టుకు తీసుకెళ్ళాడు. 'నమో వేంకటేశాయ' రథం, 'శ్రీవేంకటేశం' మాసపత్రిక అనే రెండు మెట్లు ఎక్కించాడు. నన్ను పైతరగతిలో చేర్పించి భగవంతుని గురించి మరిన్ని విషయాలను తెలుసుకొమ్మన్నాడు. నా కోరిక ప్రకారం నాకో మంచి ఇల్లును కూడ ప్రసాదించాడు. మరో ప్రక్క భయంకరమైన ఆస్తి గొడవలను సృష్టించాడు. అందులో ఒక భక్తుడు ఊహించని లీలలను చూపెట్టాడు. కొన్ని సందర్భాలలో ద్వంద్వ అర్థాలను ఉపయోగించి ఒక ప్రక్క నన్ను సంతోషపరుస్తు మరో ప్రక్క తాను ఆశించిన మార్గము లోనికి తీసుకెళ్ళాడు. నీటి నుండి తీసిన చేపపిల్లలా విలవిల కొట్టుకున్నాను. లీలలను చాలించండి ప్రభూ నేను భరించలేనన్నా వినలేదు. ఆస్తిని పణంగా పెట్టి స్వామివారి లీలలను అనుభవించితే మధురంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ఆస్తి సమస్యలను సృష్టించమన్నాను. కాని స్వామివారు మాత్రం నాలో 'నా' అన్నది నశించాలనే దృష్టికోణంలో లీలలను ప్రసాదించారు. చివరికి నా సర్వదాస్తిని హరించివేశాడు. ఫలితంగా స్వామివారిపై కోపమేర్పడ్డది. చివరికి నేనంటే స్వామివారికి ఇష్టం లేదని, నాపై కక్ష కట్టాడని తలచాను. ఆయనపై ద్వేష భావము ఏర్పడింది. నా మనసులో నున్న వ్యధను స్వామివారు అర్థం చేసుకున్నారు. అప్పుడు నా వద్దకు తన యోగమాయను పంపాడు. ఆ మాయ నన్ను బంధించి ఆకాశమార్గాన తీసుకెళ్ళి తిరుమలలో స్వామివారి

ముందుంచింది. అప్పుడు స్వామివారు నేనంటే ఆయనకు ఎంతో ఇష్టం అని చెప్పుచు ఆలింగనం చేసుకున్నాడు. ఒక్క క్షణములో నాలో ఉన్న కోపము భస్మమైపోయింది.శ్రీవేంకటేశ్వరుడంటే మరింత ప్రేమ ఏర్పడింది. మరో సందర్భంలో నేను 'నా' అన్నది నశింపచేసుకుంటే మంచి బహుమానం ఇస్తానన్నాడు. నేను రెండు పర్యాయాలు సాధన చేసినప్పటికి యోగ్యత సాధించలేదన్నాడు. మూడవసారి తీవ్రంగ సాధన చేసాను. 'నా' అన్నది నశించిందని బహుమానం అని అడిగాను. ఇవ్వాలని ఉందా లేదా అని అనుమానించాను. అప్పుడు తిరుపతి నుండి శ్రీశ్రీశ్రీ హయగ్రీవ స్వామివారిని నా వద్దకు గురువుగ పంపారు. వారు నేను 'నా' అన్నది నశింపచేసుకోలేదని స్పష్టంగ నేను అర్థం చేసుకునే విధంగ తెలిపారు. అప్పుడు మీ కృపతోనే అది సాధ్యమవుతుంది లేకుంటే నాతో కాదని చెప్పాను. చివరికి ఇలా ఆయన సూచించిన మార్గంలో పయనిస్తున్నాను. ఇలామొత్తం 2003 నుండి 2008 వరకు 5 సం॥లు నా జీవితంలో మరపురాని రోజులు. ఇందులో కొన్ని లీలలు ఆస్తి తగాదాలకు, కొన్ని శ్రీవేంకటేశం మాసపత్రికకు, కొన్ని 'నమో వేంకటేశాయ రథము'నకు, కొన్ని నా గృహమునకు, మరికొన్ని యోగ్యతకు సంబంధించి ఉన్నవి. మొత్తం ఐదు రకాలుగ లీలలను ప్రసాదించాడు. మొత్తం మీద ఇవి స్వర్ణాక్షరాలతో లిఖించదగిన రోజులు. తనివితీర స్వామి లీలలను అనుభవించి అలసిపోయిన రోజులు. ఇలా తెలియకుండానే అద్భుతమైన శిక్షణను ప్రసాదించాడు. స్వామివారి శిక్షణ మానసికంగా, ఎదురుగా ఉన్న గురువు ఇచ్చిన శిక్షణ కంటే ప్రభావవంతంగా ఉంది.

ఈ మధ్యన నా భార్య ఇష్టపడి డైమండ్ టాప్స్ చేయించుకుంది. ఇష్టంగా నాలుగైదు రోజులు మాత్రమే ధరించింది. వెంటనే ఆస్తి సమస్య పుట్టింది. నిజానికి మేము సంఘంలో గొప్పవారిమనే భావన కలుగచేసే ఎలాంటి వాటినీ ధరించకూడదు. కాని మరచిపోయి విషయవాసనల వలన అలా ప్రవర్తించినప్పుడు స్వామివారు తగిన విధంగ గుర్తు చేస్తుంటారు. వెంటనే వీటిని స్వామివారికి సమర్పిస్తానని నిర్ణయించుకుంది.

## ఆస్తి తగాదాలు

నాకు హైదరాబాద్‌కు సమీపములోని మియాపూర్‌లో ఎ.1.34 గుంటల వ్యవసాయభూమి ఉండేది. దీనిని 1996 సం॥లో నాకున్న సంపదలో చాలవరకు వెచ్చించి కొన్నాను. నిజానికి ఈ స్థల యజమాని ఒక మధ్యవర్తికి అమ్మాడు. నేను ఆ మధ్యవర్తి నుండి కొనుగోలు చేసాను. రిజిస్ట్రేషన్ సమయాన మాత్రం భవిష్యత్‌లో ఇబ్బంది రాకూడదని ఇద్దరిచే సంతకాలు పెట్టించుకున్నాను. ఇది కూకట్‌పల్లికి సమీపంలో ఉంది. భవిష్యత్‌లో విలువైనది కాగలదని భావించాను. దీనిని మా కుటుంబ రక్షిత ఆస్తిగా అంటే భవిషత్ సెక్యూరిటీ గురించి కొన్నాను. కొన్నప్పటి నుండి దీనిపై ప్రేమ ఎక్కువుండేది. స్థలము కొన్నానే కాని ఈ స్థలము కొనుటలోనే మోసగించబడ్డాను. ఈ స్థలం రిజిస్ట్రేషన్ సమయములో, నాకు అమ్మిన మధ్యవర్తి ఈ స్థల యజమానిని భయపెట్టి బలవంతంగా తీసుకువచ్చాడట. ఆ యజమాని కూడ ఆయనకు భయపడి నాకు సంతకము చేసాడు. నేను ఇచ్చిన డబ్బులు చాల వరకు ఈ మధ్యవర్తే తీసుకున్నాడు. ఇంటికి పోయిన తరువాత ఆ యజమాని పోలీసులకు దరఖాస్తు చేసి నాపై కేసు వేసాడు. ఇది చూచి మధ్యవర్తి తప్పుకున్నాడు. నన్నే మాట్లాడుకొమ్మన్నాడు. కోర్టులో రెండున్నర సం॥లు సాగింది. చివరికి ఆ యజమాని దీనావస్థను చూచి కోర్టులోనే మరింత ధనము ఇచ్చి ఏ కేసు లేకుండ చేసుకున్నాను. తరువాత భూమిని డెవలప్ చేసాను. బోరు, ఫెన్సింగు వేసాను. రెండు కుటుంబములు నివశించుటకు వీలుగ రూములు కట్టాను. ఆ స్థలములో టేకు చెట్లు వేసాను. కావలసిన పాస్ పుస్తకములను తీసుకున్నాను. కొద్ది కాలములోనే చెట్లు 25 అడుగుల ఎత్తు వరకు బాగ పెరిగాయి. తోట మంచి అందంగా తయారైంది. అప్పుడప్పుడు స్థలము వద్దకు వెళ్ళి చెట్లను, పరిసరాలను చూచేవాడిని. శ్రీవేంకటేశ్వరుని సృష్టిలోని కొంత భాగమును చూచి సంతోషించేవాడిని.

నేను భూమిని కొన్నప్పటి నుండి ఏడు సం॥ల తరువాత ఈ ఆస్తి విలువ గణనీయంగా పెరిగింది. పైగా హైదరాబాద్ చాల పెరిగిపోయింది. ఈ స్థలము వరకు విస్తరించింది. ఇప్పుడు తగాదా మొదలైంది. తేది 16-09-2003 నాడు అనుకోకుండ ఆ మధ్యవర్తి నాకు ఫోన్ చేసాడు, తను నాకు అమ్మకముందే 1990-1993 మధ్య కాలములో ఈ స్థలములో కొన్ని ప్లాట్లు అమ్మానని, వాటిని తిరిగి తనకు ఇవ్వమని అన్నాడు. దానికి నేను సమాధానంగ నేను కూడ తన వద్దనే కొన్నానని, పైగా రెండు సార్లు ధనమును చెల్లించానని, ఇది నా స్థలమని అన్నాను. నిజానికి ఆ మొత్తం స్థలము ఎనిమిది ఎకరములు. నలుగురు అన్నదమ్ములది. ఈ మధ్యవర్తి అందరిదీ కొనుటకు అగ్రిమెంట్ చేసుకుని జి.పి.ఏ తీసుకున్నాడు. నాకు మూడవ సోదరుని భూమి అమ్మాడు. ఇతర సోదరులు కూడ ఈ మధ్యవర్తితో సరైన సంబంధాలు లేక, మధ్యవర్తి వారికి పూర్తి డబ్బు ఇవ్వనందున వారివారి భూమిని వేరేవారికి అమ్ముకున్నారు. ఈ మధ్యవర్తి ఎక్కడో వేరే స్థలములో ప్లాట్లు చేసి, ఇదే సర్వే నంబరు వేసి అమ్మాడు. ఆ ప్లాట్లు కొన్నవారిని మోసం చేసాడు. తరువాత వారు మోసం తెలుసుకొని ఈయనపై తిరగబడ్డారు, కేసు వేశారు. అప్పుడు ఈయన మళ్ళీ ఈ స్థలము పైకి వస్తున్నాడు.

నిజానికి ఆ అమ్మిన ప్లాట్లు కూడ, ఆ లే అవుటును నా స్థలముపై పెట్టినచో (ఓవర్ ఇంపోస్ చేసినచో) అవి నా స్థలములోనికి రావు. ప్రక్కన ఇతర సోదరుల స్థలములోనికి వస్తాయి. పైగా ప్రతి ఒక్క ప్లాటు కూడ ప్లాటు నెంబరుతో రిజిస్ట్రేషన్ చేయబడింది. ఆ ప్లాటు నంబరు విధంగ చూచినచో ఒక రెండు మూడు తప్ప (దాదాపు 600 గజాలు) మిగిలినవి నా భూమిలోనికి రావు. కాని ఏదోవిధంగ ఆ మధ్యవర్తి బయట పడాలని భావించి, ఒకే సర్వేనెంబరు ఉండడం మూలాన ఆ ప్లాట్లు నా స్థలములో ఉన్నవని చెప్పుచున్నాడు. ప్లాటు నెంబరును లెక్క చేయకుండ కేవలం సర్వేనెంబరును మాత్రమే చూపుచు నా భూమిపైకి వస్తున్నాడు. ఆస్తి విలువ పెరిగింది కాబట్టి లాక్కోవటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇది ఈ ఆస్తి తగాదాకు మూలము, కలహానికి కారణము.

## భవిష్యత్ కలహాలను సూచించుట

ఈ మొత్తం విషయమును శ్రీవేంకటేశ్వరుడు నాకు ఏవిధంగా కలలో చూపాడో చూడండి. ఈ కలలోని భావము ఈ ఆస్తి తగాదా మొదటి నుండి చివరి వరకు జరిగే విషయమును తెలియచేసింది.

ఇది నన్ను రక్షించుటకో లేక భవిష్యత్‌లో ఇలా జరుగునని చూపాడో తెలియదు కాని, ఆయన చూపిన ప్రతి లీల అదే విధంగ జరిగింది. నేను అలా జరుగకూడదని భావించినప్పటికి అదేవిధంగ జరిగి తీరింది.

16-09-2003 : కల : ఈ కలలో ఊరిలోని మా తోటబావి కనబడ్డది. అదే బావి అదే పరిసర ప్రాంతాలు. కాని చిత్రమేమిటంటే ఆ బావిలో నీరు లేదు. బొగ్గుబావి. అతికష్టంగ లోనికి దిగే విధంగ ఉన్నది. ఒక తాడు సహాయముతో ముందు నేను ఆ తరువాత నా భార్య లోనికి దిగాము. మాకు తెలిసిన మావారైన మరో ఇద్దరు వ్యక్తులలో ఒకరు లోనికి దిగుచున్నారు. మరొకరు ఆ బావిగడ్డపై ఉన్నారట. ఇంతలోగుర్తు తెలియని వేరే కొందరు వచ్చి లోపల ఉన్న నన్ను రాళ్ళతో కొట్టుచున్నారు. ఆ రాళ్ళు నాకు తగిలే విధంగ వేస్తున్నారు. అది చూచి ఆ రాళ్ళు తాకుతాయనే భయముచే ఆ బావి లోపల అటు ఇటు పరుగెత్తుచున్నాను. ఆ రాళ్ళ నుండి తప్పించుకొంటున్నాను. కొట్టకూడదు, తాకుతాయని అరుస్తున్నాను. కాని వారు వినిపించుకోవడం లేదు. నన్ను మాత్రమే గమనించుచు, లోనుండి మాటల శబ్దమును బట్టి, ఆ శబ్దము వచ్చే దిశగ రాళ్ళను వేస్తున్నారు. దీనిని గమనించిన నేను వారు నన్ను మాత్రమే కొట్టుచుండుట వలన అరవకుమని లోనివారికి చెప్పాను. అంటే కొట్టేవాడికి శబ్దము వినిపించకుండా ప్రయత్నించాను. పైనుండి కొట్టే వారికి తెలియకుండా, వారికి కనుపించకుండా ఆ బావిలోని ఒక దరి నుండి మరో దరికి పోవుచున్నాను. ఈవిధంగ భయముతో పరిగెత్తడం వలన నా శరీరమునకు, బట్టలకు నల్లగా బొగ్గు అంటింది. అరచేతులు బొగ్గుతో నల్లగా మారాయి. తరువాత నెమ్మదిగా చాకచక్యంగా పైనవారు గమనించకుండా పైకి ఎక్కుచున్నాను. ఎక్కటానికి ప్రయత్నించాను. ఇంతలో కల చెదిరింది.

ఒక బొగ్గు బావిలోనికి అతికష్టంగ దిగడము. ఆ తరువాత గడ్డపైన ఉన్నవారు, బావిలోనున్న మమ్ములను రాళ్ళతో కొట్టుట. నేను వారికి తెలియకుండా చాకచక్యంగా తప్పించుకొనుట అన్నది నేను ఆ సమయములో ఉన్నటువంటి పరిస్థితికి అద్దంపట్టే విధంగా ఉంది. అంటే సమస్యలున్న స్థలమును కావలెనని, అతి కష్టంగ కొన్నాను. తరువాత దుండగులు దానిని ఆక్రమించుకొనుటకు ప్రయత్నిస్తారు. నాపై రాళ్ళు వేస్తారు. వాటిని తపించుకొనుటకు అక్కడక్కడ పరుగెత్తుట ఇవన్నీ కూడ తరువాత కాలములో ఈ తగాదాలో చోటు చేసుకొనునని తెలియచేసారు. అంటే వారు పెట్టే బాధలకు తాళలేకపోవుట, భయపడుట, తరువాత ఈ ఆస్తిని రక్షించుకొనుటకు అక్కడక్కడ వెళ్ళుట జరుగునని చెప్పాడు. ఈ విషయమును శ్రీవేంకటేశ్వరుడు ఇంత స్పష్టంగ తెలిపాడు. చివరికి అలాగే జరిగింది. ఇది నా ఆస్తి తగాదా విషయంలో వచ్చిన మొదటి కల.

ఈ కల తెల్లవారి నా స్థలం లోనికి ఆ మధ్యవర్తి, మరి కొంతమందితో వచ్చాడు. వారికి నాకంటే ముందే రిజిస్ట్రేషన్ అయింది కాబట్టి ఇది తమ స్థలమని నన్ను వదులుమని చెప్పారు. భయపెట్టారు. తరువాత రెండురోజులకు ఒక 25 మంది వచ్చి మా వాచ్‌మెన్‌ను మళ్ళీ భయపెట్టారు. నా స్థలములో ఫెన్సింగ్ వేసుకొని, ఇది తమ స్థలమని బోర్డుపెట్టి పోయారు. తరువాత నేను ఆ ఫెన్సింగ్‌ను బోర్డును తీసివేసాను గాని నా భూమికి అపాయము ఉందని భావించి భయపడ్డాను. ఈ ఆస్తి ప్రస్తుతము చాల విలువైంది. ఇది నాకున్న ఒకే మంచి ఆస్తి. దీనిపైన నాకు అమితమైన ప్రేమ ఉంది. పైగా దుర్మార్గుడైన ఈ మధ్యవర్తి కన్ను మళ్ళీ పడింది, ఏమగునో అని భయపడ్డాను. ఒకటి రెండు రోజులకు ఆ మధ్యవర్తి మళ్ళీ పది మందితో రావడము, వారి బోర్డు పెట్టడము నేను దానిని తీసివేయడము, పోలీసుస్టేషన్‌కు వెళ్ళడము ఇలా ఒక నాలుగైదు సార్లు జరిగింది. రోజు రోజుకు ఈ తగాదా ముదురుతున్నది. నాకు భయము పెరుగుతున్నది.

ఈ సమస్యను త్వరగ పరిష్కరించుకోదలచాను. కాబట్టి నేనే ఆ మధ్యవర్తి ఇంటికి వెళ్ళాను. నేను వారి వద్దనే భూమిని కొన్నానని, వారి సంతకము కూడ డాక్యుమెంటుపై ఉన్నదని

చెప్పాను, పైగా రెండుసార్లు ధనమును వెచ్చించానని కూడ చెప్పాను. వారి ప్లాట్లు ప్రక్కవారి పొలములో ఉన్నవని, పరిశీలించుకొమ్మని చెప్పాను. వారు ప్రక్కవారి విషయములను నన్ను అడిగి తెలుసుకున్నారు. వారి భూమిలోనికి వెళ్ళుటకు సిద్ధమైనారు. చాల ప్లాట్లు ఉన్నవని నన్ను కూడ కొంత భూమి ఇవ్వమన్నారు. నేను దానికి ఒప్పుకోలేదు. మీరు నన్ను మోసంచేస్తున్నారని మీపైన చీటింగు కేసు పెట్టుదునని ఏదేదో చెప్పాను. చివరికి వారు నావద్దకు రామని మాట ఇచ్చారు.

ఈ మధ్యవర్తి గురించి నాకు బాగ తెలుసు. మంచి మాటకారి. ఎప్పటికీ పదిమందిని వెనకేసుకొని తిరుగుతాడు. పైగా ఇంతకుముందే ఒకసారి చూచాను కాబట్టి వీరికి భయపడిపోయాను. ఇప్పుడు అంటే 2003లో నేను శ్రీవేంకటేశ్వరునికి భక్తుడను. కావున ఈ సమస్యను పరిష్కరించమని స్వామివారిని సహాయము అడిగాను. మరియు నేను నిజమైన భక్తుడను కానని అందుకే నాకు కష్టాలు వస్తున్నాయని అనుకున్నాను. మీ యందు పూర్తి విశ్వాసమున్న భక్తుడు ఎలాంటి కష్టాలకు భయపడడు. కాని నేను భయపడుతున్నాను. నాకు మీపై పూర్తి విశ్వాసము లేదని, మీకు సరైన భక్తుడిని కానని బాధపడ్డాను. చివరికి ఆస్తి పోతుందని భావించి రక్షించమని వేడుకున్నాను. సం॥ 2000 నుండి నేను చాల మారిపోయాను. ఇతరులతో కలిసేవాడిని కాను, ప్రతిక్షణం స్వామి స్మరణలోనే గడిపేవాడిని కాబట్టి మిత్రులతో సహవాసమును తెంచుకున్నాను. ఒంటరి జీవితము, స్వామి స్మరణ తప్ప మరో ప్రపంచము లేదు. తేది 13-10-2003 నాడు ఈ దుండగులు మరోమారు ఆక్రమణ చేసారు. ఆరోజు 25 కి.మీ. దూరంలోని స్థలము వద్దకు పోయి, వారితో గొడవ పడి నీరసించి అలసిపోయి ఆఫీసుకు వచ్చాను. తరువాత అనుకోకుండా స్వామివారితో ఇలా ప్రార్థించాను. "శ్రీవేంకటేశ్వరా నేను ఒంటరివాణ్ణి, నాకు వెనకా ముందు ఎవ్వరు లేరు. కేవలము మిమ్ములనే నమ్ముకున్నాను" రక్షించమని ప్రార్థించాను. "నేను ఒంటరివాణ్ణి, నాకు వెనుకా ముందు ఎవ్వరు లేర"నే మాట ఆనాటి నా పరిస్థితుల ప్రభావము వలన అప్రయత్నంగా నా నోటి నుండి వచ్చిందే తప్ప నేను కావాలని అనలేదు. ఈవిధంగా వేడుకునే సమయాన నా మనస్సు ఆయనపై పూర్తిగా లగ్నమైంది. కళ్ళ నుండి నీరు జలజల కారింది. నా స్వామి నన్ను తప్పక కరుణించుననే నమ్మకం నూరుపాళ్ళు ఏర్పడింది. మరియు ఈ మధ్యవర్తి చాలమందిని మోసం చేస్తున్నాడని, ఈయనను ఒక నాటకం ఆడించి శిక్షించమని కూడ వేడుకున్నాను.

నా ప్రార్థనను విన్న శ్రీవేంకటేశ్వరుడు ఆ మధ్యవర్తిని మంచి నాటకం ఆడించాడు. మరియు నా ముందు వెనుక తానున్నానని చెప్పాడు. సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడు నీ ముందూ వెనుక ఉన్నానని చెప్పినప్పుడు ఒక భక్తుడు పొందే ఆనందం వర్ణనాతీతం. ఏకాకిగా ఉన్నా ఎవ్వరినీ లెక్కచేయకుండా బలమైన ఆత్మవిశ్వాసంతో జీవించగలం. మన పగవారు ఎంత హింస పెట్టినా నాకు రక్షణగా భగవంతుడున్నాడనే విశ్వాసముతో, ఆ బాధలు నన్నేమి చేయలేవనే నమ్మకముతో ఉండగలము. ఈరోజు రెండు కలలు కన్నాను. నాకు విరుద్ధంగా నన్ను హింసించడానికి నా శత్రువులు నాట్యమాడుదురని, ఆనందకేళి జరుపుకుంటారని చూపాడు. రెండవది నా వెనకా ముందు ఉన్నానని భయపడకుమని సూచించాడు. ఆ లీలలు ఈ విధంగా ఉన్నవి.


14-10-2003 కల : నేను మా ఇంటిలో టి.వి. ముందు కుర్చీలో కూర్చుండి వార్తలను చూస్తున్నాను. ఆ టి.వి స్క్రీను పైన మా ఊరి మిదుదొడ్డి ఎల్లయ్య (హరిజనుడు) అనే వ్యక్తి ప్రక్కవారు కొట్టే డప్పుల చప్పుడుకు, ఆ చప్పుడు యొక్క ట్యూన్‌తో గంతులు వేస్తూ నాట్యం చేస్తున్నాడు. ఊరిలో పెండ్లి మొదలగు సందర్భాలలో డప్పుల చప్పుడుకు ఎలా ఎగురుదురో అలాగే ఎగురుతున్నాడు. పంచె కట్టుకుని గోచీ పెట్టుకొని ఎగురుతున్నాడు. అంగీ ధరించలేదు. తన కుడి చేతి రెండు వ్రేళ్ళను నోటిలో పెట్టుకొని ఉయ్ ఉయ్ మని విజిలేసుకుంటు పిచ్చిగంతులేస్తున్నాడు. ఒక్కొక్కప్పుడు తన చేతిలోని ఒక వేలును చూపుచు, ఆ డప్పులు ఇలా కొట్టాలని సంకేతమిచ్చుచు ఎగురుతున్నాడు. అతని భాషలో అది నాట్యం. ఆ డప్పుల చప్పుడుకు తగినట్లుగానే, ట్యూన్‌కు తగినట్లుగానే ఆడుతున్నాడు. చప్పుడుకు మరింత ఉత్సాహంగ గంతులపై గంతులు వేస్తూ ఆడుతున్నాడు. కల చెదిరింది.

నన్ను భయపెడుతున్న వ్యక్తి ఇదే విధంగ ఉన్నాడు. ఈయన కూడ హరిజనుడే (ఒక్కొక్కప్పుడు ఎస్.సి ఆక్ట్ పెట్టుదునని బెదిరించే వాడు). తన మద్దతుదారులు లేనప్పుడు చెప్పితే కొంత ఒప్పుకునే రకమే కాని తన చుట్టు ఉన్న పరివారము మహా విషపూరితులు. వారు ఎలా చెప్పితే అలా నడుచుకునే వాడు. ఇతరుల మాట విని వారి ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా నాట్యం చేయునని దీనర్థం. మహా నైపుణ్యముతో నాట్యం చేయుచు కేరింతలు వేయుచు ఆనందించుదురని దీనర్థం. ఈ కలను కన్న రోజు ఆ దుండగులను నా పక్షాన నాట్యం ఆడించునని, మరెవ్వరిని మోసం చేయకుండ చూచునని అనుకున్నాను. కాని కాలం గడిచిన కొద్దీ నాకు వ్యతిరేకంగా నన్ను భయభ్రాంతుణ్ణి చేయుటకు ఆడించాడు. ఈ సంఘటన తరువాత శత్రువుకు కూడ హాని కలగాలని భగవంతుడిని ప్రార్థించకూడదని భావించాను.

## ముందూ వెనుక ఉన్నానని సూచించుట

ఇక రెండవ కల అత్యంత విలువైంది. ఆస్తి నష్టము అనే నెపమును కల్పించి జీవితం ధన్యం చెందే విధంగా అనుగ్రహించాడు. ఒక భక్తుడు పొందగోరే కల. ఇది నా జీవితంలో అమూల్యమైన ఘటన, జన్మను సార్థకము చేసే సంఘటన. ఎప్పుడూ మరిచిపోనిది. శ్రీవేంకటేశ్వరునికి కొన్ని కోట్ల నమస్కారములు పెట్టినా ఆయన ఋణమును తీర్చుకోలేని సంఘటన. భగవంతుడు భక్తుడికి అభయమిచ్చిన రోజు. నా జీవితము ధన్యతనొందిన రోజు. నేను ఇంతకంటే వేరేదీ ఆశించనిరోజు. నిర్భయంగా జీవితమును గడుపుమని అభియమిచ్చిన రోజు. నన్ను భాగ్యవంతుణ్ణి చేసిన రోజు. ఈ కల ద్వారా శ్రీవేంకటేశ్వరుడు నాకు అభయమిచ్చాడు. నేను ఒంటరివాణ్ణి, నా వెనుకా ముందు ఎవ్వరు లేరని భావించి బాధపడుచున్న నాకు “నీ వెనుకా ముందు నేనున్నా” నని అభయమిచ్చిన ఘటన. ఈ కలను శ్రీవేంకటేశ్వరుడు స్పష్టంగ అర్థం అయ్యే విధంగా, తాను చెప్పబోయే విషయమును సులభంగ గ్రహించే విధంగా చూపాడు. నా జీవితంలో శ్రీవేంకటేశ్వరుడు ప్రసాదించిన ఎన్నో ఆణిముత్యాలలో ఇది ఒకటి. ఆ లీల ఈ విధంగ ఉంది.

14-10-2003 రెండవ కల : నేను నా భార్య సురేఖ మరియు మరికొంత మంది బంధువులతో కలిసి ఒక దూరపు దేవాలయమునకు పూజ నిమిత్తమై వెళ్ళాము. ఆ దేవాలయము మా ఇంటికి చాల దూరంగ ఉంది. కావున మేము ఉదయము బయలుదేరి సాయంత్రము వరకు ఆ దేవాలయమునకు చేరుకున్నాము. అది చాల విశాలమైన, పురాతనమైన దేవాలయము. ఆ దేవాలయము ఊరి బయట ఉంది. ఈ ఆలయానికి ఒక 40 అడుగుల ఎత్తు గల గాలిగోపురము ఉంది. మేము ఆ గోపురము గుండా లోనికి వెళ్ళాము. అక్కడ భక్తులు పడుకోవటానికి సరైన వసతులు లేవు. మేము ఆ దేవాలయమునకు వెళ్ళేసరికి రాత్రి అయింది. పూజ సమయము దాటిపోయింది. కాబట్టి ఈ రాత్రి అక్కడనే పడుకొని తెల్లవారి లేచి పూజ చేసుకొని తిరిగి ఇంటికి వెళ్ళుదామని నిర్ణయించుకున్నాము. అక్కడ విశ్రమించుటకు వసతులు లేవు కావున మా వారందరు ఒక్కొక్కరు నాకు తెలియకుండానే ప్రక్క ఊరికి పడుకోవడానికి వెళ్ళిపోవుచున్నారు. నేను కూడ వారిలాగానే వెళ్ళిపోవుచున్నాను. ఇంతలో ఒక అదృశ్య వ్యక్తి వచ్చి నాకు చాల మర్యాద చేస్తున్నారు. ఈ వ్యక్తి నాకు కనబడలేదు కాని ఆయన మాటలు మాత్రము స్పష్టంగ వినిపిస్తున్నవి. “మీరు చాల ముఖ్యమైన వారు” అని నన్ను గౌరవిస్తున్నారు. నన్ను బయటకు వెళ్ళవద్దని ప్రార్థిస్తున్నారు. ఆ ఆలయములో ఒక ప్రక్క మంచి అందమైన గది ఉంది. ఆ గది తలుపులకు అందమైన అద్దాలు బిగించబడ్డవి. ఆ గదిలో పరుపు, దానిపై తెల్లని దుప్పటి పరిచి ఉంది. ఆ గదికి క్రింది నుండి మూడున్నర అడుగుల ఎత్తు వరకు పాలపిట్ట రంగు వేయబడి ఉంది. పైన గోడలకు తెల్లని సున్నం వేయబడింది. తలుపులు కూడ పాలపిట్ట రంగుతో ఉన్నవి. వాటికి మూడున్నర అడుగుల ఎత్తుపైన తెల్లని అద్దాలు బిగించబడి ఉన్నవి. ఆ గదిలోని తెల్లటి పరుపుపైన మంచి తెల్లని వస్త్రమును కలిగిన దిండ్లు కూడ ఉన్నవి. ఈ విధంగా ఆ గది మంచి అందంగా, వెనుకటి




స్వామి వారు నా ముందు వెనక ఉన్నానని చూపుట

స్వాములు నివసించే గది మాదిరిగా ఉంది. ఆ గదిని చూచిన ప్రతివారు ఇది మంచి పేరొందిన స్వాములు పడుకునే గది అని అనుకుంటారు. ఇదే విషయమును నాకు నా వెనకనుండి ఎవ్వరో చెప్పారు. లేదా ఆకాశము నుండి మాటలు వినబడ్డవి. "ఇది స్వాములు పడుకునే గది" అని అన్నారు. నన్ను మర్యాద చేస్తున్న ఆ అదృశ్య వ్యక్తి నన్ను ఈ రాత్రికి ఈ గదిలో పడుకోమన్నాడు. నేను మాత్రం ఈ గదిలో పడుకోలేను. ఇది స్వాములవారి గది. నేను యోగ్యుణ్ణి కాను అన్నాను. కాని ఆ వ్యక్తి మాత్రం "మీరు చాల గొప్పవారు ఈ రాత్రి ఈ గదిలోనే పడుకోవాలి" అని బలవంతపెట్టాడు. ఇది చూచి నా భార్య కూడా సరేనని తాను మరియు ఇతర బంధువులు బయట ఊరిలోనికి వెళ్ళిపోయారు. నన్ను ఇక్కడనే పడుకోమన్నారు. నేను ఈ గదిలో పరుపుపై ఒంటరిగ పడుకుని నిద్రపోయాను.

తరువాత కొంతసేపటికి మావారు ఎవరో వచ్చి తెల్లవారింది, పూజా సమయమైంది లేవమని నన్ను లేపారు. నేను లేచేసరికి ఇద్దరు శ్రీ వైష్ణవ స్వాములు నాకు ఇరు వైపుల, నన్ను తాకుచు పడుకొని ఉన్నారు. వారి వయస్సు దాదాపు 25 నుండి 26 వరకు ఉంటుంది. మంచి యువకులు, ఇద్దరు కూడ పంచె కట్టుకున్నారు. జంధ్యం వేసుకున్నారు. తలపై వెనుక భాగమున మాత్రమే వెంట్రుకలు ఉన్నవి. వైష్ణవ స్వాముల మాదిరిగనే శిఖ ముడుచుకున్నారు. ఛామనఛాయతో మంచి శరీర సౌష్ఠవము కలిగి ఉన్నారు. వీరు ఆరడుగుల ఎత్తు ఉన్నారు. మంచిముఖవర్చస్సు కలిగి, ఉబ్బు చెంపలతో ఉన్నారు. వీరిద్దరు ఊర్ధ్వపుండ్రాలను ధరించినప్పటికి కొంత చెదిరి పోయిన ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. ఇద్దరూ ఒకే ఆకారముతో ఒకరికొకరు ప్రతిబింబములాగ ఉన్నారు. వీరిని చూడగానే వీరు వైష్ణవ స్వాములని స్పష్టంగ చెప్పగలము. ఈ ఇద్దరు స్వాములు కూడ నావైపే ముఖము చేసి నన్ను మధ్యలో వేసుకొని, నన్ను తాకుచున్నారు అనే విధంగ నాకిరుప్రక్కల పడుకున్నారు. ఆ సమయాన నేను ఒక ప్రక్కకు ముఖము చేసి పడుకున్నాను. నా ఒక చేతిని మడుచుకొని, దానిని దిండుగ చేసుకొని దానిపై తలపెట్టి ఒక వైపుకు ముఖముచేసి నిద్రిస్తున్నాను. మావారు తెల్లవారింది పూజ సమయమైంది లేవండి అని లేపేసరికి నేను లేచాను, నాకు ఇరువైపుల ఉన్న వైష్ణవస్వాములను చూచాను. అంటే నా వెనుకాముందు స్వాముల వారే ఉన్నారు. ఆ దృశ్యమును చూచి ఆశ్చర్యపోయాను. ఈ స్వాములు ఎప్పుడు వచ్చి పడుకున్నారు? అని ఆలోచించాను. ఆ తరువాత కలలోనే ఇలా అనుకున్నాను. "శ్రీవేంకటేశ్వరుడు నాకు ముందూ వెనుక ఉన్నాడని" ఇలా తెలియ చేసాడని అనుకున్నాను. నేను లేచి కూర్చున్నాను. మా బంధువులు, నా భార్య అందరూ కలిసి ఆ ఆలయంలో దూరంగా రావిచెట్టు క్రింద ఉన్న దేవుళ్ళకు కలిసి పూజలు చేస్తున్నారు. ఈ దృశ్యమును చూచాను. ఆ దేవుళ్ళు కూడ నాకు నల్లగ కనబడ్డారు. ఈ కలలో నా స్వామి శ్రీవేంకటేశ్వరుడు నన్ను మరువలేదు. తన హృదయంలో భద్రపరచుకున్నాడని అనుకుంటూ నమస్కరించాను. కల చెదిరింది.

తెల్లవారి ఈ కలను విశ్లేషించాను. గతరోజు నా వెనకాముందు ఎవ్వరు లేరు అని అన్నదానికి నా ముందూ వెనుక నేనున్నానని తెలిపారని భావించాను. చాల ఆనందించాను. నా జీవితం ధన్యమైందని భావించుకున్నాను. శ్రీవేంకటేశ్వరుడు నావైపు ఉన్నాడు కాబట్టి నా సమస్య నావైపు తప్పక అవుతుందని, నా బాధలు తాత్కాలికమని ప్రగాఢ విశ్వాసం ఏర్పడింది. ఆ తరువాత నా శత్రువులకు భయపడలేదు. వారు ఏమి చేసినా నా స్వామి నన్ను రక్షించునని, నా ఆస్తి నాకు తప్పక దక్కుతుందని విశ్వాసంతో ఉండేవాణ్ణి. అంతే కాకుండా నా శత్రువులు కాంప్రమైజింగ్ మాట్లాడుకుందామన్నా నేను స్వామివారిపై గల విశ్వాసముచే, కల ప్రభావముచే వినలేదు. ఎంతో కొంత ఇవ్వండి వెళ్ళిపోతాము అని వారు ఎన్నిసార్లు అడిగినా నేను ఒప్పుకోలేదు. వారితో కాలు దువ్వడానికి సిద్ధపడ్డాను. ఒక రకంగా ఈ కలహము ఇంకా ముదరటానికి కారకుడనయ్యాను.

నా దశ : ప్రథమ ఏడుకోట్ల జపాన్ని స్వామివారు స్వీకరించి నన్ను ఆనందపరచారు. వారి దివ్యపాదాలను తనివి తీరా చూపెట్టారు. నమో వేంకటేశాయ రథం ఏర్పాట్లు జరుగుచున్నవి. స్వామివారి శిక్షణ ప్రారంభమైంది. నా ముందూ వెనుక స్వామివారు ఉన్నారని ధైర్యము ఇచ్చారు.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

**(సశేషం)**


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

**Visit: www.srivenkatesham.org**



# ధనుర్మాసము – తిరుప్పావై

: చిల్లర సీతారామారావు

సంవత్సరానికి పన్నెండు నెలలు. పన్నెండు రాశులు. రవి ప్రతి మాసమున ఒక్కొక్క రాశి యందు సంచరిస్తుంటాడు. దానిని సంక్రమణము అని అంటారు. రవి ధనూరాశి యందు ప్రవేశించిన దినమునుండి మకరరాశియందు ప్రవేశించువరకు గల మధ్య దినాలను ధనుర్మాసము అంటారు. ఈ కాలము డిసెంబర్ మధ్యలో మొదలై జనవరి మధ్యలో అంతమందును. అనగా సంక్రాంతి ముందు ముప్పై రోజులు ధనుర్మాసము. ధనుర్మాసము విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన మాసము. ఈ మాసమున వైష్ణవాలయాలు అన్నీ కళకళలాడుతూ ఉంటాయి. విష్ణుమూర్తిని మధుసూదనుడు అనే పేరుతో అర్చిస్తుంటారు. తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి సుప్రభాతము మొదలు తిరుప్పావై గానం చేస్తారు. తులసీదళాలకు బదులు బిల్వపత్రాలతో అర్చిస్తుంటారు. ఆండాళ్ పేరుతో పిలువబడు గోదాదేవి పూజ, గోదా కళ్యాణం, ప్రసాదాలు మున్నగునవి వైష్ణవాలయాలలో నిర్వహిస్తుంటారు. ధనుర్మాసము నందు మొదటి పదిహేను రోజులు చక్కెరపొంగలి, పులగం, తరువాతి పదిహేను రోజులు దద్ధ్యోదనం ప్రసాదాలుగా భక్తులకు పెడతారు. మహిళలు, బాలికలు తెల్లవారు జాముననే నిద్ర లేస్తారు. ముంగిళ్ళు తుడిచి కళ్ళాపి చల్లి ముగ్గులు పెట్టి ఆ ముగ్గుల మీద గోమయముతో ముద్దలు చేసి ఉంచుతారు. వానికి వరిపిండితో కుంకుమలతో బొట్లు పెట్టి పైన పువ్వులు గుచ్చుతారు. వాటిని పూలతో పూజిస్తారు.

**"సుబ్బి గొబ్బెమ్మా శుభములియ్యవే**
**తామరపూవంటి తమ్ముణ్ణియ్యవే**
**చేమంతిపూవంటి చెల్లెల్నియ్యవే**
**బంతిపూవంటి బావనియ్యవే**
**మల్లెపూవంటి మామనివ్వవే**
**మొగలిపువ్వంటి మొగుణ్ణివ్వవే"**

అంటూ గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుకుంటూ ఆనందపడతారు. గడపలకు పసుపు రాసి కుంకుమబొట్లు పెడతారు. గుమ్మములకు తోరణాలు కడతారు.

శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'మాసానాం మార్గశీర్షోహం' అని చెప్పి ఉన్నాడు. ఈ వాక్యము ఈ మాసపు గొప్పతనాన్ని విశద పరుస్తున్నది. ఇంతటి విశిష్టతను కలిగిన ఈ మాసమునే ధనుర్మాసము అని కూడా అంటారు. దీనికే మరోపేరు మార్గళి. విష్ణు భక్తులు విష్ణుమూర్తిని విశేషముగా ఆరాధిస్తుంటారు. వేకువననే లేచి స్నానాదికములు ముగించుకుని గోదాదేవిని స్మరించుకుంటూ ఆమెచే రచింపబడిన తిరుప్పావై పఠిస్తుంటారు. గానం చేస్తుంటారు. ధనుర్మాసమున తిరుప్పావై గానం చేయడం, వైష్ణవాలయాలను దర్శించడం, కాత్యాయనీ వ్రతమాచరించడం,

ధనుర్మాస వ్రతము ఆచరించడం మున్నగునవి ఆచరించవలెనని శాస్త్రోక్తి. తిరుప్పావై అనగా (శ్రేష్ఠమైన వ్రతము) శ్రీవ్రతము అని అర్థము. శ్రీవ్రతము ఆచరించినట్లయితే మనోభీష్టాలు పొందవచ్చునని గోదాదేవి నిరూపించింది. కన్నెపడుచులు, సుమంగళులు, ముత్తైదువలు కానివారు, బాలబాలికలు, వృద్ధులు ఎవరైననూ ఈ వ్రతమును ఆచరించుటకు అర్హులే. ధనుర్మాసమునందు ధనుర్మాస వ్రతమును ఆచరించేవారు వేకువనే లేచి స్నానాదికాలు ముగించుకోవాలి. శక్త్యానుసారము విష్ణు ప్రతిమను చేయించి, పంచామృతములతో మహావిష్ణువును అభిషేకించాలి. తులసీదళాలు, బిల్వపత్రాలతో పూజించాలి. అష్టోత్తర నామాలు పఠించాలి. పిదప నైవేద్యం సమర్పించాలి. ఈవిధముగా ముప్పై రోజులు పూజించిన తరువాత విష్ణు ప్రతిమను సద్బ్రాహ్మణునకు దానమివ్వాలి. దక్షిణ తాంబూలాదులను సమర్పించాలి. ఇలా ధనుర్మాస వ్రతమును ఆచరించినవారు మోక్షమును పొందగలుగుతారు. దానము ఇచ్చునప్పుడు ఈ క్రింది శ్లోకమును పఠించి ఆశీస్సులు అందుకోవాలి.

**శ్లో ॥ "మధుసూదన దేవేశ ధనుర్మాస ఫలప్రదా**
**తవమూర్తి ప్రదానేన మమ సంతు మనోరథాః"**

తిరుప్పావై రచయిత్రి గోదాదేవి జీవిత చరితమును ఒకసారి స్మరించుకుందాం. తమిళనాడులో పాండ్యదేశమున ఉన్న నగరములలో మేలుబంతి విల్లిపుత్తూరు. ఇది ఒక గొప్ప క్షేత్రం. ఇక్కడ శ్రీమహావిష్ణువు వటపత్రశాయిగా పూజలందుకుంటున్నాడు. ముకుందాచార్యులు, పద్మావతి దంపతులకు ఒక మగ సంతానము కల్గింది. ఆ శిశువుకు భట్టునాథుడు అని నామకరణం గావించారు. భట్టునాథునికే విష్ణుచిత్తుడని మరొక పేరు ఉంది. అతడు విష్ణుభక్తుడు. పద్మవదనుడు. భాగవతులలో శ్రేష్ఠుడు. శీతోష్ణ సుఖ దుఃఖాలను ద్వంద్వములను దాటిన ఉత్తముడు. విష్ణుమూర్తిని తన ధ్యానము చేత తన హృదయము నందు ప్రతిష్ఠించుకున్న భక్తుడు. జీవేశ్వర భేద జ్ఞానము కలవాడు. భగవంతుని సేవకే తన జీవితము అని భావించే భక్తశిఖామణి. విష్ణుమూర్తి పూజ నిమిత్తము ఆవశ్యకమైన పూలు, తులసీదళాలు మున్నగు వాటి నిమిత్తము ఒక ఉద్యానవనమును ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తోట నుండి పూలు, తులసీదళాలు సేకరించి ఒక మాలగా కట్టి భగవంతునికి సమర్పించేవాడు.

ఒకనాడు పూలు, తులసీదళాలు కోసం ఉద్యానవనమునకు వెళ్ళిన విష్ణుచిత్తునకు ఒక తులసిచెట్టు దగ్గర ఒక ఆడ శిశువు కన్పించింది. ఆ శిశువును చూడగానే ఆశ్చర్యపోయాడు. నా పుణ్యము ఫలించింది. సంతానము లేదని బాధపడుతున్న నాకు, భగవంతుడు జనక మహారాజుకు సీతను ప్రసాదించినట్లు ఈ శిశువును ప్రసాదించాడు అని భావించి ఆ శిశువును ఇంటికి తీసుకొని వచ్చి భార్యకు అందించాడు. భార్య కూడా ఆ శిశువును ఆనందముతో అక్కున చేర్చుకుంది. భగవంతుని కృపచే చేపునకు వచ్చిన తన స్తన్యమును శిశువు నోటికిచ్చి తన అదృష్టానికి పొంగిపోయింది. తులసి వనములో లభ్యమగుట వలన ఆ శిశువును కోదై అని పిలువసాగారు. ఆ పేరే క్రమంగా గోదాదేవిగా మారిపోయింది. తండ్రి దగ్గర భాగవత రామాయణాలను విని గోదాదేవి భక్తి జ్ఞాన వైరాగ్యాలను అలవరచుకుంది. కృష్ణలీలల వర్ణనలు విని పరవశించి పోయేది. శ్రీకృష్ణుడిని తన భర్తగా ఊహించుకొని పొంగిపోయేది. అల్లారుముద్దుగా పెరుగుతున్న గోదాదేవి యుక్తవయస్కురాలైంది. విష్ణుచిత్తుడు ప్రతినిత్యం పూలు, తులసీదళాలతో ఒక మాల కట్టి ఒక బుట్టలో పెట్టెడి వాడు. కార్యక్రమాలన్నీ పూర్తయిన తరువాత ఆ బుట్టలోని మాలను తీసుకొని వెళ్ళి భగంతుడికి సమర్పించెడివాడు. గోదాదేవి తండ్రి లేని సమయంలో ఆ పూలమాలను ధరించేది. తన అందాన్ని బావిలోని నీటిలో చూచుకొని ఆనందపడేది. తర్వాత ఆ మాలను తీసి యథాస్థానములో నుంచెడిది. ఇది గమనించని విష్ణుచిత్తుడు ఆ మాలనే భగవంతునికి సమర్పించెడివాడు. ఒకనాడు విష్ణుచిత్తుడు గోదాదేవి పూలమాలను ధరించి బావిలోని నీటిలో తన అందాన్ని చూచుకొని మురిసిపోవడం గమనించాడు. భగవంతునికి సమర్పించాలనుకున్న మాల అపవిత్రమైనదని దుఃఖించాడు. మాలను భగవంతుడికి సమర్పించలేదు. మథనపడుతున్న విష్ణుచిత్తుడికి కలలో శ్రీరంగనాథుడు దర్శనమిచ్చి ఇలా అన్నాడు. గోదాదేవి సాక్షాత్తు భూదేవి అవతారమే. నాకు పూలమాలను సమర్పించడానికే ఆమె అవతరించింది. ఆమె ధరించిన మాలయే నాకిష్టము. ఆ మాలనే నాకు సమర్పించుము. ఈ పలుకులు వినిన విష్ణుచిత్తుడు ఆనందభరితుడైనాడు. గోదాదేవి శ్రీరంగనాథుని తన భర్తగా చేసుకోవాలని అనుకున్నది. దానికోసం ద్వాపరయుగమున గోపికలు ఆచరించిన కాత్యాయనీ వ్రతము అనెడి ధనుర్మాస వ్రతమును ఆచరించింది. ఆ సమయములో స్వామివారి గుణాలను వర్ణిస్తూ తిరుప్పావైను రచించింది. రోజుకో పాశురం చొప్పున ముప్పై రోజులు ముప్పై పాశురాలను రచించి స్వామి వారికి సమర్పించింది. గోదాదేవి భక్తికి ప్రసన్నుడైన శ్రీరంగనాథుడు ఆమెను పల్లకిలో శ్రీరంగమునకు రమ్మని చెబుతాడు. విష్ణుచిత్తునికి కలలో కనిపించి గోదాదేవిని నేను వివాహమాడుతాను. ఆమెను తీసుకొని శ్రీరంగమునకు రమ్మని పలకుతాడు. విష్ణుచిత్తుడు పరమానందభరితుడై గోదాదేవిని శ్రీరంగమునకు తీసుకొని వెళ్ళి శ్రీరంగనాథుడితో పరిణయము గావిస్తాడు. గోదాదేవి భక్తిప్రపత్తులతో శ్రీరంగనాథుడి

చరణములకు ప్రణమిల్లి స్వామిలో ఐక్యమైపోతుంది.

తిరుప్పావై ఒక దివ్య ప్రబంధము దీనిని రచించినది ఆండాళ్. ఈమెనే గోదాదేవి యని కూడా అంటారు. ఆండాళ్ అనగా రక్షకురాలు అని అర్థము. తిరుప్పావై లోని పాశురాలు ముప్పై. ఈ ముప్పై పాశురాలు భక్తి విశ్వాసాలకు ప్రతీకలు. సర్వమానవాళికి ఇదొక విజ్ఞాన ఖని. వేద పురాణ ఉపనిషత్తుల సారాంశమే తిరుప్పావై. ఒక్కొక్క పాశురము మానవ జన్మకు సార్థకాన్ని, సాఫల్యతను ప్రసాదిస్తుంది. పాశురాలు మధుర భక్తికి చిహ్నాలు. వ్రతోద్దేశ్యము, వ్రత నియమాలు, వ్రతాచరణము వలన ప్రాప్తించు శుభాలు, శ్రీకృష్ణుని మేలుకొలుపులు, పల్లెసీమల అందాలు, ఫలశ్రుతి మున్నగునవి ముప్పై పాశురములలో మనోహరంగా వర్ణించబడ్డాయి.

శ్లో ॥ "స్వోచ్ఛిష్ట మాలికా బంధ, గంధ బంధు రజిష్ణవే
మాద్యశాకించిన త్రాణ, బద్ధ కంకణ పాణయే
విష్ణుచిత్త తనూజాయై, గోదాయై నిత్య మంగళమ్"

తాను తాల్చి విడిచిన మాలయొక్క కస్తూరికా గంధ ప్రియత్వముచే బాంధవ్యము కలిసిన విష్ణువు కలది, నావంటి పేదలను రక్షించుటకై కంకణము కట్టుకొన్న పాణి గలది, మహాత్ముడగు విష్ణుచిత్తుని కుమార్తె యగు గోదాదేవికి నిత్యమంగళమగు గాక.

# విదురుడి ఉద్బోధ

- పి.యల్.నరసింహాచార్య దాసన్

విదురుడు ఒక ధర్మవేత్త. ధృతరాష్ట్రునికి మంత్రి. కౌరవులకూ పాండవులకూ యుద్ధం తప్పదని తెలుసుకున్నాక అతనికి అనేక సందేహాలొచ్చాయి.

విదురుడిని పిలిచాడు. తన సందేహాలను చెప్పి విదురుడిని సలహా అడిగాడు.

ఆయన సందేహాలకు విదురుడిచ్చిన సలహాలన్నీ రతనాల మూటలు. సంశయ విచ్ఛేదకాలు.

గోవింద నామస్మరణ చేయనివారు మూఢులు. భగవన్నామ స్మరణ చేసినవారు వివేకవంతులు. వివేకం లేనివారు మూర్ఖత్వమని ధర్మవేత్తల అభిప్రాయము.

తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అని మూఢులు వాదిస్తారు. అటువంటి వారితో మనమెవరైనా వాదిస్తే మనదీ మూర్ఖత్వమే అవుతుంది. చేరి మూర్ఖుని రంజింపరాదు అని శతకనీతి కదా.

జన్మతః ఎవరూ మూర్ఖులు కారు. బాల్యంలో మాటలే రావు కదా. యౌవనములో ఏదో ఒక విధమైన ఆలోచనలతో మోసపోతూ ఉంటారు.

మధ్యవయస్సులో ఆ ఆలోచన మారిపోతుంది. వృద్ధాప్యంలో మరొక విధమైన భావం కలుగుతుంది. ఈ దశల్లో ఎప్పుడో ఒకప్పుడు మూఢత ప్రవేశించవచ్చును. మూఢుడు చెవిటి వానితో సమానము. అలాంటివారితో వాదించడం నిష్ప్రయోజనం. శంఖమూదితే లాభం లేదు. దాన్ని కొరకాలంటే నీ తాతలు దిగి రావాలి అనేవాడితో వాదించడం కంఠశోష. విదురుడు అంధరాజుకు ఒక విరుగుడు మార్గాన్ని చెప్పాడు.

ధర్మ మార్గాన్ని అనుసరించడమే.

పాండవులకు అర్ధరాజ్యాన్ని ఇవ్వడమే యుద్ధ నివారణకు ఏకైక మార్గము. వారికి, వారి ధర్మపత్ని ద్రౌపదికి క్షమాపణలను చెప్పు.

ఆ మాటలను వినగానే అంధరాజు కోపించాడు. విదురా! నీది పక్షపాత బుద్ధి. నీ స్వభావం వక్రం. నీవు నా ఆస్థానంలో ఉన్నా – లేకపోయినా ఒక్కటే అని అన్నాడు కోపంతో. అయినా విదురుడు మరలా చెప్పినాడు.

బలవంతుడితో విరోధమున్నవాడికీ – సంపద పోయినవాడికీ – కాముకుడికీ – దొంగకూ – నిద్రపట్టదు రాజా. తన శక్తిని అనుసరించి చేసేవాడు – దేన్నీ అల్పంగా భావించనివాడూ – పోయినదాన్ని గురించి ఆలస్యంగానైనా విచారించనివాడూ – నిజమైన పండితుడు.

సన్మానిస్తే పొంగిపోడు – అవమానానికి క్రుంగిపోడు. తన పనిని వదిలేసి మిత్రుడికి సహాయమంటూ వ్యర్థంగా ప్రవర్తించేవాడూ మూర్ఖుడే. ప్రతిదాన్నీ అనుమానిస్తూ ఆలస్యంగా పనిచేసేవాడూ మూర్ఖుడే. అతిగా వాగేవాడూ – సమర్థత లేకపోయినా బలవంతుల మీద కోపాన్ని ప్రదర్శించేవాడు మూర్ఖుడే. ఇంకా ఇలాంటి నీతులను చెప్పాడు ఆ రాజుకు.

శ్రీకృష్ణుడు రాయబారానికి రావడం విదురుడికి ఇష్టం లేదు. ఎందుకంటే అది వృథా ప్రయాస. ఇరు వర్గాల మధ్య యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నించినాడు.


సుయోధనుడు తన ప్రయత్నాన్ని అనుమానించినా విదురుడు పట్టించుకోలేదు. తనపై ఆధారపడిన వారికి భోజనాన్ని పెట్టకుండా – తాను కడుపునిండా తిని – మంచి వస్త్రాలను ధరించి కనపడేవాడు మహామూర్ఖుడు అని విదురుడు ఎంతగానో చెప్పినాడు. ఇతని నీతులను విదుర నీతులని అంటారు. ఎల్లకాలమూ అందరూ పాటించే నీతులు.

ఇటువంటి విషయాలను మన పెద్దలు వారి వారి సంతానానికి వివరంగా చెప్పాల్సిన అవసరముంది కదా! ఆలోచించాలి.

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

## సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ - 500007.
ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**



# భక్త తులసీదాసు

- గోనుగుంట మురళీకృష్ణ

తాటాకులతో కప్పిన కుటీరం లాంటి చిన్న పూరిల్లు అది. ఆ ఇంటి వాకిలి శుభ్రంగా ఊడ్చి, నీళ్ళు చల్లి రంగవల్లులు దిద్ది ఉన్నాయి. ఆ ఇంటి ఆవరణలోనే అరటి, వేప, మామిడి మొదలైన చెట్లు ఉన్నాయి. సరయూనది మీద నుంచీ వచ్చే చల్లని గాలులకి చెట్ల కొమ్మలు కదులుతూ మరింత చల్లగా వీస్తున్నాయి. సమీపంలోని బావి నుంచి నీళ్ళుతోడి, కడవతో చంకన పెట్టుకుని ఇంట్లోకి వస్తున్నది ఒకామె. ఆమె గర్భవతి అని ఎత్తుగా ఉన్న పొట్ట తెలియజేస్తున్నది.

బయటనుంచీ వస్తున్న ఆత్మారామ్ "అయ్యయ్యో! హులసీ! నిన్ను బరువులెత్తవద్దని ఎన్నిసార్లు చెప్పాను? అసలే ఒట్టి మనిషివి కూడా కాదు" అన్నాడు. నీళ్ళకడవ కింద పెట్టి కొంగుతో చేతులు తుడుచుకుంటూ "బాగుందండీ! మన ఇంటి పనులు మనం చేసుకోక ఎవరు చేస్తారు? మనకేమైనా నౌకర్లా! చాకర్లా!" అన్నది హులసి.

"ఆ పనులన్నీ నేను చేస్తాను గానీ, నువ్వు ఈ పళ్ళు తిని, త్వరలోనే పండంటి బిడ్డని ఇవ్వు" అంటూ చేతిలోని పళ్ళు ఆమెకి అందించాడు నవ్వుతూ.

ఆత్మారామ్, హులసీ దంపతులకి పెళ్లయినా ఎంతకాలానికీ సంతానం కలగలేదు. ఇక కలగరు అని నిరాశ చేసుకునే తరుణంలో ఆమె గర్భం ధరించినట్లుగా తెలిసింది. ఆ దంపతుల ఆనందానికి అవధులు లేవు. ఎప్పుడెప్పుడు పుత్రుడు జన్మిస్తాడా అని వెయ్యికళ్ళతో ఎదురు చూస్తున్నారు.

ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. హులసీని ఎంతో కష్టపెట్టి చందమామ లాంటి బాలుడు ఉదయించాడు. ఆ శిశువు ముక్కు, మొహం అందంగానే ఉన్నాయి గానీ, పుట్టుకతోనే నోటిలో దంతాలు ఉన్నాయి. ఆ రూపం చూసి బాధ కలిగినా, తమకి భగవంతుడు ఇచ్చింది ఇంతే అని సరిపెట్టుకుని ఇరవై ఒకటో రోజున బారసాల జరిపించి, కొడుకుకి "రామ్ బోలా" అని నామకరణం చేశాడు ఆత్మారామ్.

రోజులు గడిచిన కొద్దీ చుట్టుపక్కల ఇళ్ళలోని వారు వచ్చి రామ్ బోలాని చూసి వెళ్ళటం, వింతగా చెప్పుకోవటం జరుగుతూఉంది. కొంతమంది చనువు తీసుకుని "పుట్టుకతోనే ఎవరికైనా ముప్పైరెండు పళ్ళు ఉంటాయా! ఇలాంటి కొడుకు ఉండటం మంచిది కాదు. ఎవరినైనా జ్యోతిష్యుడిని సంప్రదించండి" అని సలహా ఇచ్చి వెళ్ళిపోయేవారు. రానురాను ఆత్మారామ్ కి కూడా జ్యోతిష్యుడిని అడిగితే బాగుంటుంది అనిపించసాగింది. దానికి తోడు హులసీ శరీరంలో ఏదో వ్యాధి ప్రవేశించింది. ఎన్నిరకాల వైద్యం చేయించినా తగ్గుముఖం పట్టలేదు.

ఒకరోజు జ్యోతిష్యుడిని పిలిచి కొడుకు జాతకచక్రం చూపించాడు. "ఈ పరిణామాలకన్నిటికీ ఈ బిడ్డే కారణం. ఇలాంటి అసాధారణ లక్షణాలతో జన్మించిన శిశువు అనర్థదాయకం. ఇతడిని పరిత్యజించటమే మంచిది" అని చెప్పాడు.

అదివిని హులసీ కన్నీరుమున్నీరు అయింది. "లేకలేక కలిగిన నాబిడ్డని అనాధని చేస్తారా!" అన్నది. "మనం అంత

కఠినులము కాము. కంటికి దూరం చేస్తేచాలు. ఎవరిచేతికైనా ఇచ్చి మా మేనత్తగారి ఇంటికి పంపేద్దాం. ఎక్కడో ఒకచోట సుఖంగా పెరుగుతున్నాడు అనే సంతృప్తి అయినా ఉంటుంది" అంటూ భార్యని ఓదార్చాడు ఆత్మారామ్.

దాసీ చేతికి బిడ్డని ఇచ్చి, కొంత ధనం కూడా ఇచ్చి పంపేశాడు ఆత్మారామ్. కొడుకుని వదలలేక, వదలలేక వదిలింది హులసి. అయినా ఆమె రుగ్మత తగ్గలేదు. కొడుకు కోసం కలవరిస్తూ, వ్యాధి తీవ్రత వలన కొన్నాళ్ళకి కన్ను మూసింది.

కొంతకాలం గడిచింది. రామ్ బోలా ఐదు సంవత్సరాల వయసు బాలుడు అయ్యాడు. దురదృష్టవశాత్తూ అప్పటిదాకా అతడిని పెంచిన మేనత్త కన్నుమూసింది. తండ్రి ఎక్కడ ఉన్నాడో తెలియదు. అనాథలా ఇంటింటికి తిరుగుతూ వారు ఇచ్చిన కలో, గంజో తాగుతూ ఏ వీధి అరుగు మీదనో నిద్రపోయేవాడు రామ్ బోలా. ఇలా జరుగుతూ ఉండగా కొన్నిరోజులకి నరహరిదాసు అనే భక్తుడు ఈ బాలుడి దుస్థితి విని చేరదీశాడు. తన గ్రామానికి తీసుకువెళ్ళి విద్యాభ్యాసం చేశాడు. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి గాయత్రీ మంత్రం ఉపదేశించాడు.

రాం బోలా ఏకసంధాగ్రాహి. ఏ పాఠమైనా గురుముఖతః ఒక్కసారి వినగానే కంఠస్థం వచ్చేసేది. అతడి చురుకుదనం, శ్రద్ధ చూసి కాశీలోని శేషసనాతన స్వామి అనే గురువు వేదాలు, వేదాంగాలు అన్నీనేర్పాడు. శ్రీరాముడి చరిత్ర అయిన రామాయణం నేర్పాడు. ఆ గురువే రామ్ బోలా భక్తిచూసి "తులసీదాసు" అని నామకరణం చేశాడు.  పదిహేను సంవత్సరాలు గడిచాయి. తులసీదాసు ఇరవై సంవత్సరాల యువకుడు అయ్యాడు. ఇక గృహస్థ జీవితం గడపవలసిన తరుణం వచ్చిందని నరహరిదాసు తులసీదాసుకి వివాహం జరిపించాడు.

వివాహం అయిన తర్వాత తన కుటుంబాన్ని తనే పోషించుకోవాలి. ఢిల్లీ పాదుషా దగ్గర ఉద్యోగం సంపాదించాడు. తులసీదాసు భార్య పేరు రత్నావళి. ఆమె అతిలోక సౌందర్యరాశి. భార్యతో పొత్తు కుదిరిన తర్వాత ఆమెని విడిచి ఒక్కక్షణం కూడా ఉండలేనేమో అనిపించేది. ఆమె సొగసులు, సోయగాలు తలుచుకుంటూ పులకించిపోయేవాడు. ఎప్పుడెప్పుడు పాదుషా కొలువు అయిపోతుందా, ఇంటికి వచ్చేద్దామా అని క్షణాలు లెక్కపెట్టుకునే వాడు. రత్నావళి పుట్టింటివారు వచ్చి కొద్దిరోజులు కూతురిని పంపమని అడిగినా పంపేవాడు కాదు.

రత్నావళి పతివ్రత. భర్తపట్ల అనురాగం కలిగి, విధేయతగా నడుచుకునే ఇల్లాలే! అయినా అప్పుడప్పుడు పుట్టింటికి వెళ్లాలనీ, తనవాళ్ళని కళ్ళారా చూసుకోవాలనీ ఆరాటపడేది. కానీ భర్త అందుకు ఒప్పుకునేవాడు కాదు. ఇలా ఉండగా తులసీదాసు ఉద్యోగపు పని మీద పొరుగూరు వెళ్ళవలసి వచ్చింది. తిరిగి రావటానికి రెండురోజులు పడుతుంది. రత్నావళి ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ సమయంలో ఆమె తమ్ముడు వచ్చి "అమ్మకి ఆరోగ్యం సరిగాలేదు. నిన్ను చూడాలని కలవరిస్తున్నది. ఒకసారి మనింటికి రావే అక్కా!" అంటూ బ్రతిమిలాడాడు. రత్నావళికి కూడా అనారోగ్యంతో ఉన్న తల్లిని చూడాలనే ఉంది. కానీ భర్తకు చెప్పకుండా వెళ్ళటం ఎలా! "అయన ఊళ్ళో లేరు కదరా! చెప్పకుండా వెళితే ఎలా?" అన్నది.

"మరేం ఫర్వాలేదు. బావగారికి నేను నచ్చచెబుతాను. వెంటనే బయలుదేరితే ఆఖరు పడవ అయినా దొరుకుతుంది. చీకటిపడితే యమునా నదిని దాటటం కష్టం" అని తొందరచేశాడు తమ్ముడు. రత్నావళి గబగబా నాలుగు చీరెలు సంచీలో పెట్టుకుని, భర్త వచ్చి అడిగితే తను అవసరమైన పనిమీద వెళ్ళినట్లుగా చెప్పమని ఇరుగుపొరుగు వారికి చెప్పి బయలుదేరింది.

తులసీదాసు పని ముగించుకుని ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. భార్యతో గడపాలని తహతాహలాడుతూ వచ్చిన అతడికి ఇంటికి తాళంవేసి ఉండటం కనిపించింది. పొరుగువారు రత్నావళిని తమ్ముడు వచ్చి తీసుకువెళ్లినట్లుగా చెప్పారు. తక్షణమే భార్యకోసం బయలుదేరాడు తులసీదాసు. యమునానదికి ఆవతలపక్క తర్పిత అనే గ్రామం ఉన్నది. అక్కడే అత్తగారి ఇల్లు.

నదీతీరానికి వచ్చేసరికి పడవలు అన్నీ లంగరు వేసి ఉన్నాయి. పడవ వాళ్ళు అందరూ ఇళ్ళకి వెళ్ళిపోయారు. భార్య మీద విరహంతో ఉన్న తులసీదాసు అలాగే నదిలో దూకి ఈదుకుంటూ అతి కష్టంమీద అవతలి ఒడ్డుకు చేరుకున్నాడు. అత్తగారి ఇంటికి వెళ్లేసరికి అర్ధరాత్రి అయింది. అత్తగారి ఇల్లు తలుపు వేసి ఉన్నది. ఈ సమయంలో తలుపు కొట్టినా తీస్తారో, లేదో! రత్నావళి మేడపైన గదిలో నిద్రిస్తూ ఉంటుంది. ఈ గదిలో ఒకే ఒక్కసారి వివాహం అయిన తొలిరాత్రి గడిపాడు. ఆ తర్వాత మళ్ళీ అక్కడికి వచ్చింది లేదు.

తులసీదాసు మేడపై భాగానికి ఎలా వెళ్ళటమా అని ఆలోచించాడు. గోడమీద నుంచీ ఏదో తాడు లాంటిది వేలాడుతూ ఉంది. దాన్ని పట్టుకుని గోడ ఎక్కి తలుపు తట్టాడు. దీపం తీసుకుని వచ్చి తలుపుతీసిన రత్నావళి భర్తని చూసి తెల్లబోయింది. అతడి బట్టలు తడిచిపోయిఉన్నాయి. అక్కడక్కడ రక్తపు మరకలు ఉన్నాయి. భార్యని చూడగానే ఆనందంతో తులసీదాసు ముఖం విప్పారింది.

"ఈ తడిబట్టలు ఏమిటి? అర్ధరాత్రి సమయంలో ఈ రాక ఏమిటి? మీరు ఇంట్లోకి రావటానికి తలుపు ఎవరుతీశారు?" అని అడిగింది.

"యమునా నదిని ఈ ది వచ్చాను. తలుపులు ఎవరూ తీయలేదు. గోడమీద తాడు సాయంతో పైకెక్కి వచ్చాను. నేను వస్తానని ముందే ఊహించి రావటానికి వీలుగా గోడమీద తాడువేసి ఉంచావు కదూ!" అన్నాడు గోముగా చూస్తూ.

భర్త ప్రవర్తన అయోమయంగా అనిపించింది రత్నావళికి. "నా జీవన రాజీవానివి నువ్వు. నీ పొందు కోసం అర్రులు జాస్తూ వచ్చిన నన్ను ఇంకా వేగిర పరచకు. ఇలా దగ్గరకు రా!" అంటూ చేతులు చాపాడు.

"ఆగండి. ఏమిటిది? నేను ఎలాంటి తాడూ వేయలేదు. ఏమిటో చూద్దాం పదండి." అంటూ దీపం పట్టుకుని గోడ దగ్గరకు వచ్చింది రత్నావళి. అక్కడ పొడవాటి త్రాచుపాము వేలాడుతూ ఉన్నది. దాన్ని పట్టుకునే పైకిఎక్కి వచ్చాడు తులసీదాసు. అందుకే అతడి బట్టలనిండా రక్తపు మరకలు అంటుకున్నాయి. విషయం అర్థం కాగానే రత్నావళి మనసు అసహ్యంతో నిండిపోయింది.

"నా పొందుకోసం అర్ధరాత్రి ఇంత శ్రమపడి వచ్చారా! ఏముంది ఈ శరీరంలో! రక్తమాంసాలతో నిండిన అస్థిపంజరం ఇది. స్త్రీ స్పర్శని వాంఛిస్తూ శరీరానికి స్వాభావికమైన స్పర్శజ్ఞానాన్నే కోల్పోయారు, తాటికీ సర్పానికీ తేడా తెలుసుకోలేకపోయారు. తుచ్ఛమైన కామవాంఛకి లొంగిపోయారు. రక్తమాంసాలతో నిండి దుర్గంధభూయిష్టమైన ఈ శరీరం మీద చూపించే శ్రద్ధ, ఆరాటం భగవంతుడి మీద చూపిస్తే పుణ్యం దక్కుతుంది. జీవితం సార్థకమౌతుంది. ఛీ! మిమ్మల్ని చూస్తుంటే అసహ్యంగా ఉంది. వెళ్ళండి అవతలకి" మొహం తిప్పుకుంటూ అన్నది.

భార్య మాటలతో తులసీదాసు తల తిరిగిపోయింది. ఎవరికోసమైతే తాను ఇంత సాహసం చేసి, ఇంత శ్రమపడి వచ్చాడో ఆమే తనని అసహ్యించుకుంటున్నది. నిజమే! వివాహానికి పూర్వం తను నేర్చుకున్న వేదశాస్త్రాలు, పురాణాలు ఏమైపోయాయి? మహా మహా పండితుల ప్రశంసలు అందుకున్నాడే! ఆ జ్ఞానం అంతా ఏమైంది? పెళ్లి అయిన తర్వాత ఒక్కసారి కూడా వాటిని తలుచుకోలేదు. స్త్రీ వ్యామోహంలో మునిగిపోయాడు. అతడి కళ్ళను ఆవరించుకున్న పొరలు తొలగిపోయాయి. శృంగారపు వాకిళ్ళు మూసుకుపోయి వైరాగ్యపు వాకిళ్ళు తెరుచుకున్నాయి.

ఆ మర్నాడు తులసీదాసు ఇల్లు, వాకిలి, భార్య, బంధువులు అందరినీ వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. ఒక గమ్యం లేకుండా ఎటెటో తిరిగాడు. చివరకు కాశీ చేరుకున్నాడు. అతడి వాలకం చూసి ఎవరో పండితుడు అయిఉంటాడు అని ప్రజలే చిన్న ఇల్లు కట్టించి ఇచ్చారు. ఆ ఇంటిముందు చెట్టుకింద కూర్చుని ప్రతిరోజూ పురాణ ప్రవచనం చేసేవాడు. క్రమక్రమంగా జనం రాక ఎక్కువైంది. అతడు చెప్పే రామకథా ప్రవచనం ప్రజలను ఆకట్టుకోసాగింది.

తులసీదాసు ప్రతిరోజూ సంధ్యావందనం చేసిన తర్వాత ఆ నీళ్ళు చెట్టు మొదట్లో పోసేవాడు. ఆ చెట్టుపైన ఒక బ్రహ్మ రాక్షసుడు రహస్యంగా కూర్చుని ఉన్నాడు. రామకథను వినటం వలన, ఆ తీర్థ ప్రభావం వలన శాపవిముక్తుడై మానవరూపంలో తులసీదాసు ముందు నిలిచి నమస్కరించాడు రాక్షసుడు. "స్వామీ! మీరు చెప్పే కథాశ్రవణం వలన, తీర్థప్రభావం వలన నాకు శాపవిమోచనం అయింది. మీ ఋణం తీర్చుకుంటాను. మీకేం కావాలో అడగండి" అన్నాడు.

"నాకు శ్రీరామ దర్శనం కావాలి, కలిగించు" అన్నాడు తులసీదాసు.

"క్షమించండి. నాకు అంత శక్తిలేదు. కానీ ఒక ఉపాయం చెబుతాను. ప్రతిరోజూ రామకథను వినటానికి ఒక బ్రాహ్మణుడు అందరికంటే ముందు వచ్చి, అందరికంటే చివర వెళుతూ ఉంటాడు. గమనించారా! ఆ మహానుభావుడు ఎవరోకాదు. ఆంజనేయస్వామి ఇలా మారురూపులో వస్తున్నాడు. ఆయన్ని ఆశ్రయించండి. మీకు తప్పకుండా రామదర్శనం కలుగుతుంది. శలవు." అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు తులసీదాసు ఆంజనేయస్వామి వచ్చినప్పుడు పాదాభివందనం చేసి తనకు శ్రీరాముడి దర్శనం కలిగించమని ప్రార్థించాడు.

"నువ్వు అయోధ్యకు వెళ్లి శ్రీరామకథను గ్రంథంగా రచించు. నా ఆశీర్వాద ప్రభావం వలన అది సామవేదంతో సమానమైన ఫలితాన్ని ఇస్తుంది. ప్రజలందరూ భక్తితో గానం చేస్తారు. ఆ గ్రంథం పూర్తి అయిన తర్వాత శ్రీరాముడు దర్శనం ఇస్తాడు" అని చెప్పి వెళ్ళిపోయాడు బ్రాహ్మణుడు.

ఆయన చెప్పిన ప్రకారం తులసీదాసు కాశీని విడిచి అయోధ్యకు బయలుదేరాడు. ఆ సమయంలో ప్రయాగలో మాఘమేళా జరుగుతూఉంది. అక్కడ కొంతకాలం ఉన్నాడు. అక్కడ భరద్వాజ, యాజ్ఞవల్క్య మహర్షుల దర్శనం అయింది. యాజ్ఞవల్క్య మహర్షి ద్వారా వాల్మీకి రచించిన రామాయణ గాథ చెప్పబడుతూ ఉంది. ప్రజలతోపాటు ఆ కథని మరోసారి విన్నాడు తులసీదాసు. అతనిలో కవితాశక్తి జాగృతం అయింది. ఒక బ్రాహ్మణుడి ఇంట ఆశ్రయం పొంది సంస్కృత భాషలో రామాయణం రాయటం మొదలుపెట్టాడు.

కానీ పగలు రచించిన శ్లోకాలు అన్నీ రాత్రికి అదృశ్యమైపోతున్నాయి. ఒకరోజు రాత్రి కలలో పరమేశ్వరుడు కనబడి "నువ్వు వ్యవహారభాష అయిన అవధిలో కావ్య

రచన చెయ్యి" అని చెప్పాడు. తులసీదాసు మేల్కొన్నాడు. ఈశ్వరాజ్ఞ ప్రకారం అవధి భాషలో రామాయణం రచించటం మొదలుపెట్టాడు. ఆ విధంగా రెండు సంవత్సరాల ఏడు నెలల కాలం పట్టింది రామకథ పూర్తికావటానికి. ఆ గ్రంథానికి "రామచరిత మానస్" అని నామకరణం చేశాడు.

ఆ సంవత్సరం మార్గశిర శుక్లపక్షం రోజున అయోధ్యలో సీతారాముల వివాహ మహోత్సవం జరుగుతున్నది. రామచరిత మానస్ ని శ్రీరాముడి పాదాల ముందు ఉంచి భక్తితో ప్రణమిల్లాడు తులసీదాసు. రామచరిత మానస్ క్రమక్రమంగా జగద్విఖ్యాతమైంది. అతడి పేరు విని ఢిల్లీ పాదుషా పిలిపించి "ఎవరా రాముడు? ఆ రాముడిని నాకు చూపించు" అన్నాడు. "రామదర్శనం నాకే సరిగా కాలేదు. ఈ నవాబుగారికి ఎలా చూపించాలి?" అని తులసీదాసు కళవళ పడ్డాడు. ఆంజనేయస్వామిని ప్రార్థించి ఈ సమస్యను తీర్చటం ఎలాగో చెప్పమని వేడుకున్నాడు. ఆంజనేయస్వామి తనకి అభయం ఇస్తున్నట్లుగా అనిపించి, తులసీదాసు మనసులో భయం అంతా పోయి ధైర్యం వచ్చింది. "అలాగే తప్పకుండా చూపిస్తాను" అని పాదుషాతో అన్నాడు.

తులసీదాసు మాట ఇవ్వగానే ఢిల్లీ నగరం అంతా కోతులతో నిండిపోయింది. ఏ ఇంట్లో చూసినా, ఏ వీధిలో చూసినా కోతులే! ప్రజలంతా గగ్గోలుపెట్టారు. తులసీదాసు పాదుషాతో "మీరు ప్రయాణమైతే మీకన్నా ముందు మీ పరివారం అక్కడికి చేరుకుంటుంది కదా! అలాగే మా శ్రీరామచంద్రుడు దర్శనం ఇచ్చేముందు వారి పరివారమైన వానరసైన్యం కూడా ముందుగా వచ్చేసింది. ఈ వానరుల వెనకే ఆ శ్రీరాముడు కూడా వచ్చేస్తాడు" అని సమాధానం చెప్పాడు.

ఆ మాటలతో ఖంగు తిన్నాడు పాదుషా. "మీ రాముడు దర్శనం ఇచ్చినట్లే భావిస్తాను. ముందు ఆ వానరసైన్యాన్ని పంపించు" అని బ్రతిమిలాడాడు. తులసీదాసు మళ్ళీ ఆంజనేయ స్వామిని ప్రార్థించగానే కోతులన్నీ వెళ్ళిపోయాయి. పాదుషా తులసీదాసు భక్తిని మెచ్చుకుని ఘనంగా సత్కరించాడు.

తులసీదాసు రామచరిత మానస్ ఒక్కటే కాకుండా ఇంకా జానకీ మంగళ్, దోహావళి, గీతావళి మొదలైన గ్రంథాలు రచించాడు. అన్నిటిలోకి రామచరిత మానస్ తలమానికం లాంటిది. ఆయనకు అపూర్వఖ్యాతి తెచ్చిపెట్టింది. ఒకరోజు కలలో సీతాసమేతుడై శ్రీరాముడు కనబడి తులసీదాసుని తన దగ్గరకు రమ్మని పిలిచాడు. తులసీదాసు రామనామం జపిస్తూనే ఆయనతో పాటు గాలిలోకి తేలిపోయాడు. తెల్లవారిన తర్వాత శిష్యులు వచ్చి చూసేసరికి శరీరం అలా నిద్రిస్తున్నట్లుగానే ఉన్నది కానీ ఆయన ఆత్మ పరమాత్మలో లీనమైనట్లు తెలిసిపోయింది.

# పాదాలు

**– మందరపు వి.జి.శంకరాచారి**

గంగాజలానికి పుట్టుక ఆ పవిత్ర పాదాలు.

దశావతారాలతో పుడమిని పవిత్రం చేసిన పాదాలు.

భక్తుడైన ప్రహ్లాదుణ్ణి రక్షించి అక్కున చేర్చుకున్న పాదాలు.

వామనుడై వచ్చి త్రివిక్రముడై నిలిచి భక్తుడైన బలి చక్రవర్తిని సుతల లోకానికి అణచివేసి అక్కడ అతణ్ణి చక్రవర్తిగా నిలిపి తను కాపలాదారుగా నిలిచిన పాదాలు.

భక్తురాలైన శబరిని పవిత్రమైన నదిగా మార్చిన పాదాలు.

తమ్ముడి కోరిక మేరకు పాదుకలను అనుగ్రహించి రాజ్యపాలన గావించమని అనుగ్రహించిన పాదాలు.

ఆంజనేయునికి ఆలింగన భాగ్యాన్ని అనుగ్రహించిన పాదాలు.

పూతనను సంహరించిన పాదాలు.

అండపిండ బ్రహ్మాండములను తన బొజ్జలో నిలుపుకున్నానని తల్లి యశోదకు నోట చూపిన పాదాలు.

కాళీయుని గర్వమణచిన పాదాలు.

స్నేహితుడికి హితుడిగా మారి మిత్రుడి పాదాలను కడిగి ఆ జలాన్ని పవిత్రంగా తనపై జల్లుకొని అష్టైశ్వర్యాలను అనుగ్రహించిన పాదాలు.

పాండవులను కంటికి రెప్పలా కాపాడిన పాదాలు. కుబ్జకు సుందర రూపాన్ని ఒసగిన పాదాలు. పుండరీకుడి ఇంటి ముంగిట నిలిచి భక్తుడి రాక కొరకు వేచి చూసిన పాదాలు. తుకారాంని బొందితో స్వర్గానికి తీసుకువెళ్ళిన పాదాలు.

భక్తుడైన బావాజీ కొరకు బండెడు చెరకుగడలు తిన్న పాదాలు.

బీబీ నాంచారిని భార్యగా స్వీకరించిన పాదాలు.

సన్నిధి గొల్లకే మొదటగా చూసే భాగ్యమిచ్చిన పాదాలు. నేడు సప్తగిరీశుడిగా తిరుమలలో కొలువై భక్తులందరినీ అనుగ్రహిస్తూ త్రికరణశుద్ధిగా తన చరణాలను నమ్మినవారిని అక్కున చేర్చుకుంటానని చెప్పకనే చెబుతూ ఉన్న ఆ పరంధాముడి దివ్య మంగళ విగ్రహాన్ని చూస్తూ పరవశిద్దాం. కష్టంలోనూ... సుఖంలోనూ... నీవే నా కర్త, కర్మ, క్రియ యని శ్రీవేంకటేశ్వరుడి పాదాలపై సాగిలపడి శరణాగతి చేస్తూ పాపపు జన్మలను పునీతం చేసుకుందాం.

నరజన్మ ఎత్తిన ప్రతి ఒక్కరికీ ఆ దివ్య పాదాలే శరణు... శరణు... శరణు...

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

– డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## వ్యాఘ్ర గోమాయు కథ

సూతమహాముని రావడంతో శౌనకాదులందరూ లేచి నిలబడి నమస్కరించారు. ఈనాడు ఏం చెప్తారా – అన్నట్లు చూశారు. సూతముని చిరునవ్వుతో–సౌమ్యులు అసౌమ్యులుగాను, అసౌమ్యులు సౌమ్యులుగాను కనిపిస్తుంటారు. వారిని వేర్పాటు చేసి చూడడం–అంత సులభం కాదు. అందుకు ఒక చక్కని ఉదంతం ఉంది. నేడది చెబుతాను. శ్రద్ధగా ఆలకించండి.

పురిక నగరాన్ని పాలించే రాజు పరమ క్రూరుడు. చేసినవన్నీ క్రూరకర్మలే. మహాపాప కర్మలే. కాలవశాన ఆ రాజు మరణించి – పూర్వజన్మ జ్ఞాపకాలతో నక్కగా మరో జన్మను పొందాడు. పూర్వజన్మలో తాను చేసిన పాపాలకు పశ్చాత్తాపం పడి ఈ జన్మలో అయినా ఎటువంటి పాపమూ చేయకూడదని నిశ్చయించుకుంది. మాంసం తినకూడదని, హింస చేయరాదని, తోటి జంతువులను చంపకూడదని – వ్రతం పట్టింది. అడివిలో రాలిపడ్డ ఆకులను పండ్లను తింటూ సాధు జీవనం సాగిస్తోంది. తోటి నక్కలు తాము మాంసాన్ని తెచ్చి పెడతామని చెప్పినా – ఆ మాటలను లెక్క చేయక తాను నిర్ణయించుకున్న తీరుగానే జీవిస్తోంది. ఇదంతా తెలుసుకున్న అడవినేలే పులిరాజు స్వయంగా నక్క దగ్గరకు వచ్చి –

**"నిను సౌమ్యుడవని యెఱిగితి**
**ననఘా! నను చెంది నిలిచి యతుల సుఖము లం**
**దిన మేలు, నన్ను, గ్రూరుం**
**డను లోకం బిదియు నుడుప నగు నీ శిక్షన్"**

**–శాంతి పర్వం – తృతీయాశ్వాసం – ప. 56**

"లోకం నన్ను క్రూరుడనని భావిస్తోంది. నువ్వు నాతో స్నేహాన్ని పాటించి, మంత్రిగా ఉండి, నీ హితబోధలతో నన్ను మంచి పాలకునిగా చెయ్యి" అంటూ వేడుకున్నది.

వెంటనే ఒక ముని "అదేమిటి? – మునీంద్రా! పులి – తనను అందరూ క్రూరుడంటున్నారని – చెప్పుకున్నది. పులి నిజంగా క్రూరమైనదైతే – సాధువైన నక్క స్నేహాన్ని ఎందుకు

కోరుతుంది! ? చంపి తినేస్తుంది కానీ!'' అని అడగడంతో సూతముని ''మునులారా! పులి అంటేనే క్రూర జంతువు కదా. అది లోక సహజం. అంతేకానీ – తానుగా – తను క్రూరుడనని అనలేదు. జనవాక్కు – అని స్పష్టంగా చెప్పింది. పులి జాతి క్రూరమైనదే అయినా ఈ పులి సాధు స్వభావి. పరిపాలకుడు ప్రతి పనినీ విచారించి చేయాలి. రాజన్నవాడు వెనకా ముందూ పరిశీలించకుండా, నిజానిజాలు తెలుసుకోకుండా ఏ ప్రాణికీ హాని చేయకూడదు. శిక్షలు వేయకూడదు. అది రాజనీతి. ఇందుకు సమర్థుడైన మంత్రి ఉంటే – తన కుశాగ్రబుద్ధితో రాజును సరైన మార్గంలో నిలుపుతాడు. అది తెలిసే పులిరాజు సాధువైన నక్క మంత్రిత్వాన్ని కోరుకుంది. నిజానికి నక్కది జిత్తులమారి జాతి. కానీ ఈ నక్క సాధుమూర్తి. పులిజాతి క్రూరమైనది. కానీ ఈ పులి సాధుజీవి. ఈ ఇరువురి స్నేహం ఆ అడవికే శ్రేయం.

పులి కోరినందుకు పులి కూడా మంచిది కావడంతో నక్క అంగీకరించింది. అందుకు ఒక ఒప్పందం (షరతు) కుదుర్చుకుంది. ''చెప్పుడు మాటలకు, తప్పుడు మాటలకు చెవి ఒగ్గకుండా, నా గురించి ఎవరేమి చెప్పినా వినకుండా – నా మాటనే వింటూ ధర్మపాలన చేయాలి. అట్లాగని బాస చెయ్యి. అప్పుడు నిన్ను నమ్మి నీతో వస్తాను'' అని నక్క పలికేసరికి పులి వెంటనే ఒప్పుకుని – బాస చేసి, నక్కను సంతోషంగా తనతో తీసుకెళ్ళింది. ఆ ఇద్దరి కలయికతో ఆ అడవి రాజ్యంలో ధర్మపాలన, సత్యపాలన, అహింసా పాలన కొంతకాలం పాటు సాగింది.

ఉత్తముల ఔన్నత్యం చూసి సహించలేని అసూయాపరుల చేతలకు, వాటి ఫలితాలకు ఈ కథ చక్కని తార్కాణం.

పులి, నక్కల అన్యోన్యతను చూసి ఓర్వలేక కొందరు భృత్యులు – కుట్రపన్ని రాజు తినవలసిన మాంసాన్ని అపహరించి, నక్కకు తెలియకుండా చాటుగా నక్క గుహలోనే పెట్టారు. అది తెలిసిన పులి ఆగ్రహం చెందింది. రాజు కొచ్చిన కోపాన్ని – తమకు అనుకూలంగా మలచుకోవడానికి సేవకులు నక్క గురించి లేనిపోనివి చెప్పి –

**"నక్కకేటి వ్రతము? స్రుక్కక యిమ్మాంస**
**మపహరించి నపుడ యబ్బె నేని**
**నేమియైన జేయు నిది పాప శీలంబు**
**గపట ధర్మ కంచుకంబు సువ్వె!"**

**–శాంతి పర్వము – తృతీయాశ్వాసము – ప. 65**

నక్క ఏమిటి? వ్రతం ఏమిటి? ఈ నక్క పాపి. ధర్మ అనే మాయ తొడుగు వేసుకుని నిన్ను మోసం చేస్తోంది. మాంసం – ముట్టనని చెప్పిన నక్క మహారాజువైన నువ్వు తినే మాంసాన్ని కాజేసి, ఏమీ ఎరుగనట్లు ఇంకా నీ దగ్గరకు రాకుండా ఎక్కడో ఏదో పనిలో ఉన్నట్లు ఎంత బాగా నటిస్తోందో – గమనించండి రాజా! – అంటూ నూరిపోశారు.

ఆత్రాన్ని తట్టుకోలేక ఒక ముని ''అదేంటి మహాత్మా! ధర్మపాలన చేస్తున్న పులిరాజుకు ఆగ్రహం రావడం ఆశ్చర్యంగా ఉంది. అప్పుడు పులి ఏం నిర్ణయం తీసుకుంది!?'' అని అడిగాడు. అది విన్న సూతముని ''మీ ఆత్రానికి అర్థమున్నది మునులారా! చెబుతున్నాను వినండి. ఆగ్రహావేశంతో ఉన్న పులి ఒక్కక్షణం కూడా ఆలోచించకుండా, ఆలసించకుండా – ''నక్కను చంపమ''ని శాసించింది. సేవకులు లోలోపల పరమానందంతో విర్రవీగారు.

''మునీంద్రా! నక్కను చంపేశారా!. అయ్యో! సాధుజీవి కదా!



దుర్మరణం చెందిందా!?'' – అని మునులంతా ఒక్కక్షణం ఆర్ద్రత చెందారు. సూతమహర్షి ''మునిసత్తములారా! విచారించకండి. ఇక్కడే ఒక అద్భుతం జరిగింది. పులి తీసుకున్న ఆవేశపూరిత నిర్ణయాన్ని తెలుసుకున్న రాజమాత అంటే పులిరాజు తల్లి పరుగు పరుగున కుమారుడి దగ్గరకు వచ్చింది. ''నాయనా! కుమారా! అసత్యాలు పలకడం – మన నక్కకు చేతనవుతుందా!? ఎంత మూర్ఖుడివి? నిన్ను అంటిపెట్టుకున్న సేవకులు వంచకులు. వాళ్ళు ఏది చెబితే – అది వింటావా? నీ తెలివి తెల్లారిపోయిందా? నీ ఆలోచనా శక్తి చచ్చిపోయిందా?

**"బుద్ధిమంతుని వలన దుర్బుద్ధు లధికు**
**వలన హీనులు రూపసి వలన గొనటి**
**వా రసూయలు సేయుదు రీ రసమున**
**నింత యెఱుగంగ వలదే? యీవు కొడుక!"**

**–శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప. 70**

''పుత్రా మంచివారిని చూసి చెడ్డవారు, గొప్పవారిని చూసి తక్కువవారు, అందగాళ్ళను చూసి అందం లేనివారు – సహించలేక – నిందలను ఆరోపిస్తారు. ఈపాటి విషయాన్ని కూడా నీకు నువ్వే గ్రహించుకోవద్దా?

**"ధర్మ మధర్మము భంగి న**
**ధర్మము ధర్మము మాడ్కి తనయా! తోచున్**
**నిర్మల మతి నరయ వలయు**
**ధార్మికతం గోరువాడు తన కేర్పడగన్"**

**–శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప. 71**

తనయా! ధర్మం అధర్మం వలె, అధర్మం ధర్మం వలె అనిపిస్తూ ఉంటుంది కదా. తన మనసుకు పూర్తిగా అర్థమయ్యే దాకా మంచి మనసుతో ఆలోచించి – ''ధర్మం ఇదీ'' అని తెలుసుకుని, దానినే ఆచరించాలి. ఈ నక్క మంత్రిగా ఉన్నప్పటినుంచీ చేసిన ఉపకారాలను గుర్తించి అయినా – ఇలాంటివాడు ఇలా చేస్తాడా – అని యోచించుకోవద్దా!?

**"హితుడగు మంత్రిం గుటిలుల**
**యతి కపటోపాయములకు నగపడి చెఱుపన్**
**మతి దలతురె? పతి సు పరీ**
**క్షితంబు గావింప కొకటి సేయం దగునే?"**

**–శాంతి పర్వము – తృతీయాశ్వాసము – ప. 73**

వంచకుల కుటిల మాయ మాటలను విని నిరంతరం మన మంచిని కోరే మంత్రిని చంపాలనుకోవడం భావ్యమేనా!? రాజు అయినవాడు ముందూ వెనకా పరిశీలించుకోకుండా శిక్షలు వేయడం మంచిది కాదు. పరిపాలకుడు ప్రతి పనినీ విచారించి అమలు చేయాలి. సేవకుల మాటలను విన్నంత మాత్రాన – నిజానిజాలు, న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు, ధర్మసూక్ష్మాలు గ్రహించకుండా నిర్ణయం తీసుకోవడమేనా!? సభను ఏర్పాటు చేసి – నలుగురితో చర్చించి, విచారణ జరిపావా? లేదే! కేవలం క్షణికావేశంతో చేసిన ఈ పనికి ఫలితం అయినా ఆలోచించావా? నాయనా! ఇంత గొప్ప మేధావి, సాధుమూర్తి, ప్రజోపకారి అయిన ఇటువంటి మంత్రి నీకు మళ్ళీ దొరుకుతాడా!? ఒక్కసారి ఆలోచించు తండ్రీ! – అంటూ బోధించింది.

అంతే! పులిరాజుకు బుద్ధి తెలిసి వచ్చింది. వెంటనే నక్కను రప్పించి, అక్కున చేర్చుకుని ఆదరించింది. పెడదారిన పడిపోతున్న కొడుకును హిత వచనాలతో మంచి మార్గాన నడిపించడం తల్లి బాధ్యత. ఆ తల్లి మాటలను పాటించడం కొడుకు కర్తవ్యం. అందుకు కలిగే సత్ఫలితం అంతా ఇంతా కాదు. పులి ఆదరించినా నక్క మాత్రం అభిమానంతో ఎంతో చింతించింది.

**"వినుము మృగేంద్ర! మన్నటుల నీవు సభన్ నను వీడు మంచివా**
**డని కొనియాడి యిప్డు దెగటార్చితి పెంపును నాదు మానమున్"**

–శాంతి పర్వము – తృతీయాశ్వాసము – ప.74

''ఓ పులిరాజా! ఒక విషయం విను. నువ్వు ఇంతకుముందు సభలో అందరి ఎదుటా నన్ను మెచ్చుకుని మరీ కోరి కోరి మంత్రిని చేసుకున్నావు. కానీ ఈ రోజున నా అభిమానాన్ని దెబ్బతీశావు. నా పరువు మర్యాదలను మంట కలిపావు. అంతేకాదు. ఆనాడు చెప్పుడు మాటలను విననని, ప్రమాణం చేసి, ఈనాడు ఆ మాట తప్పి, నా మీది నమ్మకాన్ని విడనాడి, నన్ను నిందించి, చులకన చేసి, శిక్ష వేసి చంపబోయావు. అభిమానవంతులెవరైనా – సరే – నమ్మకము, గౌరవము లేనిచోట ఒక్క క్షణం కూడా నిలువలేరు.

**"వారిరి మాటల తేలక**
**భావంబున కీడు మేలు బరికించి యస**
**ద్భావుని సద్భావుని నవ**
**నీవర! యేర్పఱుప నెఱుగ నేరగ వలయున్"**

**–శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప. 81**

రాజయినవాడు ఇతరుల మాయ మాటలలో పడి మోసపోకుండా మంచీ చెడ్డా యోచించుకోవాలి. ఏది మంచి, ఏది కాదు – అని తెలుసుకోగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. అప్పుడే పరిపాలకుడు సరైన నిర్ణయాలతో సమర్థవంతంగా పాలన చేయగలుగుతాడు. రాజా! సహనం, సామర్థ్యం నీలో ఉండి కూడా ఈ క్షణాన లేకుండా పోయాయి అన్న నక్క మాటలకు పులిరాజు తల వంచుకుని సిగ్గుపడింది. విన్నారా! మునులారా! మాట తప్పితే కలిగే నష్టం! ఉత్తముడు, సౌమ్యుడు, సమర్థుడు అయిన మంత్రిని కోల్పోయాడు పులి రాజు. ఉత్తమ

మంత్రిత్వం లేని రాజ్యం సుపరిపాలనకు నోచుకోదు'' అంటున్న సూతర్షి మాటలకు శౌనకుడు లేచి ''ఇంతకీ నక్క ఏమయింది? మరణశిక్ష అమలు కాలేదు కదా!?'' – అని అడిగాడు. అందుకు సూతమహాముని ''అవును. నక్కకు శిక్ష పడలేదు. కానీ, ఆత్మాభిమానంతో నక్క –

**"అని పాసి అరణ్యమునకు**
**జని యనశన, దీక్షనొంది సద్భావ ఖ్యా**
**తి నెఱయ పరమస్థానం**
**బున కగ్గోమాయు వరిగె ఋషివరేణ్యా!"**

**–శాంతిపర్వం – తృతీయాశ్వాసము – ప. 79**

పులిరాజుకు హితవు చెప్పి పులిని, రాజ్యాన్ని వదలి అడవిలోకి వెళ్ళింది. నిరాహార దీక్ష పూని, తన సౌజన్యంతో సాధుత్వంతో కాయాన్ని విడిచి – వైకుంఠానికి చేరింది. ''మునులారా! ఇక్కడొక విశేషాన్ని గమనించారా? పులి క్రూర జంతువు. ఈ పులి సుజనశీలి. మంచి రాజు. నక్క కపట జంతువు. ఈ నక్క సాధుమూర్తి. పరోపకారి. ఏ జాతిలో జన్మించినా గుణోన్నతి వలన ఉత్తముడు కాగలడని నిరూపించింది నక్క. జంతువుల ద్వారా కూడా మనం ధర్మాలను, ధర్మసూక్ష్మాలను లోతుగా తెలుసుకున్నాము'' అని చెప్పగానే శౌనకాదులు ''అవును గురుదేవా! ఎంత చక్కని ఉదంతం తెలుసుకున్నాము! జిత్తులమారి జాతిలో జన్మించి కూడా సాధువుగా మసలగలిగిన నక్క నిజంగా ఎందరికో మార్గదర్శి. తన జాతికే వన్నె తెచ్చింది. వైకుంఠానికే చేరుకోగలిగిన భక్తాగ్రగణ్య. మా మనసంతా ఆహ్లాదంతో నిండిపోయింది. పరమానంద భరితంగా ఉంది మహర్షీ. నేటికి పొద్దుపోయింది'' అన్నారు. సూతముని లేవడంతో మునులంతా లేచారు. తమ తమ ఆశ్రమాలకు చేరుకున్నారు.

# మూషిక మార్గాలాలు

సూతమహాముని రాకతో శౌనకాదులందరూ నిలబడి నమస్కరించారు. అందరూ ఆసీనులయ్యాక – ముని పుంగవులారా ఈనాడు మీకొక లౌక్యంతో కూడిన జీవన సరళిని తెలియజేసే కథ చెబుతాను. బలమైన శత్రువులతో స్నేహాన్ని పాటిస్తూ, వారిని నమ్మకుండా తన కార్యాలను నెరవేర్చుకోవాలన్న మహా సత్యాన్ని తెలుసుకుంటాము ఈ కథలో – అంటూ కథను చెప్పటం ప్రారంభించాడు సూతముని.

ఒక అడవిలో పలితుడనే ఎలుక – తన కలుగులో నివసిస్తూ ఉండేది. ఒకరోజు ఆహారం కోసం బయటికి వచ్చేసరికి ముంగిస, గుడ్లగూబ కనిపించాయి. అంతే వణికిపోయింది. ఏం చేయాలా, ఎలా పారిపోవాలా అని అటు ఇటు చూసింది. సమీపంలోనే ఉచ్చులో చిక్కుకున్న పెద్ద పిల్లి కనిపించింది. వెంటనే ఉపాయం చేసింది. ఆ పిల్లి వద్దకు వెళ్ళి – నేను నీ ఒడిలో కాసేపు ఉండి – ఆ ముంగిస, గుడ్లగూబల బారినుండి బ్రతికి బయటపడి, నీ వల కొరికి నిన్ను రక్షిస్తాను అని బ్రతిమాలుకుంది. బలమైన శత్రువు వలన కలిగే ఆపదలను తొలగించుకోవడానికి – అల్పుడైన శత్రువునైనా తనతో కలుపుకుని జీవించడానికి బహు సూక్ష్మంగా ఆలోచించి ఆపద్ధర్మంగా – పిల్లిని శరణు వేడింది. నిజానికి పిల్లి, ఎలుకలది జాతి వైరం. అంతేకాదు. పిల్లికి – ఎలుక ఆహారం కూడా కదా. అయినా తనను రక్షించుకోవడానికి పిల్లి పంచన చేరడానికి నిర్ణయించుకుంది. పిల్లి కూడా తనను రక్షించుకోవడానికి – తన ఆహారమే అయిన ఎలుకను ఒడిలో కూర్చోమన్నది. ఎలుక నిర్భయంగా పిల్లి ఒడిలో కూర్చుంది. ''అదేమిటి మహర్షీ! ఒడి చేరిన ఎలుకను లటుక్కున పిల్లి నోట్లో వేసేసుకుంటే!? అదేం తెలివి'' – అని ఆత్రంగా ప్రశ్నించిన ఒక మునికి – సూతర్షి నవ్వుతూ – ''లేదు నాయనా! ఎట్టి పరిస్థితులలోను ఈ సమయంలో పిల్లి – ఎలుకను ఏమీ చేయదు. ఎలుక ఉంటే కదా – వలను కొరికి తనను రక్షించగలిగేది. ఎవరి ప్రాణభయం వారిది. పిల్లిని చూస్తే ముంగిస, గుడ్లగూబలకు భయం. పిల్లి ఒడిలో కూర్చుని ఉన్న ఎలుకను చూసి, ఇక లాభం లేదనుకుని వెనుతిరిగి వెళ్ళిపోయాయి. ప్రాణం లేచివచ్చింది ఎలుకకి. బయటికి ఒక్క దూకు దూకింది. వల కొరకడానికి కాస్త ఆలస్యం చేసింది అని ఒక్క క్షణం ఆగాడు సూతముని. శౌనకుడు – ''అయితే మునీంద్రా! ఎలుక వలను కొరకనే లేదా? కృతజ్ఞతను చూపించుకోలేదా? శత్రువైనా తనని రక్షించింది కదా – పిల్లి. దాని చావుకి దాన్ని వదిలేసిందా'' – అంటూ సందేహాల వర్షం కురిపించాడు. సూతుడది విని – ఎలుక చాలా సూక్ష్మబుద్ధి కలది. అందుకే వెంటనే వలను కొరకలేదు. కొరికి ఉంటే – పొద్దుటి నుండి వలలో చిక్కుకుని ఆకలితో నకనకలాడుతున్న పిల్లి ఎలుకను టక్కున మింగేసేది. అది తెలిసే – ఎలుక జాప్యం చేసింది. వల వేసిన వేటగాడు వచ్చేవరకు వేచి ఉన్నది. వేటగాడు రావడం చూసి అప్పుడు వల కొరికితే – తన ప్రాణభయంతో – ఎలుకను తినాలన్న ధ్యాస మరచి – తన ప్రాణం కాపాడుకోవడానికి పిల్లి – క్షణంలో పరుగెడుతుంది. ఇంత ఆలోచించిన ఎలుక కావాలనే – ఆలస్యం చేసింది. ఎలుక ఏదైతే లోతుగా ఆలోచించిందో – అదే జరిగింది. కొద్దిసేపటికి వేటగాడు – అడవి కుక్కలతో వచ్చాడు. అల్లంత దూరాన్నుంచే చూసి, హడలిపోయిన – పిల్లి ఎలుకను వల కొరికి రక్షించమని ప్రాధేయపడింది. అప్పుడు – ఎలుక వల కొరికేసింది. ఒక దూకు దూకి పిల్లి – చెట్టు ఎక్కేసింది. ఒక్క పరుగు తీసి ఎలుక



కలుగులోకి దూరేసింది. తనను తాను కాపాడుకుంటూ – పిల్లిని కాపాడి, తన కృతజ్ఞతను వెల్లడి చేసుకుంది ఎలుక. చూశారా మునులారా! జాతి వైరులైన పిల్లి, ఎలుక – ఆపత్కాలంలో ఒకరికొకరు ప్రాణ దాతలయ్యారు. అదీ విచిత్రం.

తన ప్రాణాలను నిలిపిన ఎలుకతో స్నేహం చేయాలని తల పెట్టి పిల్లి – కలుగు దగ్గరకు వచ్చి –

**"మేలు చేసి తగిన మిత్రుని బడసి త**
**త్ను చరితముల వచ్చు సుఖము లనుభ**
**వింప జూచు టుడిగి వేర్పడి యుండుట**
**యరయ నీతి విదుల తెరవు కాదు"**

**–శాంతి పర్వము – తృతీయాశ్వాసము – ప. 223**

మంచి స్నేహితుని సంపాదించుకుని, అతడితో మిత్ర సౌఖ్యాన్ని పొందాలి. "నేను నీతో స్నేహం చేయాలని వచ్చాను. రా. బయటికి రా. మనం కలిసి మెలిసి ఉందాం" – అంటూ ఎలుకను పిలిచింది. విని కూడా ఎలుక బయటికి రాలేదు – సరికదా – పిల్లికి చెప్పిన ప్రతి ఒక్క మాట – ప్రతి ఒక్కరు అర్థం చేసుకుని పాటించతగిన మణిపూస.

**"అరులను మిత్త్రులం దెలియ**
**నారయు డెంతయు సూక్ష్మకృత్య మ**
**వ్వైరటెవతి దుర్లభం, బరులు వీరన నుండియు మిత్రభావముం**
**బొరయుటయును, సుహృజ్జనుల పోలికి**
**గల్గియు శత్రుతా గుణ**
**స్ఫురణ మొకప్డు సూపుటయు జూతుము గాదె ధరిత్రి నెల్లెడన్"**

**–శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప. 227**

"ఒకడు పగవాడు, ఒకడు స్నేహితుడు – అని తెలుసుకోవడం చాలా సూక్ష్మమైనది. ఆ నేర్పు అందరికీ ఉండదు. శత్రువులనుకున్నవారు మిత్రులవడం, మిత్రులనుకున్నవారు శత్రువులవడం లోకంలో సర్వ సహజం. కాబట్టి నిన్ను చేరడం తగదు. నీకు అవసరమైనప్పుడు తప్పక నీకు సాయపడతాను.

**"బలవంతుడైన శత్రుని**
**వలన ప్రయోజనము కలిగి వలను కలిమి దా**
**గలిసియు నది గడ చనగా**
**దొలగ వలయు నమ్మె నేని దుది గీడొలయున్"**

**–శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప. 238**

బలవంతుడైన శత్రువుతో అవసరం కొద్దీ స్నేహం చేయవలసి వచ్చినా, ఆ అవసరం తీరిపోగానే ఆ స్నేహాన్ని వదులుకోవాలి. అలాకాక – ఇంకా నమ్మితే ఆపదల పాలవుతారు. అదీకాక –

**"బలుపు టురి చిక్కి పేరా**
**కలితో రేయెల్లనున్న కతమున నీకుం**
**జలిది వలని పిలిచెద విటు**
**వలయునె? నీ పలుకు నమ్మి వత్తునె చేరన్"**

**–శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప. 233**

చాలాసేపటినుండి ఉచ్చులో చిక్కుకుని బాగా ఆకలితో ఉన్నావు. నీకు ఆహారం అవసరమై నన్ను పిలుస్తున్నావు. ఇది నీకు తగునా!? నీ మాట నమ్మి నీ దగ్గరకు వస్తానా!?" – అని పలికిన ఎలుకతో – "నేనంత కృతఘ్నుడను కాను. నన్ను కాపాడిన నిన్ను నేను మింగను రా" – అని మళ్ళీ పిలిచింది పిల్లి. అందుకు నవ్వుతూ ఎలుక –

**"నీ వలన నేను బ్రతికితి**
**నీవును నాక తన మాలనికి నగపడవై**
**తీవిధమున కల్గు సుహృ**
**ద్భావము చాలు నిను చేరదగ దిట మీదన్"**

**–శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప. 236**

నీ వలన నేను, నా వలన నీవు బ్రతికి బయటపడ్డాం. ఇది

చాలు. నిన్ను చేరడం నాకు హితం కాదు.

**"నమ్మదగిన వారి నమ్మకయున్నది**
**తగిన వారినైన దద్ద నమ్మి**
**యుండ దగదు తన్ను, నొరులు నమ్మెడునట్లు**
**యుండి యొరుల నమ్మకునికి నీతి"**

**–శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.239**

నమ్మతగని వాళ్ళను నమ్మనే కూడదు. నమ్మతగ్గవాళ్ళనైనా తగినంతగానే నమ్మాలి. ఇతరులు తనను నమ్మేటట్లు నడుచుకుంటూనే తాను వాళ్ళను నమ్మకుండా ఉండటమే సరైన నీతి.

మునిపుంగవులారా! గమనించారా!? ఇంత గొప్పగా లోకనీతిని, లోకరీతిని తెలియచెప్పిన ఎలుక పేరు పలితుడు. అంటే ''తల నెరిసిన వృద్ధుడు'' అని. నిజమే జీవితాన్ని పూర్తిగా అనుభవించి పండిపోయిన వృద్ధుడే జీవన సారాన్ని చక్కగా వివరించగలడు. అందుకే ఎలుకకు ఆ పేరు సార్థకమయింది.

తనతో స్నేహం కోరిన పిల్లికి ఇంతగా బోధించి, చివరగా –

**"విను! నీ కామిష మేను, నీయెడ గడును విశ్వాసముం బూని చే**
**రిన నీచిత్తమొకప్పు డుద్ధత వికారీ భూతమై దుర్వినో**
**దన హింసా నొందు, నీ సుత సుహృద్బంధు వ్రజం బేని మున్**
**నను గన్నన్ సహియింప దాత్మకరుణ, న్మన్నింపు మిట్లుండెదన్"**

**–శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.231**

నేను నీకు మాంసాహారాన్ని. నిన్ను నమ్మి నీతో చేరితే – ఎప్పుడో ఒకప్పుడు నీ మనసు మారవచ్చు. నీవాళ్ళు నన్ను చూసి ఓర్వలేకపోవచ్చు. నోరూరి నన్ను గుటుక్కున మింగి వేయవచ్చు. నా మాట విను. నన్ను మన్నించు. ఇంక నువ్వు వెళ్ళిపో'' అని వినయంగా పలికి, పిల్లిని సాగనంపింది. అంతేకాదు తెలివిగా పిల్లి లేని సమయం చూసి – కలుగు నుండి బయటకు వచ్చి ఆ ప్రదేశానికి దూరంగా వెళ్ళి, మరో కలుగు ఏర్పరచుకుని, భయరహితంగా, సుఖంగా జీవించింది.

బలమైన శత్రువుతో స్నేహం క్షణికమని, బద్ధవైరుల మధ్య మైత్రి పొసగదని, ఎవ్వరినీ పూర్తిగా నమ్మకూడదని, నమ్మినట్లు ఎదుటివారిని నమ్మించాలే కానీ నిజానికి నమ్మకూడదని, మైత్రి అయినా – వైరమైనా పరిమితిలో ఉండాలని మానవళికే బోధించిందీ ఎలుక. శత్రువుకు దూరంగా మసలాలన్న చక్కని నీతిని తెలియజేసింది. పూర్వం పెద్దలు ''ఎలుక్కున్న బుద్ధి కూడా లేదు'' అని కోప్పడేవారు. ''సూక్ష్మ శరీరం కలిగిన ఎలుక బుద్ధి కూడా సూక్ష్మమే'' – అని కూలంకషంగా తెలియచేసిన సూతమహామునిని కొనియాడుతూ శౌనకాదులు లేచారు. ఎలుక బుద్ధి నైశిత్యాన్ని తలచుకుంటూ తమ ఆశ్రమాలవైపు అడుగులు వేశారు. సూతముని ధ్యాన నిమగ్నుడయినాడు.

**(సశేషం)**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుచుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com






ధారావాహిని

# అమ్మ కథలు

- డి.శ్రీనివాస దీక్షితులు



# పురూరవుడు

పూర్వం సుద్యుమ్నుడు అనే రాజు జీవితం పరమశివుని శాపం మూలంగా విచిత్రంగా మారింది. కొంతకాలం ఇళాదేవి అనే పేరుతో స్త్రీగా, మరికొంతకాలం సుద్యుమ్నుడు అనే పేరుతో పురుషునిగా జీవించవలసిన పరిస్థితి ఏర్పడింది.

స్త్రీగా ఉన్న సమయంలో తారా-చంద్రుల కుమారుడైన బుధుడు ఇళాదేవిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. బుధునికి ఇళాదేవికి పురూరవుడు జన్మించాడు.

పురూరవునికి అందంలో మన్మథుడు కూడా సాటిరాడు. అరుదైన ఉదార స్వభావం ఉంది. సద్గుణాల పుట్ట అతను. పురూరవునికి అన్ని ధర్మాలు తెలుసు. అందుకే అతను జనరంజకంగా పరిపాలిస్తున్నాడు.

పురూరవుని రాజధాని ప్రతిష్ఠానపురం.

ఆయన గొప్ప దాత. అనేక యాగాలు చేస్తూ నిరంతరం దేవతల్ని సంతృప్తి పరుస్తున్నాడు. పరాశక్తిని ఎల్లప్పుడూ ధ్యానిస్తూ ఆమె కరుణకి కూడా పాత్రుడయ్యాడు. పురూరవుని బలపరాక్రమాలు ముల్లోకాల్లో వ్యాపించాయి.

స్వర్గలోకంలో రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ అనే నలుగురు అప్సరసలున్నారు. వీళ్ళని దేవవేశ్యలు అని కూడా అంటారు. దేవేంద్రుని ఆస్థానంలో ఈ అప్సరసలు నాట్యం చేసి అలరిస్తూ ఉంటారు. విష్ణుమూర్తి ఊరువు నుంచి పుట్టిన కారణంగా ఈమెని ఊర్వశి అని పిలవసాగారు. అప్సరసల్లో సాటిలేని మేటి అందగత్తెగా ఊర్వశి ప్రసిద్ధి చెందింది. వీళ్ళకి వావి వరసలుండవు. కనువిందు చేసే నాట్యం, వీనులవిందు చేసే గానం, అద్భుతమైన అందం ఊర్వశికి సొంతం.

బ్రహ్మదేవుడు ఇచ్చిన శాపం కారణంగా ఊర్వశి భూలోకంలో పుట్టింది. దివి నుంచి భువికి దిగి వచ్చిన అప్సరసకి పురూరవ మహారాజు గురించి తెలిసింది. అతని అందం... గుణగణాలు... బలపరాక్రమాల గురించి విని ఊర్వశి ముగ్ధురాలయింది. తర్వాత మహారాజుని ఆమె స్వయంగా చూసింది.

పురూరవుడు కూడా ఊర్వశిని స్వయంగా చూశాడు. ఆమె మోహంలో పడిపోయాడు అతను.

ఊర్వశి పురూరవుని వరించింది.

పురూరవుడు ఊర్వశిని వరించాడు.

కానీ ఊర్వశికి గడుసుతనం మెండు.

ఏకాంత ప్రదేశంలో ఇద్దరూ కలుసుకున్నారు.

పరస్పరం మనసులోని ఊసుల్ని కలబోసుకున్నారు.

''ఊర్వశీ! నిన్ను నేను మనసారా ప్రేమిస్తున్నాను. నీకు ఇష్టమేనా?'' అన్నాడు పురూరవుడు.

అందంతో అందరినీ కట్టిపడేసే ఊర్వశి ముందు పురూరవ మహారాజు సాగిలపడ్డాడు. అప్సరసకి తెంపరితనం ఉంది.

''రాజా! నువ్వంటే నాకూ ఇష్టమే! కానీ...'' అంటూ ఆగింది ఊర్వశి.

''ఆగావే... చెప్పు సుందరీ'' అన్నాడు పురూరవుడు.

''రాజా! నాకు మూడు నియమాలున్నాయి. వాటిని నువ్వు పాటించగలిగితేనే నిన్ను నేను వరిస్తాను'' అంది ఊర్వశి.

''అవేంటో చెప్పు. వాటిని తప్పక పాటిస్తాను'' అన్నాడు పురూరవుడు.

అతను ఇప్పుడు పూర్తిగా ఊర్వశి మోహంలో పడిపోయాడు.

''రాజా! జాగ్రత్తగా విను. నా దగ్గర రెండు పొట్టేలు పిల్లలు

ఉన్నాయి. వాటిని నువ్వు జాగ్రత్తగా రక్షించాలి. అవంటే నాకు ప్రాణం. ఇది మొదటి నియమం.

ఇక రెండో నియమం విను. నేను రోజూ నేతినే ఆహారంగా తీసుకుంటాను. మరే పదార్థాన్నీ నేను తినను. ఈ విషయంలో నన్ను బలవంతపెట్టకూడదు.

చివరగా నా మూడో నియమం విను. రతి సమయంలో తప్ప ఇతర సమయాల్లో ఎప్పుడూ నువ్వు నాకు దిగంబరంగా కనిపించకూడదు.

ఈ నియమాల్లో నువ్వు ఏ ఒక్క నియమాన్ని పాటించకపోయినా నిన్ను విడిచిపెట్టి నేను వెళ్ళిపోతాను. ఈ నియమాల్ని నీవు ఒప్పుకుంటే నాకు నీతో కలిసి ఉండటానికి అభ్యంతరం లేదు'' అని కచ్చితంగా చెప్పింది ఊర్వశి.

ఊర్వశి అంటే అంతులేని మోజులో ఉన్న పురూరవుడు ఆ మూడు నియమాల్ని వెంటనే అంగీకరించాడు. ఏ విధమైన పొరపొచ్చాలు లేకుండా ఊర్వశితో అనేక సంవత్సరాలు గడిపాడు. స్వర్గసుఖాల్ని అనుభవించాడు.

అంతకాలం తను చేస్తున్న ధర్మాకార్యాలన్నీ మానేశాడు పురూరవుడు. రాజధర్మాలన్నీ మరచిపోయాడు. యజ్ఞయాగాలు సక్రమంగా చెయ్యటం లేదు. ఊర్వశి తప్ప మరో ఆలోచన లేదు. ఒక్క క్షణం కూడా ఆ అప్సరసని విడిచిపెట్టకుండా కాలం గడుపుతున్నాడు. మోహం ముదిరిపోయింది.

చాలా సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒకనాడు స్వర్గంలో ఇంద్రుడికి ఊర్వశి గుర్తుకొచ్చింది. ఆమె అద్భుత నాట్యవిలాసం గుర్తొచ్చింది. ఆమె మధుర మంజుల గానం గుర్తొచ్చింది. ఆమె కాలి మువ్వల రవళి గుర్తొచ్చింది. తన సభలో ఆమె లేని లోటు స్పష్టంగా కనిపించింది.

ఇంద్రసభ కళావిహీనంగా మారిందని దేవతలందరూ చెప్పుకోసాగారు. ఊర్వశిని ఎలాగైనా సరే స్వర్గానికి తిరిగి తీసుకురావాలని ఇంద్రుడు నిర్ణయించుకున్నాడు.

వెంటనే ఇంద్రుడు గంధర్వుల్ని పిలిపించాడు.

గంధర్వులు దేవతల్లో ఒక గణం. వీళ్ళు ఎక్కడ ఉంటే అక్కడ సువాసనలు వ్యాపిస్తూ ఉంటాయి. గంధర్వులు నిరంతరం గానం చేస్తూ దేవతల్ని ఆనందపరుస్తూ ఉంటారు.

హాహా హూహూ విశ్వావసువు మొదలైనవాళ్ళకి ఊర్వశిని స్వర్గలోకానికి తీసుకువచ్చే పనిని అప్పగించాడు ఇంద్రుడు.

ఇంద్రుని ఆదేశాన్ని అనుసరించి గంధర్వులు భూలోకానికి వెళ్ళారు.

ఒక అమావాస్య నాటి రాత్రి...

కటిక చీకటి కమ్ముకున్న వేళ...

గంధర్వులు పురూరవుని రాజధానికి చేరుకున్నారు. మహారాజు భవనం ముందుకి వెళ్ళారు. అక్కడ కట్టేసి ఉన్న రెండు పొట్టేలు పిల్లల్ని వాళ్ళు చూశారు. ఆ పొట్టేళ్ళని విప్పి గంధర్వులు దొంగతనంగా తీసుకుపోతుండగా అవి బిగ్గరగా అరిచాయి.

ఆ అరుపులు విని నిద్ర లేచింది ఊర్వశి.

పురూరవుని కూడా ఆమె నిద్ర లేపింది.

రాజా! త్వరగా మేలుకో. నా రెండు పొట్టేలు పిల్లల్ని ఎవరో దొంగిలించుకుపోతున్నారు. అవి నాకు ప్రాణంతో సమానం. నువ్వు మగాడివేనా? మొద్దు నిద్ర పోతున్నావు. లే... లే...'' అంటూ తట్టి లేపేందుకు ప్రయత్నించింది ఊర్వశి.

కానీ పురూరవుడు మేలుకోలేదు.

ఊర్వశికి బాగా కోపం వచ్చింది.

బాగా పరుషంగా మాట్లాడింది ఊర్వశి.

పురూరవుడు తాను దిగంబరంగా ఉన్నాననే విషయం కూడా మరచి పోయి గబగబా లేచి పొట్టేళ్ళ కోసం పరుగులు తీశాడు.

అదే సమయంలో గంధర్వులు మెరుపుల్ని సృష్టించారు. ఆ మెరుపుల వెలుగుల్లో నగ్నంగా ఉన్న పురూరవుణ్ణి చూసింది ఊర్వశి. రెండు నియమాల్ని పాటించలేదని ఆగ్రహించింది ఊర్వశి.

ఇంద్రుడు తమకి అప్పగించిన పనిని పూర్తిచేసి గంధర్వులు తిరిగి స్వర్గానికి వెళ్ళిపోయారు.

''నేను చెప్పిన నియమాల్లో రెండింటిని నువ్వు పాటించలేదు. అందువల్ల నిన్ను విడిచి వెళ్ళిపోతున్నాను'' అని నిర్దాక్షిణ్యంగా చెప్పి ఊర్వశి స్వర్గానికి వెళ్ళిపోయింది.

ఆ విధంగా ఆమె వెళ్ళిపోయిన తరువాత పురూరవుడు బాగా క్రుంగిపోయాడు. ఆ దిగులుతో పురూరవుడు తన రాజ్యాన్ని వదిలిపెట్టి బికారిలాగా ఆమెకోసం వెదుకుతూ దేశాలన్నీ తిరుగుతూ క్రమంగా కురుక్షేత్రానికి చేరుకున్నాడు.

అక్కడ పురూరవునికి ఊర్వశి కనిపించింది.

ఆమెతో పురూరవుడు మాట్లాడాడు.

''ఊర్వశీ! నీవు లేకుండా నేను జీవించలేను. నన్ను విడిచి పెట్టి ఎక్కడికీ పోవద్దు. నువ్వు లేకపోతే నేను ప్రాణత్యాగం చేస్తాను'' అన్నాడు దీనాతి దీనంగా పురూరవుడు.

ఊర్వశి మహారాజు మాటల్ని విని ఎగతాళిగా నవ్వింది.

జీవన తత్త్వాన్ని బోధించింది.

''రాజా! నీవంటి వాడికి ఇంత మోహం తగదు. నావంటి స్త్రీల వెంట పడటం మంచిది కాదు. వెళ్ళు. మహాదేవిని ఆశ్రయించు. అమ్మ దయతో మనశ్శాంతి లభిస్తుంది. హాయిగా నీ రాజ్యాన్ని పరిపాలించు. సుఖంగా జీవించు'' అని పురూరవునికి హితువు పలికి స్వర్గానికి వెళ్ళిపోయింది ఊర్వశి.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

గత సంచిక తరువాయి

## 283.గోపికా స్తన్య పాయినే నమః

గోపికల చనుబాలు త్రాగిన వాడు కృష్ణుడు.

గోపికల స్తన్యమును త్రాగిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 284. బలభద్రానుజాయ నమః

బలరామునికి తమ్ముడగు కృష్ణునికి నమస్కారము. ఆదిశేషుని అంశమున వసుదేవునకు రోహిణి యందు జన్మించిన కుమారుడు బలభద్రుడు. ఇతడు మొదట దేవకి గర్భమందుండగా యోగమాయ దేవకి గర్భము నుండి సంకర్షించి రోహిణి గర్భమునకు చేర్చింది. ఇతనిని రోహిణి ప్రసవించింది. కనుక బలరామునకు సంకర్షణుడు అను పేరు కలిగింది. బలరాముడు హలాయుధుడు. ఇతని భార్య రేవతి. బలరాముడు తెల్లటిరంగుతో ఉంటాడు. కృష్ణుడు నల్లనివాడు.

బలరాముడు కౌరవ పాండవ యుద్ధ సమయములో దాన్ని ఆపడానికి ప్రయత్నించి విఫలుడైనాడు. ఆ యుద్ధం నుండి దూరంగా ఉండదలంచి తీర్థయాత్రలు చేసినాడు. ఆ సందర్భములో బలరాముడు వేంకటాచలమును దర్శించి, వరాహ విష్ణుదేవుని సేవించినాడు. వేంకటేశ్వరుడు కలియుగ దైవము. కృష్ణుని అవతార సమాప్తి తరువాత భగవంతుడు అర్చామూర్తిగ వేంకటాద్రిపై స్వయం వ్యక్తమయినాడు. వెలసినాడు. భాగ. స్కంధం -10-79-13 శ్లోకము. పోతన భాగవతం, 10- ఉత్తర – 947 వచనం.

బలరాముని తమ్మునిగా జన్మించిన శ్రీకృష్ణుని కలియుగ అర్చామూర్తి అయిన వేంకటేశునకు నమస్కారము.

## 285. అచ్యుతాయ నమః

చ్యుతి – జారుట – లేనివాడు. అచ్యుతుడు. స్వరూపముచే గాని, సామర్థ్యము చేతగాని ఏ కాలములోను చ్యుతి లేనివాడు తను జారడు. ఆశ్రితులను జారనీయడు – భ్రష్టులను కానీయడు. అతడే అచ్యుతుడు. విష్ణువు. నమే భక్తః ప్రణశ్యతి అని గీతావచనం. శాశ్వతంబగు శివమచ్యుతమ్ అని నారాయణీయము 13-1 కీర్తించింది. చ్యుతి (విడుపు) లేనివాడగు అచ్యుతుని (విష్ణుదేవుని) అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

''తేభ్యం ప్రసన్నేభ్యః నాపగతః'' – అచ్యుతః అని వ్యుత్పత్తి. విభీషణ శరణాగతి ఘట్టములో శ్రీరాముడు 'న త్యజేయం కథంచన' – శరణాగతుడైన వానిని ఎన్నటికినీ విడిచిపెట్టనని శపథము చేసినట్లు రామాయణము వెల్లడించింది.

శ్లో ॥ చ్యవనోత్పత్తి యుక్తేషు బ్రహ్మేంద్ర వరుణాదిషు


యస్మాన్న చ్యవసే స్థానాత్ తస్మాత్సంకీర్త్యసేచ్యుతః ॥

బ్రహ్మ ఇంద్రుడు వరుణుడు మొదలగు దేవతలు ప్రళయాదులలో తమ తమ స్థానముల నుండి ప్రచ్యుతిని (విడిపోవుట) పొందుచుండగా ఓ విష్ణుదేవుడా! నీవు మాత్రము అట్టి చ్యుతిని పొందకుండా ఏకరూపమున వున్నావు. కనుక అచ్యుతుడవని స్తుతింపబడుచున్నావు అని విష్ణుపురాణము అచ్యుత శబ్దమును వివరించింది. విష్ణువు ఎన్ని అవతారములు లెత్తినను తన సహజ ప్రభావమును కోల్పోవుట



**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

లేదని తాత్పర్యము. భగవంతుడు బ్రహ్మాండములోనే క్షీర సముద్రాది స్థలములలో వ్యూహరూపమున వున్నను తన సహజ స్వరూపము నుండి ప్రచ్యుతిని పొందలేదు. కనుక విష్ణువు అచ్యుతుడని కీర్తింపబడినాడు. ఈ అచ్యుత నామము భక్తుల శరణాగతుల మనస్సులలో గల దృఢ విశ్వాసమునకు కారణముగ నున్నది.

అచ్యుత నామము విష్ణు సహస్ర నామములలో 101, 320, 557 సంఖ్యలతో ఉన్నది. శ్రీవేంకటేశ 108 నామావళిలో 98 సంఖ్యతో ఉన్నది.

అచ్యుతుడని కీర్తింపబడిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 286.వైయాఘ్ర నఖ భూషణాయ నమః

పులిగోరు పతకము ఆభరణము ధరించినవాడు కృష్ణుడు.

వైయాఘ్ర నఖ భూషణము ధరించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 287. వత్సజితే నమః

వత్సాసురుని జయించినవాడు (చంపినవాడు) కృష్ణుడు. గోవత్సములను (ఏడాది లోపు ఆవు దూడలు), గోప బాలురను లాలన పోషణలతో తన వశమున వుంచుకొన్నవాడు కృష్ణుడు.

వత్సాసురుడు కంసుని బంటులలో ఒకడు. ఒకనాడు కృష్ణుని యమునా నదీ తీరమున గోవులను గోవత్సములను మేపుచుండగా వత్సాసురుడు కోడెదూడ రూపమున ఆవుల మందలో ప్రవేశించి ఆవు దూడలను పొడిచి బాధించుచుండెను. అది గమనించి కృష్ణుడు రాక్షసుని సంహరిస్తాడు.

కం. క్రేపుల యర్రుల నాకుచు
గ్రేపులలో నిది మంచి క్రేపనగ గడున్
జూపట్టె భక్తి సంగతి
క్రేపై చను వాని మ్రోల గ్రేపై తాగెన్ ॥ - భాగ. 10. పూర్వ 431

ఆవు దూడల మెడలను నాకుచు, ఆవుదూడలలో ఇది మంచి దూడ అనుకొనునట్లు స్నేహముతో తిరుగుచున్న ఆ రాక్షసుని దగ్గర తనూ ఒక ఆవుదూడై కృష్ణుడు వాని వెంట తిరిగినాడు.

చం. ఇది యొక మంచి లేగ వినుడెంతయు నొప్పెడి నంచు డాసి త
త్పదములు దోకయున్ బిగియ బట్టి చెలంగి వెలంగ మ్రానితో
జదియగ నొక్కపెట్టగొని చంపె గుమారుడు లేగ రక్కసున్
గుదులు కొనంగ బాలకులు కో యని యార్వ నభర్వ లీలతోన్ ॥

– భాగ. 10 – పూర్వ – 433

అని పోతన భాగవతములో కృష్ణుడు వత్సాసురుని చంపిన విధమును నైసర్గికముగా వర్ణించినాడు.

## 288.వత్స వర్ధనాయ నమః

ఆవు దూడలను, గోప బాలురను వాత్సల్యముతో పోషించినవాడు, పెంచినవాడు కృష్ణుడు.

వత్స వర్ధనుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

విన్నాడు రాముడు. ఉత్తరీయం తీశాడు. కళ్ళు తుడుచుకున్నాడు. సుగ్రీవుణ్ణి కౌగలించుకున్నాడు. “సఖుడా! నీవు నా మిత్రుడవు. నా మేలు కోరావు. నా కర్తవ్యాన్ని గుర్తు చేశావు.

“దుర్లభోహ దృశో బంధుః అస్మిన్ కాలే విశేషతః”

నీలాంటి బంధువు దొరకడం కష్టం. విశేషించి ఈ కష్టకాలంలో లభించడం దుర్లభం. మంచినేలలో నాటిన విత్తనాలు – వానాకాలంలో బాగా ఫలిస్తాయి. పైరు ఏపుగా పెరుగుతుంది. నీ మాటలు నా మనసులో నాటుకున్నాయి. ఫలిస్తాయి. నేనెప్పుడూ అబద్ధం ఆడలేదు. ఇకముందు ఆడను. వాలిని చంపుతాను. ఇది సత్యం. ఇది నా శపథం”.

సంతోషించాడు సుగ్రీవుడు. ‘‘రామా! నీవు తోడుంటే చాలు. స్వర్గ రాజ్యాన్ని సైతం పొందగలను. ఇక కిష్కింధా రాజ్యమెంత?’’ అంటూ మళ్ళీ అందుకున్నాడు. వాలి నా భార్యని లాక్కున్నాడు. నన్ను రాజ్యం నుంచి గెంటేశాడు. నన్ను చంపాలనుకున్నాడు. ఎందరో వానరుల్ని పంపాడు. వాళ్ళని నేను హతమార్చాను. మిమ్మల్ని చూశాను. వాలి పంపాడనుకున్నాను. శంకించాను. రామా! నా దుఃఖం పోగొట్టు. నా భయం పోగొట్టు’’.

ఎన్ని కష్టాలు వస్తాయో అంత ప్రారబ్ధ కర్మ తరిగిపోతుంది – అంటారు పెద్దలు. సుగ్రీవుడు రాముడు ఇద్దరూ కష్టాల్లో ఉన్నారు. నగల మూట – అది సీతమ్మ జారవిడిచింది. అంటే స్వామికంటే అమ్మవారు కరుణించారు. అదే ఆభరణాల రూపంలో వచ్చింది. సుగ్రీవునికి దొరికింది. ఇక స్వామి కరుణా కటాక్ష వీక్షణాలు – అనుగ్రహించ బడాలి. అదే అగ్ని సాక్షిగా రామయ్యతో మైత్రి. సీతారాముల కృపకు పాత్రుడైనాడు వానర ముఖ్యుడు. భార్య లభిస్తుంది. రాజ్యం లభిస్తుంది. సకలైశ్వర్యాలు లభిస్తాయి. అది నగల సూచన.

అమ్మవారు నిత్యానుపాయిని. దేవ దేవ దివ్య మహిషి. ఆమె అనుగ్రహం సదా స్వామికి ఉంటుంది. ఆభరణాల దర్శనం –

రామునికి శుభ సూచకం. అపార వానరసేనతో సీతాన్వేషణకి సంకేతం. సుగ్రీవునికి అమ్మవారి దర్శనం లభించిందని చెప్పాలి.

సుగ్రీవా! నీకు వాలికి విరోధం ఎందుకు వచ్చింది? అపరాధం వాలిదైతే వాడు శిక్షార్హుడు. చంపేస్తాను. అపరాధం నీదైతే – వాలిని పిలిపిస్తాను. రాజీ చేస్తాను. నీవు సుఖపడేట్లు చూస్తాను.

## మాయావి

''మా తండ్రి ఋక్షరజుడు'' చెబుతున్నాడు సుగ్రీవుడు. ''వాలిని మెచ్చుకునేవాడు. అన్న అంటే నాకు ఇష్టమే. గౌరవం కూడా. నాన్నగారు పోయారు. పెద్దవాడు వాలి. రాజును చేశారు మంత్రులు. నేను వాడికి సేవలు చేసేవాణ్ణి. మయునికి ఇద్దరు కొడుకులు. ఒకడు మాయావి. మరొకడు దుందుభి. మాయావితో విరోధం వచ్చింది వాలికి. అందుకు ఒక స్త్రీ కారణం. ఒకరోజు ఆ మాయావి వచ్చాడు. అది అర్ధరాత్రి. సింహనాదం చేశాడు. గాఢనిద్రలో ఉన్నాడు వాలి. గర్జన వినపడింది. లేచాడు. మాయావిని చంపుతానన్నాడు. వద్దు అన్నాను నేను. వినలేదు. వెళ్ళాడు. అన్న వెంబడి వెళ్ళాను.

రాక్షసుడు మమ్మల్ని చూశాడు. భయపడ్డాడు. పారిపోయాడు. ఒక బిలంలోకి దూరాడు. ''నేను లోపలికెళ్తాను. వాణ్ణి హతమారుస్తాను. నువ్వు ఇక్కడే ఉండు'' అన్నాడు నాతో. వాలి లోపలికి వెళ్ళాడు. నేను బిలద్వారం వద్ద ఉన్నాను. ఎవ్వరూ బయటికి రాలేదు. ఒక సంవత్సరం గడిచింది. మాయావి గర్జనలు వినపడుతున్నాయి. వాలి అరుపులు వినపడలేదు. భయపడ్డాను. అన్నని మాయావి చంపాడనుకున్నాను. రక్తం కాల్వలై పారుతోంది. బయటికి వచ్చింది. మాయావి బయటికి వస్తే ఎలా – ఒక బండరాయిని చూశాను. గుహకి అడ్డుపెట్టాను. ద్వారం బాగా మూసుకుపోయింది.

అన్న పోయాడు. ఇప్పుడెలా? జల తర్పణం వదిలాను. కిష్కింధకి వచ్చాను. విషయం ఎవరికీ చెప్పలేదు. దాచాను. మంత్రులు వత్తిడి చేశారు. జరిగింది చూసింది చెప్పాను. వాళ్ళు ఆలోచించారు. నన్ను రాజుని చేశారు.



నేను రాజ్యపాలన చేస్తున్నాను. ఒకరోజు వాలి వచ్చాడు. మాయావిని చంపేశాడట. నన్ను చూశాడు. కన్నెర్ర చేశాడు. నా మంత్రుల్ని చెరసాలలో బంధించాడు. నన్ను తిట్టాడు. నిప్పులు చెరిగాడు. నేను నిజం చెప్పాను. ఈ రాజ్యం నీది. తీసుకో. నేను నీ దాసుణ్ణి అన్నాను. వినిపించుకోలేదు. కాళ్ళా వేళ్ళా పడ్డాను. ద్రోహి అన్నాడు. నన్ను క్షమించు అన్నాను. శిరసా నమస్కరించాను.

జరిగింది చెప్పాడు. మాయావి కోసం వెదికాను. ఒక ఏడాది పట్టింది. వాడు కనిపించాడు. చంపాను. బిలద్వారం బద్దలు కొట్టాను. బయటికి వచ్చాను అన్నాడు. నన్ను కట్టుబట్టలతో వెళ్ళగొట్టాడు. నా భార్యను పంపలేదు. బలవంతాన వశపరచుకున్నాడు. నన్ను చంపాలని వచ్చాడు. నా వెంట పడ్డాడు. ఈ భూమండలమంతా తిరిగాను. తిరిగి తిరిగి ఈ కొండకు చేరాను. ఇక్కడికి వాలి రాడని తెలిసింది.

అర్థీ అర్థార్థీ జిజ్ఞాసువు జ్ఞాని – ఈ నలుగురు పరమాత్మకి ప్రియులు. అందులో అర్థార్థి సుగ్రీవుడు. విభీషణుడు. ఇద్దరూ రాజ్యం కావాలని కోరారు. ''భవద్గతం మే రాజ్యంచ జీవితంచ సుఖానిచ'' – అంటాడు శ్రీరామునితో. అది విభీషణ శరణాగతి లోనిది. నా భార్యా పిల్లల్ని వదిలేశాను. సుఖభోగాలు వదిలేశాను. జీవితం వదిలేశాను. నా రాజ్యమూ వదిలేశాను అన్నాడు. రాజ్యం ఎవరిది? రావణునిది. అది విభీషణునిది ఎలా అవుతుంది? వాలిని చంపాడు రాముడు. రాజ్యాన్ని సుగ్రీవునికి ఇప్పించాడు. అలాగే రావణుని చంపుతాడు. నాకు రాజ్యాన్ని ఇప్పిస్తాడు – అది విభీషణుని కోరిక.

రాజ్యాన్ని తిరస్కరించాడు భరతుడు. వసిష్ఠుడు చెప్పాడు. మంత్రులు చెప్పారు. వత్తిడి చేశారు. వినలేదు భరతుడు. మంత్రులు వత్తిడి చేయడం ఆలస్యం – రాజ్యాన్ని స్వీకరించాడు సుగ్రీవుడు. వ్యక్తిత్వ వికాసంలో ఉన్నత స్థాయి లోనివాడు భరతుడు. అథమస్థాయి లోనివారు సుగ్రీవ విభీషణులు. అధర్మానికి కొమ్ము కాశారు – వాలి రావణులు. రావణ విభీషణులు అన్నదమ్ములైనా వాలి సుగ్రీవులు అన్నదమ్ములైనా – అంతులేని అంతరాలు. రామ భరత లక్ష్మణ శత్రుఘ్నులు అన్నదమ్ములైనా త్యాగనిరతులు. అన్నదమ్ములు ఎలా ఉండాలి – ఎలా ఉండరాదు – శ్రీరామాయణం చెబుతోంది మనకు.

బిలద్వారం నుంచి రక్తం కారుతోంది. అది వాలిదే అని నిర్ణయించాడు సుగ్రీవుడు. అందుకు ఆధారం లేదు. వాలి చనిపోయాడని నిశ్చయించాడు. అందుకు ప్రామాణికం లేదు. దహన సంస్కారాలు జరగలేదు. అపుడే జలతర్పణాలు విడిచాడు. అది మొదటి తప్పు. కిష్కింధకి రావాలి. తారకు చెప్పాలి. అంగదునికి చెప్పాలి. చెప్పలేదు. అది రెండో తప్పు. మంత్రులకి చెప్పాలి. చెప్పలేదు. అది మూడో తప్పు. ఒకవేళ

వాలిని మాయావి చంపి వుంటే – అపార వానరబలంతో వెళ్ళాలి సుగ్రీవుడు. బిలద్వారం వద్ద మాటు వేయాలి. మాయావి వస్తే హతమార్చాలి. వాలి వస్తే ఘనస్వాగతం పలకాలి. ఆ పని చేయలేదు సుగ్రీవుడు. అది నాలుగో తప్పు.

బాగా ఆలోచిస్తే – వాలి మీద ద్వేషం ఉంది సుగ్రీవునికి. రాజ్యకాంక్ష ఉంది. అది సుస్పష్టం. రాజ్యం రాకపోతే – సీతాన్వేషణలో తన దగ్గరున్న వానరులు చాలరు. రాజ్యం వస్తే అంతులేని వానర సేన లభిస్తుంది. రామకార్యం సాధించవచ్చు. అటు స్వామి కార్యం ఇటు స్వకార్యం సాధించవచ్చు. అది సుగ్రీవుని రాజనీతి.

వాలిని హనుమంతుడు చంపగలడు. తన రాజు సుగ్రీవుని దుఃఖం రూపు మాపగలడు. అయితే తన బలం తెలియనివాడు మారుతి. అందుకే మిన్నకున్నాడు. హనుమతో చెప్పి తన అన్నని చంపమని సుగ్రీవుడు ఆదేశించవచ్చు కదా. అంటే వాయుపుత్రుడు ఎంత బలశాలి అయినా తన భృత్యుడు. అతని సాయం అర్థించటం రాజుకి తగనిపని. అది అతని రాజనీతి.

## దుందుభి

దుందుభి మాయావికి తమ్ముడు. ఒక రాక్షసుడు. దున్నపోతు. ఆకాశంలో ఉంటాడు. మహాపరాక్రమవంతుడు. బలగర్వితుడు. యుద్ధోన్మాది. తనతో యుద్ధానికి రమ్మని అందరినీ పిలుస్తూ ఉంటాడు. సముద్రుణ్ణి పిలిచాడు. హిమవంతుణ్ణి పిలిచాడు. అతడన్నాడు వాడితో – ''నీకు సరిజోడు వాలి. ఒక వానరుడు. కిష్కింధాపతి. పో అక్కడికి''.

ఆ దుందుభిని మించినవాడు వాలి. పొద్దున్నే లేస్తాడు. నాలుగు సముద్రాల్లో స్నానం చేస్తాడు. అర్ఘ్యం సమర్పిస్తాడు. తిరిగి కిష్కింధకి వస్తాడు. అది వాడి దినచర్య. పెద్ద పెద్ద కొండల్ని పెకలిస్తాడు. బంతుల్లా ఎగరేస్తాడు. పట్టుకుంటాడు. ఒకే దెబ్బ వేస్తాడు. మహావృక్షాల్ని పడగొడతాడు. అది మా అన్న సరదా.

ఆ రోజు వచ్చాడు దుందుభి. పిలిచాడు వాలిని. బంగారు మాల వేసుకున్నాడు. అది వాలికి ఇంద్రుడిచ్చాడు. నగరం నుండి బయటికి వచ్చారు. దుందుభిని చూశాడు. మహిషాసుర ఆకృతిలో ఉన్నాడు. పోగానే వాడి కొమ్ములు పట్టాడు. గిరగిరా తిప్పాడు. విసిరాడు. గర్జించాడు. వాడు లేచాడు. వాలి మీదికి ఉరికాడు. ఒకరికొకరు దెబ్బలు తీయాలనుకొన్నారు. యుద్ధం భయకరంగా సాగింది. దుందుభిని ఎత్తాడు. కిందపడేశాడు. పిడికిళ్ళతో పొడిచాడు. మోకాళ్ళతో కుమ్మాడు. కాళ్ళతో తొక్కాడు. ఆ రాక్షసుని బలం తగ్గిపోయింది. వాలి బలం పెరిగింది. వాణ్ణి మళ్ళీ పైకెత్తాడు. నేలకేసి కొట్టాడు. చచ్చాడు దుందుభి. ఆ మహాకాయాన్ని చూశాడు. ఎత్తాడు. విసిరాడు. యోజనదూరం (8 మైళ్ళు) లో పడింది.

వాడి రక్తపు బిందువులు మతంగ ఆశ్రమంలో పడ్డాయి. కొన్ని చుక్కలు మతంగ ముని మీద పడ్డాయి. క్రుద్ధుడైనారాయన. దుస్సాహసం చేసింది వాలి. తపశ్శక్తితో గ్రహించారు. వాడు ఈ ఋష్యమూక పర్వతానికి రాకూడదు. వస్తే చస్తాడు – అది ఆ ముని శాపం. అది తెల్సింది వాలికి. అందుకే వాడు ఇటువైపు రాడు.

రామా ఇదో చూడు. దుందుభి అస్థిపంజరం. ఇదొక కొండలా ఉంది. ఇవిగో చెట్లు. ఎంత పెద్దవో చూడు. ఆ చెట్లని ఊపుతాడు వాలి. ఆకులన్నీ రాలిపోతాయి. ప్రభూ! ఇది మా వాలి బలం. పరాక్రమం.

కథం త్వం వాలినం హంతుం సమరే శక్ష్యసే
వాలితో ఎలా యుద్ధం చేస్తావో ఎలా చంపుతావో.

## పరీక్షలు

వాలిని గూర్చి విపులంగా చెప్పాడు సుగ్రీవుడు. శ్రద్ధగా విన్నాడు సౌమిత్రి. నవ్వాడు. ''వాలిని చంపుతాడు మా రాముడు. అందుకు మా అన్న ఏం చేయాలో చెప్పు. ఏం చేస్తే నమ్ముతావో అదే చెప్పు'' అది లక్ష్మణుని భరోసా.

''లక్ష్మణా ఈ మద్దిచెట్లు చూడు. ఇవి ఏడు. ఒకే దెబ్బ వేస్తాడు వాలి. ఏడు చెట్లూ పడిపోతాయి. ఇపుడు రాముడు ఒకే బాణం వేయాలి. ఈ ఏడు చెట్లూ పడిపోవాలి. అది దుందుభి కళేబరం. ఒకే కాలితో తన్నాలి. నాలుగు వందల గజాల దూరంలో పడాలి. అప్పుడు నమ్ముతాను'' అవి సుగ్రీవుని పరీక్షలు.

భిక్షు రూపంలో రాముణ్ణి చూశాడు హనుమంతుడు. చూడగానే అనుకున్నాడు – వాలిని హతమార్చగలడు. సుగ్రీవునికి విజయం అందించగలడు. అది విశ్వాసం. రాముడు సాక్షాత్ నారాయణుడే. లక్ష్మణస్వామి ఆదిశేషుడే. ఆ ఆదిశేషుడు స్వామికి ఉత్తరీయంగా, పడకగా, దిండుగా, గొడుగుగా – అనేక విధాల సేవలందిస్తూ ఉంటాడు. రామలక్ష్మణుల వైభవం, మహిమలు గుర్తించాడు హనుమంతుడు. ఇద్దరినీ తన భుజాలపై చేర్చుకున్నాడు. అంటే తన హృదయంలో నిలుపుకున్నాడు. అది హనుమంతుని నమ్మకం.

సుగ్రీవుడు మొదట్లో చూశాడు రాముణ్ణి. కరచాలనం చేశాడు. నమస్కరించలేదు. అక్కడ మారుతి రామలక్ష్మణులకు నమస్కరించాడు. పూజించాడు. అంటే సుగ్రీవునికి సంశయం. సంశయగ్రస్థుడు ఉభయ భ్రష్టుడు అవుతాడంటుంది గీతామాత. రెండు పరీక్షలు పెట్టాడు సుగ్రీవుడు. అదీ రాముని మీద విశ్వాసం లేదని భావార్థం.

పరీక్షలు పెట్టాడని బాధ పడలేదు రాముడు. వానరుడు సుగ్రీవుడని చులకనగా చూడకు అన్నాడు కబంధుడు. ఆ మాట గుర్తుంది రామునికి. అంతేకాదు స్నేహానికి విలువ ఇచ్చాడు.

మిత్రుడు తనని నమ్మాలనుకున్నాడు. అది రాముని నిగ్రహం.

దుందుభి అస్తిపంజరం చూశాడు రాముడు. తన కాలి బొటనవేలితో చిమ్మాడు. అది పది యోజనాల దూరంలో (80 మైళ్ళు) పడింది. చూశాడు సుగ్రీవుడు. మళ్ళీ సంశయంలో పడ్డాడు. అపుడు దుందుభి శరీరం వచ్చింది. రక్తమాంసాలతో ఉంది. బరువుగా ఉంది. ఇపుడు ఎండిపోయింది. వట్టి ఎముకల గూడు. తేలిగ్గా ఉంది. అపుడు వాలి అలసి ఉన్నాడు. ఇపుడు రాముడు ఉత్సాహంతో ఉన్నాడు. బలవంతుడెవరు – తేల్చుకోలేకపోయాడు.

ఇక రెండో పరీక్ష. సప్త తాళ వృక్షాల్ని ఒకే బాణంతో కొట్టాలి. విల్లు అందుకున్నాడు రాముడు. బాణం తొడిగాడు. నారిని చెవి దాకా లాగాడు. విడిచాడు. ఆ బాణం రివ్వున పోయింది. ఏడు మద్ది చెట్లని నరికింది. కొండ చరియలోకి దూసుకుపోయింది. భూమిలోకి దిగింది. నేలను చీల్చింది. పైకి లేచింది. తిరిగి వచ్చింది. అంబుల పొదిలోకి చేరింది. అంతా క్షణంలో జరిగిపోయింది. ఆశ్చర్య చకితుడైనాడు సుగ్రీవుడు. నోట మాట రాలేదు. సంతుష్టుడైనాడు.

మొదట రామునితో కరచాలనం చేశాడు. తర్వాత మైత్రి చేశాడు. ఇద్దరూ సమానులని భావించాడు. ఇపుడు రామ పరాక్రమం చూశాడు. చేతులు జోడించాడు. తల వంచాడు. సాష్టాంగ నమస్కారం చేశాడు. రాముని కాళ్ళు పట్టుకున్నాడు. తనకంటే రాముడు గొప్పవాడని తలచాడు. రామబాణం ఏమిటో చూశాడు. తనకంటే మహావీర్యవంతుడని భావించాడు.

ఏదైనా అనుభవానికి రావాలి. అపుడే మనిషి గర్వం అణుగుతుంది. సాష్టాంగ నమస్కారం అంటే రెండు చేతులు, రెండు కాళ్ళు, తల, మనస్సు, బుద్ధి, అహంకారం – ఈ ఎనిమిదీ బాగా వంగాలి. పెద్దలను దర్శించినపుడు అలా అహంకార రహితులై నమస్కరించాలి.

“ప్రభూ! ఇంద్రాది దేవతల్ని కూడా వధించగలవు. ముల్లోకాల్లో నీకు ఎదురు లేదు. నిజంగా నా మిత్రునివే. నా భయం పోయింది. నా దుఃఖం పోయింది” ఎన్నో రకాలుగా పొగడ్తలు గుప్పించాడు. ఆనందపరవశుడైనాడు సుగ్రీవుడు. “సుగ్రీవా ఎపుడో ఎందుకు? వాలిని ఇపుడే పిలు. చంపుతాను. కిష్కింధకి పోదాం పద. నీవు ముందు నడు” – అని ఉత్సాహపరిచాడు రాముడు.

## అన్నదమ్ములు

మనలో మాట. రామునికి ముగ్గురు తమ్ముళ్ళు. మొత్తం నలుగురు అన్నదమ్ములు. వారిలో పొరపొచ్చాల్లేవు. పగల్లేవు. భరతుని కోసం రాజ్యం త్యాగం చేశాడు రాముడు. రామునిదే రాజ్యం నాది కాదన్నాడు భరతుడు. అది అన్నదమ్ముల త్యాగబుద్ధి. ఐక్యత.


వాలి సుగ్రీవులు ఇద్దరూ అన్నదమ్ములు. వాలి నా అన్న కాదు. నా శత్రువు అంటాడు సుగ్రీవుడు. అన్నని చంపు. రాజ్యం ఇప్పించు. అది అతని లక్ష్యం. ఇక రావణుని విషయానికొస్తే – అతనికి ఇద్దరు తమ్ముళ్ళు. అధర్మపరుడు మా అన్న. అందుకే నా భార్యా పిల్లల్ని వదిలేశాను అంటాడు విభీషణుడు. అంతేకాదు కట్టుబట్టలతో లంక విడిచాడు. రాముని శరణు వేడాడు. అన్నని చంపు. రాజ్యం ఇప్పించు – అది తమ్ముని కోరిక. అన్నదమ్ములు ఎలా ఉండాలి, ఎలా ఉండరాదో చెబుతోంది శ్రీ రామాయణం మనకు.

వాలి సుగ్రీవుల మధ్య ఐక్యతకు ప్రయత్నించవచ్చు. భార్య లేనివాడు సుగ్రీవుడు. రాజ్యమూ కావాలని ఉన్నాడు. సఖ్యతకు, రాజీకి ఒప్పుకోడు. వాలి బలశాలి. అధర్మపరుడు. సంధికి ఒప్పుకోడు. ఇద్దరిలో సుగ్రీవుణ్ణి కలవాలి. స్నేహం చేసుకోవాలి – అది కబంధుని హితవు. సుగ్రీవుడు ప్రజ్ఞాశాలి. ధైర్యశాలి. వినయశీలి. వీరుడు అన్నాడతడు. వాలితో చేసుకోవద్దని చెప్పలేదు. వాలి మంచివాడు కాదు. అందుకే హనుమంతుడు అతణ్ణి వదిలేశాడు. సుగ్రీవుని చెంత చేరాడు. ధర్మపరుడై ఉండాలి. సత్యవ్రతుడై ఉండాలి. ఆ లక్షణాల్లేవు వాలిలో. సంధి ప్రయత్నాలు విరమించాడు రాముడు. వాలిని చంపాలని నిర్ణయించాడు. సుగ్రీవునికి సుఖశాంతులు అందించాలనుకున్నాడు.

రాముడు ప్రోత్సహించాడు. సుగ్రీవుడు ముందు నడిచాడు. వెనుక రామ లక్ష్మణ హనుమంతులున్నారు. కిష్కింధ సమీపించారు. ఆగారు. దట్టమైన చెట్లున్నాయి. చాటున నిలిచారు ముగ్గురూ. నగర సింహద్వారం చేరాడు సుగ్రీవుడు. వాలిని పిలిచాడు. గర్జించాడు. ఆ శబ్దం ఆకాశాన్ని తాకింది. ప్రతిధ్వనించింది.

## తొలి పోరు

గర్జన విన్నాడు వాలి. కోపోద్రిక్తుడైనాడు. ద్వారం దాటాడు. నడుస్తున్నాడు. అస్తమిస్తున్న సూర్యుడు కనిపించాడు. చూశాడు తమ్ముణ్ణి. గట్టిగా దట్టీ కట్టి ఉన్నాడు. మహావేగంగా వెళ్ళాడు వాలి. అది తీవ్రమైన యుద్ధం. బుధుడు, అంగారకుడు పరస్పరం ఢీ కొట్టినట్లు – కలబడ్డారు అన్నదమ్ములు. అరచేతి దెబ్బలు పిడుగుల్లా ఉన్నాయి. పిడికిటి పోట్లు వజ్రాయుధపు దెబ్బల్లా ఉన్నాయి. చావుదెబ్బలు తిన్నాడు సుగ్రీవుడు. అటు ఇటు చూస్తున్నాడు రాముడు బాణం వేస్తాడేమోనని. ఒళ్ళంతా హూనమైంది. రక్తసిక్తమైంది. అలసిపోయాడు. ఋష్యమూక పర్వతం వైపు పరిగెత్తాడు. వెంటపడ్డాడు వాలి. తమ్ముడు మతంగవనంలో దూరాడు. చూశాడు వాలి. శాపం గుర్తుకు వచ్చింది. ఆగాడు. “బతికిపోయావు పో” అన్నాడు. వెనుదిరిగాడు.



సుగ్రీవుణ్ణి చూశారు రామ లక్ష్మణ హనుమంతులు. చూశాడతడు. తల వంచుకున్నాడు. నేల చూపులు చూస్తున్నాడు. స్వరంలో దైన్యం తొంగి చూసింది. జాలి పుట్టేట్లు అంటున్నాడు. ''నేను వాలిని చంపలేను – అని అప్పుడే చెప్పాలి. నేను యుద్ధానికి పోయేవాణ్ణి కాదు'' అవి రాముని ఉద్దేశించిన మాటలు.

''సుగ్రీవా'' అంటున్నాడు రాముడు. నేను బాణం వేయలేదు. ఎందుకో తెలుసా?''

**అలంకారాణేన వేషేణ ప్రమాణేన గతేనచ |**
**త్వంచ సుగ్రీవ వాలీచ సదృశేస్థః పరస్పరమ్ ||**

మీ ఇరువురి పోలికలు ఒకటే. వేషం ఒకటే. మాటల్లో స్వరాలు ఒకటే. ఒడ్డూ పొడుగూ ఒకటే. చూపులు ఒకటే. నడకలు ఒకటే. కొంచెం కూడా తేడా లేదు. నా బాణం భయంకరమైంది. పొరపాటున అది నీకు తగిలితే – నీ ప్రాణం పోతే – అభయమిచ్చినవాణ్ణి చంపినవాణ్ణవుతాను. అది మహాపాపం. అపుడీ లోకం నన్ను మూర్ఖుడంటుంది. నీవు మా రక్షకుడవు. నన్ను శంకించకు. నిన్ను గుర్తు పట్టాలి''.

లక్ష్మణుని వైపు చూశాడు. ''సౌమిత్రీ! అదుగో గజపుష్పలత. చూడు. దాన్ని తీసుకురా. సుగ్రీవుని మెడలో వెయ్''.

వెళ్ళాడు లక్ష్మణుడు. తీగని తెంచాడు. తెచ్చాడు. మాలగా చేశాడు.

సుగ్రీవుని మెడలో వేశాడు. నిండు పున్నమినాటి చంద్రునిలా ఉన్నాడతడు.

''మిత్రమా! ఇపుడు పో. ఒకే బాణం వేస్తాను'' ఉత్సాహపరిచాడు రాముడు. వెళ్ళాడు సుగ్రీవుడు.

ఎవరైనా భగవత్ సంబంధమైన చిహ్నాలు ధరించాలి. అది భగవత్ ప్రీతి కోసం. ఆ స్వామి అనుగ్రహం కోసం. నుదుట బొట్టు పెట్టుకోవాలి. సంప్రదాయ దుస్తులు ధరించాలి. అపుడు కొన్ని ఆలయాల్లో ప్రవేశం. సంప్రదాయం సంస్కృతి తెలిసినవారు అనునిత్యం బొట్టు పెట్టుకుంటారు. సంప్రదాయ వస్త్రధారణలో వుంటారు. తక్కినవాళ్ళు బొట్టు పెట్టుకోరు. పెద్దలు చెప్పినా వినరు. కొందరు ఇంట్లో ఉన్నంతసేపు బొట్టులో ఉంటారు. బయటికి వెళ్ళేటపుడు తుడిచేస్తారు. నామోషీ. సిగ్గు.

కొందరు ఆడవాళ్ళున్నారు. నుదుట బొట్టు ఉండదు. మెడలో తాళిబొట్టు ఉండదు. జడ వేసుకోరు. ఒక పాయ అటు, మరో పాయ ఇటు మెడమీద వేళ్ళాడదీస్తారు. కనీసం జారుముడి కూడా వేసుకోరు. భర్త చనిపోతే – స్మశానానికి వెళ్ళే భార్య జుట్టు విరబోసుకుంటుంది. బొట్టులేని ఆడదాన్ని, మగవాణ్ణి చూసినా సచేల స్నానం చేయాలి. అది శాస్త్ర వచనం. శవాన్ని చూసినా తాకినా కట్టుబట్టలతో స్నానం చేయాలి. కొందరు విద్యార్థులు పరీక్షలపుడు బొట్టు పెడతారు. గుడికి వెడతారు. పరీక్షలు అయ్యాక అన్నీ మానేస్తారు. షరా మామూలే.

అపుడు కొమ్మ విరిచి రాముణ్ణి కూర్చోబెట్టాడు సుగ్రీవుడు. లక్ష్మణుని పట్టించుకోలేదు. ఇపుడు గజపుష్పమాల లక్ష్మణుడు వేశాడు. మాల వేసుకోవాలంటే తల వంచాలి. ఎవరిని అవమానించాడో అతని ముందు తల వంచాడు. మాల వేయించుకున్నాడు. అహంకారం అణగిందతనికి. అంతేకాదు తొలి పోరులో దేహశుద్ధి కూడా చేయించాడు రాముడు. అది భాగవత అపచారానికి శిక్ష. ఆ పని నరునిలోని నారాయణుడు చేయించాడు.

ఇద్దరూ ఒకే పోలికలో ఉన్నారు. గుర్తు పట్టలేనన్నాడు రాముడు. ఋష్యమూక పర్వతం మతంగవనం వైపు వెళ్ళేవాడు సుగ్రీవుడు. కిష్కింధ వైపు పోయేవాడు వాలి. ఆ మాత్రం పోల్చుకోలేడా రాముడు. వాలి మెడలో హేమమాల ఉంటుంది. సుగ్రీవుని మెడలో ఏమీ ఉండదు. ఆ మాత్రం ఎవరైంది గుర్తుపట్టలేడా. సుగ్రీవునికి భార్య లేదు. తిండి లేదు. కొండ కోనల్లో బతుకు. కాస్త చిక్కిపోయి ఉండడా?

వాలిని అనేక బాణాల్లో చంపుతానన్నాడు మొదట్లో. ఏడు మద్ది చెట్లని ఒకే బాణంతో పడగొట్టాడు. ప్రత్యక్ష యుద్ధమా పరోక్ష యుద్ధమా తేల్చుకోలేకపోయాడు రాముడు. అందుకే బాణం వేయలేదు తొలి పోరులో. ఒకే బాణంతో చెట్లను కొట్టాడు. ఒకే బాణంతో వాలిని చంపాలనుకున్నాడు. మలిపోరులో పరోక్ష యుద్ధానికే మొగ్గు చూపాడు.

ఇపుడు ఉత్సాహంతో ఉన్నది సుగ్రీవుడు. 'సుగ్రీవా! వాలిని పిలు. నీ గర్జన వింటాడు. జాగు చేయక. వస్తాడు వాలి. భయపడకు పో. పిలు'' అన్నాడు రాముడు. **(సశేషం)**

ధారావాహికం

# ముకుందమాల

**భువనేశ్వరి మారేపల్లి (9550241921)**

**భవజలధి మగాధం దుస్తరం నిస్తరేయం**
**కథమహమితి చేతో మాస్మగా: కాతరత్వం ।**
**సరసిజదృశి దేవే తావకీ భక్తిరేకా**
**నరకభిది నిషణ్ణా తారయిష్యత్యవశ్యం ॥ 13 ॥**

ఓ మనసా! దాటటానికి దుస్సాధ్యమై అగాధమైన ఈ సంసార సాగరాన్ని నేను ఎలా దాటగలను అని కంగారుపడకు. శ్రీహరి పాద పద్మాల మీద స్థిరమైన భక్తిని అలవరచుకుంటే ఆ భక్తి ఒక్కటే నరకయాతనల నుంచి, సంసార సాగరం నుంచి రక్షిస్తుంది.

మనసా! పరమాత్మ పరమ కారుణికుడు కాబట్టే మనం ఎక్కడి నుండి వచ్చామో అక్కడికి తన యందు లయం చేసుకోవాలనే తలంపు తోటి ఆ స్వామి నిన్ను నాకు దయచేశాడు. మనస్సును సాధనంగా చేసుకుని తరించమని పరమాత్మ యొక్క అభిప్రాయం.

**'ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవరిపురాత్మనః ॥' - గీత 6.5**

మనస్సును బంధువుగా చేసుకుని సుఖపడాలి అనే తలంపుతోనే నిన్ను ఆ పరమాత్మ కరుణించెను. కాబట్టి నిన్ను సమర్పిస్తే పరమాత్మ నన్ను సంసార సాగరమును దాటిస్తాడు.

'భవజలధిమగాధం దుస్తరం నిస్తరేయం'– సంసార సాగరమనే ఈ సముద్రం చాలా గంభీరమైన అగాధం, మనమే దాటగలం అనే యోచన కూడా చేయశక్యం కానిది. 'కథమహమితి' ఇలాంటి కష్టతరమైన భవసాగరాన్ని ఎలా దాటుతానో అని 'చేతః'– మనసా, 'కాతరత్వం' – పిరికితనాన్ని, 'మా స్మగాః' పొందకు, అధైర్యం చెందకు. 'సరసిజదృశి దేవే తావకీ భక్తిరేకా' తామర పుష్పముల యొక్క రేకుల వలె ఉండే కోటి సూర్య ప్రకాశితమైన నేత్రాల యొక్క దివ్య సౌందర్యమును చూసినా చాలు, అంతేనా చరాచర ప్రపంచానికి జ్ఞానమును ప్రసాదించి మోక్షమనే లీలను ఇవ్వగలిగిన వాడు, బ్రహ్మాది దేవతలకు శరణు ఇచ్చిన వాడు, నరకాంతకుడు, అలాంటి వాడిని శరణు పొందిన తరవాత పాపభీతి ఇక ఉండదు. భక్తి ఒక్కటే చాలు. నిజమైన భక్తికి భగవంతుడు వశమవుతాడు.

పాండురంగస్వామిని నిత్యం సేవించి తరించిన మహాభక్తులలో 'నామదేవుడు' ఒకడుగా కనిపిస్తాడు. అలాంటి నామదేవుడి బాల్యంలో జరిగిన ఒక సంఘటన ఆయన భక్తి శ్రద్ధలను చాటి చెబుతుంది. నామదేవుడి తల్లిదండ్రులు దామాసేఠ్ – గోణాయి పాండురంగస్వామికి పరమ భక్తులు. ఆ ఇంట్లో ఏది చేసినా ముందుగా ఆ స్వామికి సమర్పించకుండా స్వీకరించేవారు కాదు.

ఒకసారి పనిమీద బయటికి వెళ్లిన దామాసేఠ్, స్వామివారికి నైవేద్యం పెట్టవలసిన సమయానికి తిరిగి రాలేకపోతాడు. దాంతో తల్లి కోరిక మేరకు పాండురంగడికి నైవేద్యం తీసుకుని ఆలయానికి వెళతాడు నామదేవుడు. బాలుడు కావడం వలన భగవంతుడు నిజంగానే వచ్చి ఆ నైవేద్యాన్ని స్వీకరిస్తాడని అనుకుంటాడు.

ఆయన ఎంతకీ రాకపోవడంతో మారాం చేస్తాడు. దాంతో స్వామి వచ్చి ఆ నైవేద్యాన్ని ఆరగించి అదృశ్యమవుతాడు. నైవేద్యాన్ని గురించి అడిగిన తల్లిదండ్రులకి స్వామి ఆరగించాడని చెబుతాడు నామదేవుడు. అతని మాటలను నమ్మలేక, అలాగని చెప్పి కొట్టిపారేయలేక వాళ్లు సతమతమై పోతారు. సందేహాన్ని నివృత్తి చేసుకోవడం కోసం, మరునాడు వాళ్లు ఆయనని అనుసరిస్తూ వెళతారు. నామదేవుడు స్వయంగా స్వామికి తినిపిస్తూ ఉండటం చూసి ఆశ్చర్యపోతారు. తమ కుమారుడి నిర్మలమైన భక్తి స్వామివారి మనసును గెలుచుకుందని గ్రహిస్తారు. ఆయన వలన సాక్షాత్తు పరమాత్ముడినే దర్శించే భాగ్యం కలిగినందుకు ఆ దంపతులు సంతోషంతో పొంగిపోతారు.

నామదేవుడు (సా.శ.1270–1350) మహారాష్ట్రకు చెందిన వాగ్గేయకారుడు. వర్కారీ సాంప్రదాయంలో ప్రముఖుడు. ఇతని జీవితం పై అనేక అస్పష్టతలున్నాయి. అతను మరణించిన కొన్ని శతాబ్దాల తరువాత అనేక అద్భుత సంఘటనలతో కూడిన జీవిత కథలు చాలా వచ్చాయి. కానీ పండితులు ఇందులో సమాచారం ఒకదానితో ఒకటి పొంతన లేకుండా ఉందని అభిప్రాయపడ్డారు.

నామదేవుడు వైష్ణవ సాంప్రదాయంచే ప్రభావితం అయ్యాడు. అతను రాసిన అనేక గీతాలు భజన పాటలుగా ప్రాచుర్యం పొందాయి. అతని పాటల్లో ముఖ్యంగా ఏకేశ్వరోపాసన, సగుణ బ్రహ్మ, నిర్గుణ బ్రహ్మ తత్వాలు కనిపిస్తాయి. మిగతా గురువులతో

కలిసి అతను ప్రారంభించిన వర్కారీ సాంప్రదాయం ప్రజల్లో బాగా ప్రా చుర్యం పొందింది. ఈ సాంప్రదాయం ప్రకారం ద క్షిణ మహారాష్ట్రలో సంవత్సరానికి రెండు సార్లు భక్తులు సామూహికంగా పండరీపురానికి పాదయాత్ర చేస్తారు.

నామదేవుడి జీవితం గురించి స్పష్టమైన వివరాలు అందుబాటులో లేవు. చాలామంది అతను 1270, 1350 మధ్య జీవించి ఉండవచ్చునని భావిస్తున్నారు. కానీ మహారాష్ట్రలోని సంత్ సంప్రదాయాన్ని క్షుణ్ణంగా పరిశోధన చేసిన ఎస్.బి కులకర్ణి వంటి పరిశోధకులు నామదేవుడు 1207-1287 ల మధ్య జీవించినట్లుగా భావిస్తున్నారు. ఇంకా కొంతమంది పండితులు 1425 ప్రాంతంలో జీవించి ఉండవచ్చుననీ, ఆర్.భరద్వాజ్ అనే పండితుడు 1309-1372లో జీవించి ఉండవచ్చునని అభిప్రాయపడుతున్నారు.

నామదేవుడికి 'రాజాయ్' అనే ఆమెతో వివాహం అయింది. వారికి 'విఠ' అనే కొడుకు ఉన్నాడు. వీరిద్దరూ మరియు నామదేవుడి తల్లి గోనాయ్ అతని గురించి రాశారు. అతని సమకాలికులైన ఒక శిష్యుడు, ఒక గురువు, ఒక కుమ్మరి కూడా అతని గురించి ప్రస్తావించారు. అయితే అప్పటి పాలకులు మాత్రం వారి రికార్డులలో, శాసనాలలో ఇతని గురించి ప్రస్తావించలేదు. వర్కారీ సాంప్రదాయం కాని వాళ్ళ రచన, మహానుభవ సంప్రదాయానికి చెందిన 1278లో రాయబడిన 'లీలాచరిత్ర' అనే గ్రంథంలో అతని ప్రస్తావన ఉంది. ఇంకా 1310లో రాయబడిన 'స్మృతిస్థల' అనే మహానుభవ సాంప్రదాయ గ్రంథం కూడా ఇతని గురించి ప్రస్తావించి ఉండవచ్చు. దీని తరువాత 1538లో రాయబడిన మరాఠీ చరిత్ర 'భకర్' అనే గ్రంథంలో మాత్రమే అతని గురించి ప్రస్తావన ఉంది.

పదహారవ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యం పతనమైన తరువాత మరాఠా దేశంలో నామదేవుడు ప్రముఖ పాత్ర పోషించిన మరాఠీ భక్తి ఉద్యమం పునరుత్తేజం పొందింది.

**గర్భగుడిలోని దేవుడు భక్తుడి ఇంట్లో !**

గర్భాలయంలో శిలారూపంలో దర్శనమిచ్చే దేవుడికి అందరూ నమస్కరించుకుని వెళుతుంటారు. అయితే అలా శిలారూపంలో గల దేవుడే నిజ భక్తులతో మాట్లాడిన సందర్భాలు లేకపోలేదు. ఆయా భక్తులలో గల లోపాలను సరిదిద్దిన దాఖలాలు లేకపోలేదు. నామదేవుడి విషయంలోనూ ఇది మరోమారు నిరూపించబడింది.

ఒకసారి తనని దర్శించడానికి వచ్చిన నామదేవుడితో పాండురంగడు మాట్లాడతాడు. నామదేవుడిలోని భక్తుడు పరిపక్వత చెందలేదనీ, జ్ఞాన సముపార్జన కోసం క్షేత్ర పర్యటన చేయమని చెబుతాడు. స్వామి ఆదేశం మేరకు నామదేవుడు అనేక క్షేత్రాలను దర్శిస్తాడు. ఎంతోమంది భక్తులను, యోగులను కలుసుకుంటాడు. అసాధారణమైన శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్నప్పటికీ వాళ్లంతా ఎలాంటి అహంకారం లేకుండా నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతూ వుండటం ఆయనకి చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

సాధు సత్పురుషుల నుంచి అనేక విషయాలు తెలుసుకుని, కొంతకాలం తరువాత ఆయన పండరీపురం చేరుకుంటాడు. స్వామివారి గర్భాలయం దగ్గరికి వెళ్లగానే లోపల స్వామివారి విగ్రహమే తప్ప, అక్కడ ఆయన ప్రత్యక్షంగా లేడనే విషయం అర్థమైపోతుంది. తనకి దర్శనం ఇవ్వవలసినదిగా ఆయన మనసులోనే పాండురంగడిని ప్రార్థిస్తాడు. తాను గోరాకుంభార్ ఇంట్లో సేవకుడిగా ఉన్నాననీ, అక్కడికి వచ్చి తన దర్శనం చేసుకోమనే మాటలు నామదేవుడికి వినిపిస్తాయి.

గతంలో గోరాకుంభార్ అనే భక్తుడిని తాను చాలా తక్కువగా చూడటం, అవహేళన చేయడం ఆయనకి గుర్తుకు వస్తుంది. సాక్షాత్తు పాండురంగడినే ఇంటికి రప్పించుకున్న గోరాకుంభార్ మహా భక్తుడనీ, అది తెలుసుకోక పోవడం తన అజ్ఞానమనే అనుకుంటాడు. తాను భక్తుడిగా పరిపక్వత సాధించలేదని స్వామి ఎందుకన్నాడో అప్పుడు ఆయనకి అర్థమవుతుంది. స్వామివారితో పాటు గోరాకుంభార్ ను కూడా దర్శించుకోవాలనే ఆత్రుతతో ఆయన ఉన్నపళంగా అక్కడికి బయలు దేరుతాడు.

గోరా అనే అతను ఒక కుమ్మరి సాధువు. ఆయన ఒకసారి సాధు సంతులకు విందు ఏర్పాటు చేస్తూ భక్త నామదేవుని మరియు భక్త జ్ఞానదేవుని ఆహ్వానిస్తాడు. అందరూ భోజనాలకు కూర్చున్నారు. అప్పుడు జ్ఞానదేవుడు కుమ్మరి సాధువుని పిలిచి కుండలు పచ్చివా లేదా బాగా కాలి యున్నవో ఎలా తెలుసుకుంటావో అలానే ఈ సాధువులు బాగా పండి ఉన్నారో లేదో తెలుసుకోమన్నాడు. అప్పుడు కుమ్మరి సాధువు ఒక కర్ర తీసుకువచ్చి ఒకొక్కరి తల మీద కొట్టుకుంటూ పోతాడు. నామదేవుని దగ్గరికి వచ్చేసరికి అతడు కోపంతో ఊగిపోతాడు. ఆత్మ జ్ఞానాన్ని పొందిన నన్నే పరీక్షించి అవమానిస్తావా అని కేకలేస్తాడు. దీనికి సమాధానంగా వరుసలో నున్న వారందరికన్నా నామదేవుడే చాలా పచ్చిగా నున్నాడని కుమ్మరి జవాబిస్తాడు. అందరూ గొల్లుమని నవ్వుతారు. నామదేవుడు చాలా బాధపడతాడు. తనకు జరిగిన అవమానానికి తను నమ్మిన విఠోబానే అడుగుదామని గుడికివెళ్లి ఆ విఠలుని నిలదీస్తాడు.

విఠలుడు ప్రత్యక్షమై అందరిలాగే మాట్లాడకుండా మౌనంగా వుండాల్సిందని ఓదార్చి అక్కడికి కొన్ని యోజనాల దూరంలోనున్న శివాలయములో ఒకతను ఉంటాడు, అతని

దగ్గరికి పొమ్మని చెబుతాడు. వెంటనే నామదేవుడు శివాలయం వైపు పోయి చూస్తే అక్కడొక భిక్షగాడు శివలింగముపై కాళ్ళుపెట్టి పడుకొని వుండడం చూస్తాడు. నామదేవుడు అతన్ని నిద్రనుంచి లేపాడు. అతను లేచి, ఓహో నువ్వా! ఆ విఠలుడు పంపించిన నామదేవుడవే కదా! రా! రమ్మని పేరు పెట్టి పిలుస్తాడు. నామదేవుడు ఆశ్చర్యపోతూ శివలింగముపై కాళ్ళు తీసేయ్యమని అతన్ని అడుగుతాడు. అప్పుడతను నేను తీయలేను నీవే తీసెయ్యి నాయనా అంటాడు. సరేనని నామదేవుడాతని కాళ్ళు జరుపుతాడు. విచిత్రంగా కాళ్ళు జరిపిన చోటే ఒక శివలింగం ఉద్భవించింది. నామదేవుడు కాళ్ళను ఇంకోచోటికి జరుపుతాడు. అక్కడొక శివలింగం పుట్టింది. ఆశ్చర్యంగా ఆ బిచ్చగాని పాదాలు ఎక్కడ పెడితే అక్కడొక శివలింగం పుట్టుకొస్తోంది. నామదేవుని మతిపోయింది. అప్పుడా బిచ్చగాణ్ణే అడిగాడు ఎక్కడ పెట్టాలని! నీ తొడపైనే పెట్టుకోమన్నాడు బిచ్చగాడు. నామదేవుడు అలానే చేశాడు. ఈ సారి తానే శివలింగమైనాడు! అంతే నామదేవునికి ఇప్పుడు ఆత్మజ్ఞానం కలిగింది.

**నిజం తెలుసుకున్న నామదేవుడు!**

పండరీపురంలో ఆవిర్భవించిన పాండురంగడి భక్తుడు నామదేవుడు. నిరంతరం ఆయన పాండురంగడి నామాన్ని స్మరిస్తూ ఉండేవాడు. కాలినడకన ఎక్కడికి బయలుదేరినా, గమ్యం చేరేవరకూ ఆ స్వామిని కీర్తిస్తూ ఉండేవాడు. ఆయన పాటలను విని మిగతా భక్తులు తమని తాము మైమరచి పోయేవారు.

ప్రతిరోజు నామదేవుడు నైవేద్యం సమర్పించగానే, సాక్షాత్తు ఆ పాండురంగడే స్వయంగా వచ్చి వాటిని ఆరగించేవాడు. దాంతో తనని మించిన భక్తుడు లేడనే అహంభావం ఆయనలో తలెత్తింది. ఈ నేపథ్యంలో ఒకరోజున ఆయన ఎంతగా ప్రార్థించినా పాండురంగడు రాలేదు. నైవేద్యం స్వీకరించలేదు. దాంతో తాను చేసిన అపరాధమేమిటో తెలియక నామదేవుడు ఆవేదన చెందాడు.

నేరుగా జ్ఞానదేవుడి దగ్గరికి వెళ్లి జరిగిందంతా ఆయనకి వివరించాడు. తాను సమర్పించిన నైవేద్యం స్వామి స్వీకరించకపోవడానికి గల కారణమేమిటో అర్థంకావడంలేదని అన్నాడు. మరో భక్తుడెవరో స్వామిని పిలిచి ఉంటాడనీ, ఆయన అక్కడికే వెళ్లి ఉంటాడని జ్ఞానదేవుడు చెప్పాడు. తన కన్నా గొప్ప భక్తుడు వుండే అవకాశంలేదని ఆయనతో అన్నాడు నామదేవుడు.

ఆయన కళ్ళు తెరిపించాలనుకున్న జ్ఞానదేవుడు, తన ఆతిథ్యం స్వీకరించి వెళ్లమని నామదేవుడిని కోరాడు. అయితే అందుకు అవసరమైన వంటసామాగ్రి అక్కడ లేకపోవడంతో, ఆలస్యమవుతుందేమోనని అన్నాడు నామదేవుడు. అలాంటిదేమీ లేదంటూ పాండురంగడిని ప్రార్థించి, మోకాళ్లపై వంగాడు జ్ఞానదేవుడు. ఆయన ఉదరంలో అగ్ని ప్రజ్వరిల్లగా వీపు పెనంలా వేడెక్కింది.

పొగలు వస్తోన్న జ్ఞానదేవుడి వీపుపై ఆయన చెల్లెలు వంటపాత్రలు వుంచి క్షణాల్లో వంట పూర్తి చేసింది. ఈ దృశ్యం చూసి నామదేవుడు ఆశ్చర్యపోయాడు. తనకంటే భక్తిలో జ్ఞానదేవుడు గొప్పవాడనీ, అలాగే తమ ఇద్దరికంటే గొప్ప భక్తుడు కూడా వుండే ఉంటాడని ఆయనకి అర్థమైంది. అంతటి భక్తుడు ఎక్కడ ఉన్నాడో తెలుసుకుంటే స్వామి జాడ తెలిసినట్టేనని అనుకున్నాడు. అందుకోసం ఆయన అక్కడినుంచే దేశసంచారం మొదలు పెట్టాడు.

**నామదేవుని మహిమ గురించి ఒక కథ వుంది:**

ఒకరోజు నామదేవుడు నాగేశ్వర జ్యోతిర్లింగ ఆలయంలో భజన చేస్తున్నాడట. అదేసమయంలో బ్రాహ్మణుల బృందం శివునికి పూజలు చేస్తున్నారట. నామదేవుడు చేస్తున్న భజన వలన బ్రాహ్మణులకు వారు చేస్తున్న పూజకు అంతరాయం అనిపించి, వారు నామదేవుణ్ణి గుడి వెనకకు వెళ్లి అక్కడ కూర్చుని పాటలు పాడుకోమన్నారట. వారి కోరికను మన్నించిన నామదేవుడు వారు చెప్పినట్లే దేవాలయము వెనకకు వెళ్లి భజనలు చేస్తున్నాడు. అప్పుడు స్వామివారి లీల ఒకటి జరిగింది. పరమేశ్వరుడు నామదేవుని పాటలు వినటానికా అన్నట్లు దేవాలయ ముఖద్వారం వెనకకు తిరిగిందట. అది గమనించిన బ్రాహ్మణులు పశ్చాత్తాపం చెంది నామదేవుని వద్దకు వెళ్లి తమ తప్పుకు చింతిస్తూ క్షమించమని కోరి, అతనిని శివలింగం దగ్గరే భజనలు చేసుకోమన్నారట.

“సర్వ శరీరేషు చైతన్యైకతా ధ్యానం” “సర్వ శరీరములందునూ వుండు చైతన్యమొక్కటియే యని భావించి యుండుటయే ధ్యానము.” పైన చెప్పినటువంటి చైతన్యము అన్నింటి యందు వుండునని భావించుటయే (అనుభవించుటయే) ధ్యానమని చెప్పబడుచున్నది. ధ్యాన యోగములో చిట్టచివరి భావన ఇదియే. ఇచట కేవల చైతన్య భావన తప్ప ఇతర భావన లుండవు. దీనికి చక్కటి ఉదాహరణలు “శ్రీ ఆదిపాండురంగ భక్తవిజయము”లో వున్నాయి. అందులో ఒకటి. ఒకసారి నామదేవుడు రొట్టెలు చేస్తూ వుండగా, ఒక కుక్క వచ్చి రొట్టెలను నోటితో కరచి పట్టుకొని పారిపోతుంది. అప్పుడు నామదేవుడు నేతిగిన్నెను చేతితో పట్టుకొని దాని వెనుక పరిగెడతాడు. ఆ కుక్క పండరీపురమంతా తిప్పి చివరికి నామదేవుడికి దొరుకుతుంది. అప్పుడు నామదేవుడు ఆ కుక్కను



జాగ్రత్తగా వొళ్ళో కూర్చోపెట్టుకొని, పాండురంగా! గట్టిగా వున్న ఈ రొట్టెలను తింటే, నీనోటికి గుచ్చుకోవా? ఈ నేతిలో ముంచిపెడతాను, అప్పుడు మెత్తగా వుంటాయి అని ఆ రొట్టెలను నేతిలో ముంచి ఆ కుక్కకు పెడుతూవుంటాడు. కొంతమంది ఇది చూసి ఆయనను వెక్కిరిస్తే, కొంతమంది ఆయన ఆ కుక్కలో పాండురంగడిని చూడగలుగుతున్నాడని తెలుసుకొన్నారు. ఈ స్థాయిలో శారీరక, మానసిక అంతరాలు నశిస్తాయి. సర్వ ప్రాపంచిక కోరికలు, భావనలు నశిస్తాయి. చివరికి కర్మలు వేదనిర్దిష్ట ధర్మములు కూడా త్యజింపబడతాయి.

ఒకసారి సక్కుబాయి నామదేవుని వద్దకు వెళ్లి స్వామీ! నా పిడకలు ఎదురింటివారు దొంగిలిస్తున్నారు అని ఫిర్యాదు చేసింది. అవి నీ పిడకలేనని ఎలా చెప్పగలవు? అని ప్రశ్నించాడు నామదేవుడు. నేను నిరంతరమూ నామస్మరణ చేస్తూ సర్వ కర్మలను ఆచరిస్తుంటాను. ఆ ప్రభావము పిడకల మీదకూడా ఉంటుంది. అంటూ ఒక పిడక తెచ్చి నామదేవుని చెవి దగ్గర పెట్టింది. నామదేవునికి పిడకలో రంగా! రంగా! పాండురంగా! అని వినిపించింది. నామదేవుడు నమ్మలేక మరొక పిడకను చేయమన్నాడు. ఆమె ఆవుపేడ తెచ్చి భగవన్నామ స్మరణ చేస్తూ పిడకను చేసి నామదేవుని చెవి దగ్గర పెట్టింది. అందులో కూడా రంగా! రంగా! పాండురంగా! అని వినిపించింది నామదేవునికి. వెంటనే నామదేవుడు సక్కుబాయికి శిష్యుడై పోయి తాను కూడా నిరంతరము నామస్మరణ చేస్తూ వచ్చాడు. అంతకు పూర్వం ఆయన పేరు వామదేవుడు. నిరంతరం భగవన్నామ స్మరణ చేస్తూ ఉండడము చేత నామదేవుడనే పేరు వచ్చింది.

జ్ఞానదేవ్, నామదేవులిద్దరూ ఒకసారి తీర్థయాత్రలు చేస్తున్నారు. ఏ తీర్థాన్ని సేవించినా, ఏ క్షేత్రాన్ని సందర్శించినా నామదేవుడికదంతా పండరిపురమే. పండరీనాథ దర్శనమే. అతని భావమంతా తన స్వామిపైనే. అలా యాత్రలు సాగిస్తుండగా మార్గమధ్యంలో ఒకచోట వారికి దాహం వేసింది. నీటి కోసం సమీపంలో కనిపించిన బావి దగ్గరకు వెళ్ళారిద్దరూ. కానీ బావిలో నీరు అగాధంలో ఉంది. అందుబాటులో లేదు. లోపలికి దిగటానికి మెట్లు కూడా లేవు. జ్ఞానదేవుడు యోగమహిమ కలవాడు కనుక వెంటనే పక్షిరూపం ధరించి బావిలోకి వెళ్ళి నీరు తాగి వచ్చాడు. "నామదేవా నా యోగశక్తితో నిన్ను కూడా పక్షిగా మారుస్తాను. వెళ్ళి కావలసినన్ని నీళ్ళు త్రాగిరా" అన్నాడు. నామదేవుడు నవ్వి "మిత్రమా! నా పాండురంగడు నాతో ఉండగా నేను పక్షిగానో, పిట్టగానో ఎందుకు కావాలి? నాకు కావల్సిందేదో నా దేవుడే ఇస్తాడు. నన్ను మనిషిగానే ఉండనియ్యి" అని ఆర్తితో భగవన్నామ సంకీర్తన చేయసాగాడు. తన్మయావస్థలో కనులరమోడ్చి భక్తితో సంకీర్తనం చేస్తుండగా బావిలో అట్టడుగు అగాథంలో ఉన్న నీరు పైకి ఉబికి పొంగి వచ్చింది. చూడు జ్ఞానదేవా! నా పండరీ ప్రభువు దయ! కావలసినన్ని నీరు త్రాగు. పక్షిగానో, పిట్టగానో మారవలసిన పనిలేదు" అన్నాడు నామదేవుడు.

జ్ఞానదేవుడికి నామదేవుడి భక్తి యొక్క శక్తి అర్థమైంది. "నామదేవా! నీ పేరుని సార్థకం చేసుకున్నావు. నా జ్ఞానం కన్నా నీ నామమే మహిమాన్వితమైనది" అని ప్రశంసించాడు. అదే నిజమైన భక్తి. తన్మయస్థితి. భగవద్భక్తులు విశ్వాసంతో ఆత్మనివేదన చేసుకోవాలి. ఆత్మనివేదనమంటే తనకు తాను ఏ షరతులు కోరికలు లేకుండా భగవంతునికి సమర్పణమవటం. ఇదే అనన్య – అన్యమెరుగని భక్తి. అటువంటి భక్తుల యెడ భగవంతుడు కూడా వారి మనోగతంతో పాటు నడుస్తాడు. అందుకే పరమ భాగవతోత్తముడు నామదేవుడు భక్తులందరికీ ఆదర్శప్రాయుడు.

కనుక ఓ చిత్తమా! బెంగపెట్టుకోకు, సంసార జలధి దాటించగలది రెండక్షరముల నామమే అని చెప్పి ఆ 'హరిని' భక్తితో వేడుకోమని ఉపదేశిస్తున్నారు కులశేఖరులు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ నమః**

ధారావాహికం



శ్రీ పద్మపురాణాంతర్గత

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

గత సంచిక తరువాయి

## నాల్గవ అధ్యాయం – శ్రీనివాసావతార వృత్తాంతం

### 1.క్షీరసాగరానికి బ్రహ్మాది దేవతలు :

దేవలుడు దేవదర్శనుని నారాయణగిరిపై స్వామిపుష్కరిణీ తీరంలో శారంగ ధారియైన శ్రీమహావిష్ణువు శ్రీనివాసుడుగా ఆవిర్భవించిన విధానాన్ని తెలియజేయమని అడిగాడు. అపుడు దేవదర్శనుడు దేవలమహర్షీ! బ్రహ్మాండాల నన్నటిని తన ఉదరంలో పెట్టుకొన్న నారాయణుని అవతార గాథని చెబుతాను. సావధానంగా విను అంటూ ఇలా చెప్పసాగాడు.

పూర్వం దుర్మేధసుడు అనే శివభక్తుడైన రాక్షసుడు బ్రహ్మాది దేవతలందరినీ బాధించసాగాడు. వారంతా చల్లారిన నిప్పు వలె భయభీతులై ఆ రాక్షసునిచే ఓడింపబడి ఏమి చేయటానికి పాలుపోక రాక్షసాంతకుడైన నారాయణుని శరణు వేడటానికి పాల సముద్రానికి వెళ్ళారు. అక్కడ మహాలక్ష్మీ సమేతుడై విశ్వరక్షణ దీక్షితుడైన శ్రీమహావిష్ణువును దర్శించి ఈ విధంగా స్తోత్రం చేయసాగారు.

### 2.క్షీరాబ్ధినాథ స్తోత్రం :

ఓ దేవదేవా! నీకు నమస్కారము. నీవు దేవతలందరికంటె సనాతనుడవు. నందకమనే ఖడ్గాన్ని చేత ధరించి ఉన్నావు. శ్రీవత్స లాంఛనుడవు. పరాత్పరుడవైన నీకు నమస్కారము. పరవాసుదేవ స్వరూపుడవు. వ్యూహాంతర విభూతి కలవాడవు. విభవావతారములను ధరించినవాడవు. విశ్వాంతర్యామివి. సూక్ష్మరూపుడవైన నీకు నమస్కారము. అర్చామూర్తిగా ఉన్న నీకు నమస్కారము. నీవు పుట్టుక లేని వాడవైనప్పటికీ అనేకసార్లు అవతరించావు. మహా మాయావివి, జగత్స్రష్టవు. లక్ష్మీ నారాయణుడవైన నీకు నమస్కారము. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయటానికి నీవు భూలోకానికి దిగి వస్తావు. జగత్తుకు ఆనందాన్ని కలిగిస్తావు. లోకాలన్నింటికీ శుభం చేకూరుస్తావు. గంగకు పుట్టినిల్లైన పాదపద్మములు గల నీకు నమస్కారము. నీవు చరాచర జగత్తుకు ఆధారభూతుడవు. బ్రహ్మకు తండ్రివి. ఉపేంద్రుడవు. జనార్దనుడవైన నీకు నమస్కారము. ఓ లక్ష్మీపతీ! నీకు నమస్కారము. సజ్జన బృంద సంగతా! సర్వవ్యాపీ! మహావిష్ణూ! అనంతరూపా! ఆదిమూర్తీ! నీకు నమస్కారము. ఓ పుండరీకాక్షా! దేవతానాయకా! నాగభోగ శయనా! నారాయణా! నీకు నమస్కారము. జగదీశ్వరుడవు, విశ్వరూపుడవు, విశ్వాతీతుడవు, విశ్వాధ్యక్షుడవు, విశ్వసాక్షివి, పరబ్రహ్మవు. గరుడ వాహనుడవైన నీకు నమస్కారము. నిత్యుడవు. దోషరహితుడవు. నిరాకారుడవు. ధర్మమూర్తివి.

అనంత కళ్యాణగుణాలకు నిధివైన నీకు నమస్కారము.

సచ్చిదానంద స్వరూపుడవు, వృద్ధి క్షయ రహితుడవు, అచ్యుతుడవు, అనంతుడవు, గోవిందుడవైన నీకు నమస్కారము. అపార కరుణా సముద్రుడవు, నిశ్చలుడవు, నిర్వికారుడవు, నిస్సంగుడవు, లక్ష్మీపతివి, విలక్షణుడవు, జగత్ప్రభువువు, విచక్షణుడవు అయిన నీకు నమస్కారము.

ఋతస్వరూపుడవు, సత్యస్వరూపుడవు, పరబ్రహ్మవు, నీలమేఘ శ్యాముడవు, గోరోజనవర్ణము కలవాడవు, ఊర్ధ్వరేతస్కుడవు, విరూపాక్షుడవు, విశ్వరూపుడవు అయిన నీకు నమస్కారము. నీవు కారణాలన్నింటికి ఆది కారణం. నీ విభూతులనంతములు. నీవు శివ ధనుర్భంగము చేశావు. నీవు శాశ్వతంగా శారంగ ధనువును ధరించావు. అటువంటి నీకు నమస్కారము.

నీవు ఆదిత్యమండల మధ్యంలో హిరణ్యగర్భునిగా ఉన్నావు. రూపరహితుడవు. పురుషోత్తముడవు, వేదవేద్యుడవు, వేదాంత గమ్యుడవు అయిన నీకు నమస్కారము. నిగమాగమములు నీ ప్రభావాన్ని స్తుతిస్తున్నాయి. ఓ పుండరీకాక్షా! పురుషోత్తమా! అనుగ్రహించు. పరమానంద స్వరూపా! పరమేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము! ఓ కమలాకాంతా! కరుణాకరా! భక్తార్తి భంజనా! దేవదేవా! అనుగ్రహించుము.

ఈవిధంగా స్తోత్రం చేస్తున్న త్రికాలజ్ఞులు మహాత్ములు అయిన బ్రహ్మాది దేవతల ఎదుట క్షీర సముద్రం నుండి లక్ష్మీదేవి సఖి ఆవిర్భవించింది. ఆమె తెల్ల తామర వలె ఉన్నది. తామర దళాల వలె విశాలమైన నేత్రములు కలిగి ఉన్నది. పద్మము వలె అందమైన ముఖము కలిగిన ఆ పుణ్యశీల పుండరీకాక్షుని ఆజ్ఞచే భక్తుల వ్యధలను పోగొట్టుచూ సమస్త సంపదలను సమకూర్చే అమృతమయమైన వాక్కులను ఇలా పలికింది.

### 3.లక్ష్మీనారాయణుడు :

ఓ దేవతలారా! మీ అందరికీ స్వాగతం. మీరు వచ్చిన కార్యం సిద్ధించు గాక! మీకు రాక్షసుల వలన గాని, దైత్యుల వలన గాని, ఏమైనా బాధలు కలుగుతున్నాయా? అవ్యాజ కరుణామూర్తియైన లక్ష్మీపతి వారిని సంహరించుటకు సిద్ధంగా ఉన్నాడు. శ్రీవత్స లాంఛనుడు, శారంగధరుడు అయిన నారాయణుడు మిమ్ములను రక్షించుటకు సమర్థుడు. మీరు భయపడవద్దు. మీకింక అడ్డంకులు ఉండవు. త్వరలోనే శ్రీనివాసుడు, సర్వవ్యాపకుడు అయిన విష్ణుభగవానుడు మీ ఎదుట సాక్షాత్కరించి మీ అభీష్టాలను నెరవేరుస్తాడు.

ఆ శ్రీహరి ఇప్పుడు ఆమోద ప్రమోద సమ్మోదాది దివ్యలోకములను విడిచి లక్ష్మీదేవితో కూడ నారాయణగిరిలో స్వామిపుష్కరిణీ తీరంలో నివసిస్తున్నాడు. ఆయన సర్వాంతర్యామి, అధోక్షజుడు, వేయి తలలు, వేయి కన్నులు, వేయి పాదములు కలవాడు. కావున మీరిపుడు వెంటనే భూమికి దక్షిణం వైపు వెళ్ళండి. మీ పని నిర్విఘ్నంగా నెరవేరుతుంది అని చెప్పి ఆ లక్ష్మీదేవి సఖి అదృశ్యమైంది. బ్రహ్మాది దేవతలందరూ ఆమె మాటలు విని స్వస్థచిత్తులై ఆ దివ్యదేశానికి సాష్టాంగ ప్రణామం చేసి, ప్రదక్షిణం చేశారు. ఆ దేవతలందరు సంప్రీతులై ఉత్సాహంతో సావధానంగా అక్కడినుండి బయలుదేరి దక్షిణ దిక్కుకు వెళ్ళారు.

### 4.నారాయణాద్రిపై బ్రహ్మాది దేవతలు :

ఆ బ్రహ్మాది దేవతలు అందరు నారాయణాద్రి పరిసర ప్రాంతములకు చేరారు. సిద్ధులు, తాపసులు వారికి అతిథి సత్కారాలు చేశారు. వారు పరమ పవిత్రమైన పుణ్యతీర్థాలను, సరస్సులను, నదులను సేవించారు. వారిలో లతాగృహాల్లో నివసించేటటువంటి కిన్నర మిథునాలు మంద్ర, మధ్య, ఉచ్చస్వరాలతో మధురాతి మధురంగా భగవత్కథా గానాన్ని చేస్తున్నాయి. వారు వాటిని వింటూ ఆ శిలాతలముల యందు విశ్రమించారు. సప్తస్వరాలను పలికిస్తూ, వీణాతంత్రులను మీటుతూ, వేణునాదం వినిపిస్తూ, మృదంగాలను మ్రోగిస్తూ నవరసాలతో కూడిన భగవదవతార కథలకు సంబంధించి అప్సరసల నాట్యాన్ని తిలకిస్తూ మార్గాయాసం తెలియకుండా నెమ్మదిగా మోహరహితులై నిర్మలానందంతో నారాయణాద్రిని చేరారు.

బ్రహ్మాది దేవతలు అక్కడ ఉన్న స్వామిపుష్కరిణి తీరంలో కొంచెం సేపు విశ్రమించారు. తమకు క్షీరసాగరంలో లక్ష్మీదేవి ప్రియసఖి చెప్పిన శుభంకరమైన వాక్కులను జ్ఞాపకం చేసుకొన్నారు. లక్ష్మికి నివాస స్థానమైన వాడు, శ్రీవత్సలాంఛనుడు అయిన శ్రీనివాసుని కళ్యాణ గుణాలను ఈ విధంగా ప్రశంసించారు.

### 5.అనంత కళ్యాణ గుణాకరుడు :

ఆ పరాత్పరుడు శివునిచే ఆరాధింపబడినవాడు, భూదేవిచే పూజింపబడేవాడు, శ్రీ భూదేవీ సహితుడు, సర్వభూత హితుడు, భక్తులకు సన్నిహితుడు, హృదయవాసి, వేదనిష్ఠాగరిష్ఠులకు ఆత్మానుభూతి ప్రదాత, త్రిమూర్తులకు అంతర్యామి. త్రిమూర్తి స్వరూపుడు, త్రిగుణాత్మకుడు, త్రికాలరూపి, వాసుదేవ–సంకర్షణ–ప్రద్యుమ్న– అనిరుద్ధ అనే నాలుగు రూపాలు కలవాడు. శాంతస్వరూపి. ఇరవైనాలుగు తత్త్వాలు కలవాడు. బాల్య, కౌమార, యౌవన, వార్ధక్యాలనే నాలుగు అవస్థలకు అతీతుడు. ధర్మార్థ కామ మోక్షాది చతుర్విధ పురుషార్థ ప్రదాత. పంచోపనిషదాత్మ స్వరూపుడు, పాంచరాత్రాగమ ప్రవర్తకుడు, పంచాధర్వశిరోరత్నం, పర–వ్యూహ–విభవ–అర్చా–అంతర్యామి అను పంచమూర్త్యాత్మకుడు. షట్చక్రాలలో

ఉండేవాడు. షట్కోటి గృహమేధి. సప్తార్చి పంజరంలో ఉండే హంస, సూర్యమండల మధ్యవర్తి, పరమహంస స్వరూపుడు.

శ్రీహ రి అష్టాంగ యోగ వేత్తలైన సిద్ధుల బృందాల హృదయాలలో నివసించేవాడు. దశావతారాలను ధ రించిన చతురుడు. దశాననుని శిరస్సుని ఛేదించినవాడు. చరమోపాయమైన ప్రపత్తి చేత సులభముగా పొందదగినవాడు. చరాచర జగత్తుకు గురువు. తన కాలి బొటనవ్రేలు నుండి గంగను పుట్టించిన పాదమహిమ గలవాడు. శరణార్థుల ఆర్తిహరుడు. ప్రాజ్ఞుడు. ఓంకార స్వరూపుడు. అవ్యాజ మిత్రుడు. శత్రు సంహారకుడు. శరణార్థులను రక్షించువాడు. జ్ఞాన–శక్తి–బల–ఐశ్వర్య–వీర్య–తేజస్స్వ రూపుడు.

సత్త్వ రజ స్తమో గుణములతో ముల్లోకాలను మోహింప జేయువాడు. సృష్టి స్థితి లయ కారకుడు. నిగ్రహానుగ్రహ స్వరూపుడు. భక్తులకు, ఇతరులకు కూడా చింతించినంత మాత్రానే మోక్షాన్నిచ్చేవాడు. శబ్దగుణకమైన ఆకాశంలో ఉండేవాడు, విశుద్ధుడు, సూక్ష్మస్వరూపుడు, నిరంజనుడు, నిరవద్యుడు, నిరాకారుడు, బాధారహితుడు, నిరామయుడు, నిరాశ్రయుడు, నిస్తరంగుడు, నీలమేఘశ్యాముడు, సర్వవ్యాపి, జగత్ప్రభువు, అతీంద్రియుడు, పరబ్రహ్మ అయిన నారాయణుని బ్రహ్మాది దేవతలు తమ ఇంద్రియములతో యథోచితంగా అర్చించాలనుకుంటూ వారంతా ముక్తకంఠంతో ఉచ్చైస్వరంతో ఉత్సాహంతో భగవంతుణ్ణి ఈ విధంగా స్తుతించారు.

ఓ పుండరీకాక్షా! నీకు జయమగు గాక! విశ్వభావనా! నీకు నమస్కారము. హృషీకేశా! మహాపురుషా! ఆదికారణా! నీకు నమస్కారము. వైకుంఠవాసా! శ్రీవత్సలాంఛనా! నీకు నమస్కారము. త్రిమూర్తి స్వరూపా! మోహనాకారా! నీకు నమస్కారము. దైత్య సంహారకా! విశ్వరక్షకా! విచక్షణా! నారాయణా! నీకు నమస్కారము. శేషశయనా! అనాథనాథా! నీకు నమస్కారము. విశ్వస్రష్టా! విశ్వభర్తా! విశ్వత్రాతా! విశ్వాంతర్యామీ! విశ్వాతీతా! నీకు నమస్కారము.

**6.దివ్య విమానంలో శ్రీనివాసుడు :**

ఈ విధంగా వారంతా ఆనంద పారవశ్యంతో వికసించిన నేత్రాలతో, విప్పారిన ముఖాలతో సంపదలు కోరుతూ తొట్రుపడుతూ స్తోత్రం చేస్తుండగా, ఆ బ్రహ్మాదుల ఎదుట ఒక దివ్య విమానం వైకుంఠం నుండి వచ్చింది. అది మహా తేజస్సుతో వెలిగిపోతోంది. కళ్ళు మిరుమిట్లు గొలిపేటట్లుగా ఉంది. దివ్యమైన దాని స్వరూపం చూచేవారికి ఆనందాన్ని కలిగిస్తోంది. ఆ దివ్య విమానం స్వామిపుష్కరిణికి పడమట దిక్కున దిగింది. అప్పుడు ఆకాశం నుండి దేవతలు దుందుభులు వాయిస్తూ జయ జయ ధ్వానాలు చేస్తూ పుష్పవర్షాన్ని కురిపించారు.

ఆ దివ్య విమాన కాంతులతో దిక్కులన్నీ ప్రకాశించాయి. దానిని చూచిన దేవతలు ఆశ్చర్య సాగరంలో మునిగిపోయారు. వారంతా జగత్ప్రభువైన శ్రీనివాసుని ఓ లక్ష్మీపతీ! సర్వవ్యాపకా! సత్యస్వరూపా! అచ్యుతా! అనిరుద్ధా! సనాతనా! ఆదిపురుషా! సర్వలోకేశ్వరా! నీకు జయమగు గాక! పరమేశ్వర పూజితా! ఆత్మేశ్వరా! జీవనాధారా! అపరాజితా! నీకు జయమగు గాక! అని స్తుతించారు. ఆ దేవతలంతా ఈ విధంగా స్తుతించగా ప్రసన్నుడైన శ్రీనివాసుడు ఆ దివ్య విమానంలో వారికి సాక్షాత్కరించాడు.

ఆ పరమ పురుషుడు విరాట్పురుషుడు, సహస్ర సూర్య ప్రకాశంతో, సహస్ర చంద్రుల ప్రభతో, సహస్ర అగ్నిహోత్రుల వెలుగుతో ప్రకాశిస్తున్నాడు. ఆయన విశ్వవిఖ్యాత విభవంతో చతుర్భుజాలలో శంఖ చక్రాది ఆయుధములను ధరించాడు. వక్షఃస్థలములో కౌస్తుభమణిని ధరించాడు. మెడలో వైజయంతీమాలతో విరాజిల్లుతున్నాడు. ఆయన కిరీటం ప్రచండ మార్తాండుని వలె ప్రకాశిస్తున్నది. మాణిక్య కంఠహారంతోను వీరపట్టంతోను విరాజిల్లుతున్నాడు. ఆయన రెండు చెవులకు మకర కుండలాలు అలరారుతున్నాయి.

ఆ దేవదేవుడు ముత్యాలహారాలు, భుజకీర్తులు, మురుగులు, కంకణాలు, ఉంగరాలు ధరించాడు. నడుముకు పట్టువస్త్రాన్ని ధరించాడు. పగడాలు, ముత్యాలతో కూర్చిన నవరత్నహారాన్ని ధరించాడు. నడుముకు చిరుగజ్జెలు చుట్టిన మొలనూలు ధరించాడు. పచ్చని పీతాంబరాన్ని ధరించాడు. హంస ధ్వనులు చేస్తున్న నూపురాలతోను, చిరుమువ్వల బంగారు అందెలతోను ఆయన పాదపద్మాలు విరాజిల్లుతున్నాయి. ఆ దివ్య మోహనాకారుడు సర్వాభరణాలతో శోభిస్తున్నాడు.

ఆయన నేత్రాలు విశాలంగా పుండరీకాల వలె ఉన్నాయి. ఆయన పుష్పమాలలు అలంకరించుకున్నాడు. చల్లని మృదువైన సుగంధ భరితమైన చందనానులేపనాలను అలంకరించుకున్నాడు. ఆయన ముఖం పూర్ణచంద్రుని వలె శోభిస్తున్నది. ఆయనకు దివ్య ధూపాలు సమర్పిస్తున్నారు. అప్రాకృతమైన దివ్య మహిమ కలవాడై, దివ్య దేహాన్ని ధరించి, ప్రాకృత దేహధారి వలె భక్తుల భావనామయ రూపుడైన, పరమ పురుషుడైన శ్రీనివాసుడావిర్భవించాడు.

ఆ దేవదేవుడు, సర్వజ్ఞుడు అయిన పరమ పురుషుడు తనను ఆశ్చర్యానందాలతో దర్శిస్తున్న దేవతలను చూచి — 'ఓ దేవతలారా! మీ అందరికీ స్వాగతం. బ్రహ్మదేవుణ్ణి ముందిడుకొని ఇంద్రాది దేవతలైన మీరంతా ఎందుకొరకు వచ్చారు? నిష్కారణ వైరులైన రాక్షసులు మిమ్ములను బాధిస్తున్నారా?' అని ఆ కేశవుడు, హృషీకేశుడు అడుగగా దేవతా ప్రముఖుడైన బ్రహ్మదేవుడు నమస్కరించి ఇలా అన్నాడు.

**7.లోకోపద్రవం :**

భక్తవత్సలా! స్వామీ! నీవు మాకు రక్షకుడవై ఉన్నావు. మేమంతా నీ అధీనులం కదా! ఓ పుండరీకాక్షా! లోకంలో అందరికీ అరిష్టాలు దాపురించినాయి. మా జీవితాల్లో మంగళమేముంటుంది? ఇంద్రాది లోక పాలకులందరూ తమ తమ స్థానముల నుండి భ్రష్టులై దురవస్థ ననుభవిస్తున్నారు. వారందరి ముఖాలు వివర్ణాలై కాంతిహీనాలైనాయి. భయభ్రాంతులైన వీరి విమానాలు ఆకాశంలో రాత్రింబవళ్ళు సంచరించడం లేదు. ద్వాదశాదిత్యులు గ్రహగ్రస్తమైన వారివలె తేజోహీనులై ప్రకాశించుట లేదు.

అష్టవసువులు, నాసత్యుడు, దస్రుడు అనే అశ్వినీదేవతలు, ఐశ్వర్య హీనులై కాంతి విహీనులయ్యారు. అస్వస్థ చిత్తుడనైన నాకు కూడా సత్య లోకంలో నివాసం కష్టంగానే ఉంది. కైలాసవాసియైన పరమశివునికి మహాక్లేశం సంభవించింది. ఆయన స్వయం కృతాపరాధం వలన ఖిన్నుడై ఏమీ చేయలేక ఉన్నాడు. ఈ ముల్లోకాల బాధలకు మూలకారకుడొకడున్నాడు. వాడు దేవేంద్రుని కూడా తృణప్రాయంగా జయించి 'అమరారి'గా ప్రసిద్ధి చెందాడు.

భయంకరాకారుడైన ఆ మహేంద్రజిత్తు పరమశివుని గూర్చి ఘోర తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చిన శంకరుడు సంతుష్టుడై దేవతలచే గాని, దేవతాధిపతులచే గాని, ఇతరులైన బలవంతులచే గాని జయింప వీలుగాకుండగా, మరణం లేకుండా (వారిచేత చంపబడకుండగ) వరమిచ్చాడు. ఆ దుర్మార్గుడైన రాక్షసుడు దేవతలకు, సత్పురుషులకు శత్రువై మూడు లోకాల్లో యథేచ్ఛగా సంచరిస్తున్నాడు. అప్పటినుండి ఆ క్రూరాత్ముడు దేవతా సమూహములను, దీనులను, దరిద్రులను రాత్రింబవళ్ళు బాధిస్తున్నాడు.

స్వామీ! నీవు రాక్షస సంహారకుడవు. దేవతలకు మిత్రుడవు. శారంగమనే ధనుస్సును, నందకమనే ఖడ్గాన్ని, సుదర్శన చక్రాన్ని ధరించినవాడవు. నీవు సర్వాంతర్యామివి. నీకు తెలియని విషయము లేదు. ఓ కమలాకాంతా! కమలలోచనా! కరుణానిధీ! కాలస్వరూపా! దుష్ట రాక్షసులచే పీడింపబడుతున్న మమ్మల్ని రక్షించు అని దేవతలందరు ప్రార్థించారు.

**8.భగవంతుని అభయం :**

శరత్పూర్ణేందు వదనుడు, దేవతల శ్రేయోభిలాషి అయిన బ్రహ్మదేవుడు ఈ విధంగా విన్నవించగా విశ్వాత్మ స్వరూపుడైన శ్రీమహావిష్ణువు కరుణా సాగర తరంగ వీక్షణములతో వారిని చూచి, వారి బాధను పోగొడుతూ, ముఖాన చిరునవ్వులు చిందిస్తూ, తన దంతకాంతిచే దిక్కులను ప్రకాశింప చేస్తూ ఇలా అన్నాడు.

"ఓ దేవతలారా! మీరు భయపడవద్దు. నేను దానికి ప్రతిక్రియ చేస్తాను. మీరు మీ మీ స్థానాలలో సుఖంగా ఉండండి. ఆ రాక్షసుడు శివుని వలన చావు లేకుండా వరం పొందినప్పటికీ ఆ దుష్టుడు ముల్లోక వాసులకు కష్టాలు కలిగిస్తున్నాడు కాబట్టి అతనికి మరణం తప్పదు" అని శ్రీహరి వారికి అభయమిచ్చి గదాపాణియై తన ఎదుట నిలిచి ఉన్న ఇంగితజ్ఞులు, గణాధ్యక్షులైన కుముదుని, విష్వక్సేనుని చూచి, వారికి సేనాధిపత్యమిచ్చి, వారిని రాక్షసులను చంపుటకై నియోగించి, దేవతలనందరినీ ఓదార్చి, అభయమిచ్చి, ఆశీర్వదించి అచ్యుతుడు అంతర్ధానమయ్యాడు. అటు పిమ్మట దేవతలందరు భగవానుని ప్రీతికరమైన వాక్కులు విని, సంతోషముతో నమస్కరించి, శిరస్సుపై అంజలి ఘటించి, ప్రదక్షిణ చేసి, సంతుష్టాంతరంగులై తమ తమ స్థానాలకు వెళ్ళారు.

**9.పవిత్ర క్షేత్రం – విచిత్ర వైభవం :**

ఓ దేవతా! ఆర్యులకు మిత్రుడు, సర్వాంతర్యామి, జగత్ప్రభువు అయిన శ్రీనివాసుని అవతార గాథను నేను నీకు చెప్పాను. ఈ కథను చదివిన వారికి, వినిన వారికి చతుర్విధ పురుషార్థ ఫలాన్ని భగవంతుడు ప్రసాదిస్తాడు. భగవంతుడు ఆవిర్భవించిన ఈ ప్రదేశం పరమ పవిత్రమైనది. చిత్రమైన మహిమ కలది. ఇది భక్తులకు అనాయాసంగా అభీష్ట ఫలాలనిస్తుంది. ముక్తులకు, మోక్షం కోరేవారికి, ఐశ్వర్యాన్ని కోరేవారికి, కిన్నరులకు, మానవులకు, సుఖవంతులైన దేవతలకు, భూత జాతులకు, భైరవులకు, భైరవులు కానివారికి, పరమైకాంతులకు, పంచ కాలారాధనచే పవిత్ర హృదయులైనవారికి, ఐదు శాఖలు గల అథర్వవేద విదులకు, పంచోపనిషత్స్వ రూపులకు నిత్యులకు, నియమబద్ధ జీవితాన్ని గడిపేవారికి, యోగులకు కూడా ఈ దివ్యక్షేత్రం నివాసభూమి. ఈ క్షేత్ర మాహాత్మ్యాన్ని వర్ణించడానికి నూరు సంవత్సరాలకు కూడ సాధ్యం కాదు. దేవలా! నీవు దీనిని విని ధన్యుడవయ్యావు.

**10.శ్రీనివాసావతార దేశకాలాదులు :**

ఈ విధంగా బ్రహ్మకల్పంలో, అది కృతయుగంలో, జంబూ ద్వీపమునందలి భారత వర్షంలో, గంగానదికి దక్షిణం వైపు రెండు వందల యోజనముల దూరంలో, తూర్పు సముద్రమునకు పశ్చిమముగా ఐదు యోజనముల దూరంలో, భాద్రపద మాసంలో, విష్ణు తిథియందు, విష్ణు యోగంలో (సిద్ధ యోగంలో) సోమవారం నాడు, నారాయణగిరి లోని స్వామిపుష్కరిణీ తీరంలో ఐశ్వర్యప్రదమైన పడమటి వైపున దేవతాగణములు ప్రార్థించగా లోకరక్షకుడు, పరమపురుషుడైన శ్రీనివాస భగవానుడు ఆవిర్భవించాడు. అటువంటి మహాత్ముడు, తేజోమయుడు, నిష్కళంకుడు, సకలకళాపరిపూర్ణుడు, పుండరీకాక్షుడు, పరమపవిత్రుడు, ఆదిపురుషుడు, హృదయ పుండరీకమును స్థానముగా గల శ్రీనివాసునికి నమస్కారము.




# వైకుంఠ ఏకాదశి పర్వదినం

- డా. దేవులపల్లి పద్మజ

మనకు సంవత్సరకాలంలో 24 ఏకాదశులు వస్తాయి. అందులో ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశిగా పరిగణిస్తారు. ఈ రోజు శ్రీమహావిష్ణువు వైకుంఠ ద్వారం ద్వారా సర్వాలంకార భూషితుడై తన దేవేరులతో కలసి దర్శనమిస్తారు. ఈ అపురూపరమైన దర్శనానికై దేవతలు ఉత్తరద్వారము ద్వారా వైకుంఠములోనికి ప్రవేశించి స్వామివారి అనుగ్రహాన్ని పొందుతారు. అంతేకాకుండా శ్రీమహావిష్ణువు ముక్కోటి దేవతలతో కలసి భూలోకానికి విచ్చేసి తన భక్తకోటిని అనుగ్రహిస్తాడని నమ్మిక. అందువలన కూడా ఈ ఏకాదశికి ముక్కోటి ఏకాదశి అనే ప్రశస్తి కలిగింది.

సాగర మథన సమయంలో అమృతం మరియు హాలాహలం ఉద్భవించి నది ఈరోజే. హాలాహలాన్ని పరమేశ్వరుడు తన కంఠంలో ధరించగా, శ్రీమహావిష్ణువు అమృతాన్ని దేవతలకు పంచి అమరులుగా మారుస్తాడు. అందువలన ఈ రోజు శైవులకు, వైష్ణవులకు అత్యంత పర్వదినం.


పద్మ పురాణాన్ని అనుసరించి ''ముర'' అనే రాక్షసి లోకాలను పీడిస్తుంటే, దేవతలు పరమశివుని సలహా ప్రకారం శ్రీమహావిష్ణువును అశ్రయించగా, ఆయన హైమవతి అనే స్త్రీశక్తి సహాయంతో ఆ రాక్షసిని సంహరిస్తాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శాక్తేయులు కూడా ఈ రోజును అత్యంత పవిత్రంగా భావిస్తారు. మహాభారత కాలంలో శ్రీకృష్ణార్జునుల మధ్య గీతా సంవాదం జరిగింది కూడా ఈ రోజే అని శాస్త్ర ప్రవచనం. ఈ విధంగా అనేక ప్రాధాన్యతలు, విశేషాలు కలిగిన ఈ రోజు సర్వులకు అత్యంత పుణ్యప్రదమైనది.

ఈరోజు ఏకాదశి వ్రతం చేసి శివకేశవులను పూజించి, ఉపవాస మరియు జాగరణ విధులను పాటించటం ద్వారా పుణ్యఫలాలు సంప్రాప్తిస్తాయని నమ్మిక. విష్ణుపురాణం ప్రకారం ఈరోజు ఉపవాస తదితర విధులు నిర్వర్తించటం ద్వారా మూడుకోట్ల ఏకాదశుల ఉపవాస పుణ్యఫలాలు దక్కుతాయని పెద్దలు చెబుతారు.

ఒకసారి బ్రహ్మదేవుని చెమట బిందువు భూలోకంలో పడగా అది ఒక రాక్షసి రూపం ధరించి, బ్రహ్మదేవుని తనకు నివాస స్థానం చూపించమని కోరగా, ఏకాదశినాటి అన్నకణంలో పురుగు రూపంలో ప్రవేశించి నివసించమని చెబుతాడు. అందువలన ఎవరైతే ఏకాదశినాడు అన్నం సేవిస్తారో, పురుగు రూపంలో వారి గర్భంలో ప్రవేశించి వ్యాధులు కలుగచేయమని ఆదేశిస్తాడు. అందువలన ఏకాదశి రోజున అన్న సేవనం విసర్జించి, ఉపవాసం ఉండి, మరుసటి రోజైన

ద్వాదశి రోజన విష్ణువును ఆరాధించి భోజనం చేస్తారు. దీని ప్రభావం వల న జనులకు ఆరోగ్యం కలిగి సుఖశాంతులతో జీవి స్తా రని శాస్త్ర వచనం. వైజ్ఞానికంగా కూడా ఒక రోజున ఉపవాసం చేస్తే జఠర శక్తి పెరిగి చక్కని ఆరోగ్యం కలుగుతుంది. దైవోపాసన చేయటానికి ఉపవాసం చక్కని మార్గం. ఇతరత్రా వ్యాపకాలు లేకుండా భగవత్ కైంకర్యంలో కాలంగడపటం ఉపవాసం. 'ఉప' అంటే 'దగ్గర' అని మరియు 'వాసం' అంటే 'నివసించటం'. అంటే దైవానికి దగ్గరగా ఉండి ఆయన సేవలో కాలక్షేపం చేయటం, నామసంకీర్తన చేయటం.

ముక్కోటి ఏకాదశి రోజు సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి, అభ్యంగనాది కార్యక్రమాల ద్వారా శుచిగా పూజా మందిరంలో శ్రీ మహావిష్ణువుని లేక శ్రీ పరమ శివుని బిల్వదళాలు, శంఖం పూలు, తులసిదళాలు మొదలైన వాటితో అర్చన చేయాలి. ఉత్తరం లేదా తూర్పు లేదా ఈశాన్యం వైపు చూచేవిధంగా దీపాలు వెలిగించాలి. గృహంలో పూజాధికాలు యధావిధిగా నిర్వహించి, విష్ణాలయంలో గాని, శివాలయంలో గాని ఏర్పరచిన ఉత్తరద్వారం ద్వారా పార్వతీ పరమేశ్వరులను లేదా లక్ష్మీనారాయణులను దర్శనం చేసుకోవాలి. ఈ విధమైన దర్శన భాగ్యంతో పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. పూజానంతరం పొంగలి నివేదన చేయాలి. ఏకాదశి వ్రత ప్రభావము వలన జన్మజన్మాంతరములనుండి పట్టిపీడిస్తున్న భయంకర వ్యాధులు, పీడలు తొలగిపోయి, ఐశ్వర్య మరియు సుఖజీవన సంప్రాప్తి కలుగుతుందని పురాణ ప్రవచనము. రోజంతా శివకేశవుల నామ పారాయణతో గడపాలి. శివకేశవుల మధ్య భేదం చూపరాదు. యధాశక్తి దానధర్మాలు చేయాలి. గీతోపదేశం జరిగిన రోజు కావున ఈ రోజు గీతాపఠనం చేసి, భగవద్గీతను దానంగా సమర్పించాలి.



“శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే, శివస్య హృదయం విష్ణుః ర్విష్ణోశ్చ హృదయం శివః !!”. దీని అర్థం ఏమనగా “శివుని హృదయంలో విష్ణువు, విష్ణువు హృదయంలో శివుడు కొలువైవుంటారు. విష్ణువేరీతి శివమయమై యున్నాడో అట్లే శివుడును విష్ణుమయమైవున్నాడు.

ముక్కోటి ఏకాదశినాడు దేశ, విదేశాలలోని అన్ని దేవాయాలలో విశేషమైన పూజలు నిర్వహిస్తారు. మన రాష్ట్రంలో తిరుపతిలో వైకుంఠ ద్వారం తెరచి భక్తులను అనుమతిస్తారు. ఈ ద్వారాన్ని మరునాటి ద్వాదశిరోజున కూడా తెరచి ఉంచుతారు. స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తారు. సంవత్సరంలో ఈ రెండు రోజులు మాత్రమే ఈ ద్వారాన్ని తెరుస్తారు. అందువలన లక్షలాది భక్తులు ఈ ద్వార ప్రవేశం కోసం తహతహలాడతారు. శ్రీరంగంలో శ్రీరంగనాథస్వామివారి దేవాయంలోనూ ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వైకుంఠ ద్వారాలు తెరచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. మిగిలిన రోజులలో ఈ ద్వారం మూయబడి వుంటుంది. పురాణాల ప్రకారం రంగనాథస్వామి దక్షిణ ముఖంగా నిలిచి ఉత్తర ముఖముగా నిలచివున్న విభీషణునకు దర్శమిచ్చాడని చెబుతారు. ఇక్కడ వరుసగా 20 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు.

హైందవ సాంప్రదాయము అనేక ఆటుపోటులకు నిలబడి విరాజిల్లుతున్నది. అనేక అన్యమతస్తులు దీని నాశనం కొరకు ప్రయత్నిస్తూనే వున్నారు. అందువలన హిందువులందరూ ఐకమత్యంగా నిలబడి, మన సంస్కృతి సంప్రదాయాన్ని పాటిస్తూ ముందు తరాలవారికి మార్గదర్శనంగా నిలవాలి. హిందూ ధర్మ పరిరక్షణకై, పటిష్టతకై పాటుపడాలి. ఇది ప్రతి ఒక్కరి కర్తవ్యంగా భావించి ముందుకు సాగాలి.

ఎంతో ముక్తిప్రదమైన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని మనమంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించి, యధాశక్తి దానధర్మాలు చేసి, ఇహపర సుఖాలను పొందుదాం.

**“జై శ్రీలక్ష్మీనారాయణ జై శ్రీపార్వతీపరమేశ్వరా”**

ధారావాహికం



# శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము

- పి. వేంకట రామిరెడ్డి

పదునెనిమిదవ అధ్యాయము

## అనంతాళ్వాన్ తోటన జరిగెడి ఉత్సవములు

ఇక మన అనంతాళ్వాన్ చరమాంకమున, శ్రీవేంకటనాథుడు ఇచ్చిన మాట ప్రకారము, ప్రతి సంవత్సరము రెండు పర్యాయములు తన మామగారగు అనంతాళ్వాన్ తోటకు వచ్చి, అచ్చట పొగడమాను స్వరూపమున వెలుగొందుతున్న అనంతాళ్వాన్ ల వారికి, వారి వంశస్థులకు, సంబంధీకులకు ఆలయ మర్యాదలు జరిపించి, ఆ తోటన ఆ ఉత్సవ దినముల, తోటన చేరిన భక్తజనులను ఆశీర్వదించి, తానే శ్రీవేంకటేశ్వరుడే దగ్గరయుండి, ఏవిధముగ పర్యవేక్షించి నిర్వర్తించుచున్నాడో మనము తెలుసుకుందాము.

తానిచ్చిన మాటలకు కట్టుబడి, అడుగడుగున తన భక్తుల కాచి, బ్రోచి రక్షించే ఆర్తజన రక్షకుడు, దీనబాంధవుడు, ఆపదల బాపి, అభయమిచ్చే, కటి, వరదహస్తముద్రాంకిత ముకుందుడు, శ్రీవేంకటేశ్వరుడు, మన విషయముననే ఇంత శ్రద్ధ జూపెడి వాడు, ఇక తన అనుంగు ప్రియసఖుడు, పిల్లను ఇచ్చిన మామకు, తాను ఇచ్చిన మాటను తప్పునా? ఇంకా శ్రద్ధ పెట్టి, తాను తన మామయగు అనంతాళ్వాన్ ల విషయమున

సంవత్సరమునకు రెండు పర్యాయములు ఆనందనిలయము నుండి తానే అనంతాళ్వాన్ తోటకు స్వయముగా వచ్చి జరిపించుచున్నాడు.

**అనంతాళ్వాన్ తోటన జరిగెడి ఉత్సవములు :**

1.తిరువాడిప్పూరమ్ ఉత్సవము

2.బ్యాక్ సవారి లేదా బాగ్ సవారి

3.దివ్య ప్రబంధ పఠనము

1.తిరువాడి పూరోత్సవము :

విజ్ఞులయిన చదువరులకు జ్ఞప్తియున్నది కదా, లేనిచో నొక్కమారు జ్ఞప్తికి తెచ్చుకుందము. అనంతాళ్వాన్ దేహము వీడువేళ, శ్రీవేంకటాద్రీశుని కడ కొన్ని మాటల తీసుకున్న తీరు, అందులో శ్రీవేంకటనాథుడు సరియని, అట్లే నెరవేర్తునని పలికిన తక్షణమే అనంతాళ్వాన్ దేహము విడిచెను కదా.

వేదపండితులు, అర్చకులు, అనంతాళ్వాన్ దేహము విడిచిన క్షణమున గ్రహస్థితుల లెక్కించి, ఆశ్చర్యపోయిరి. ఏలయన, అది ఆడి (ఆషాఢ మాసము), కర్కాటక రాశి, పుబ్బ (పూర్వఫల్గుని) నక్షత్రము, సరిగ్గా శ్రీగోదాదేవి జన్మించిన రోజుననే అదే ఘడియలలో అనంతాళ్వాన్ పరమపదించిరి.

దీనిని ప్రామాణికముగ తీసుకుని తిరువాడి పూరోత్సవము లేదా ఆడిపూరమ్ యను పేరున, అనంతాళ్వాన్ తోటన ప్రతి సంవత్సరము జరుపసాగిరి.

తిరువాడి పూరోత్సవము ఉదయముననే, అనంతాళ్వాన్ చిత్రపటమును బాగుగా అలంకరించి, బృందావనమున పొగడమాను మొదలున నిలిపి, శ్రీవేంకటాద్రీశుడు పంపిన శేషవస్త్రమును పొగడమాను స్వరూపముననున్న అనంతాళ్వాన్ ల వారికి అలంకరించి, ధూప, దీప నైవేద్యముల సమర్పించి, అనంతాళ్వాన్ ల వంశస్థులు, జియ్యరు స్వాముల నాహ్వానించి వారి ఆధ్వర్యములో ప్రబంధ గోష్ఠి జరిపి, జియ్యరు స్వాములను సత్కరించెదరు.

తదుపరి అనంతాళ్వాన్ వారి ఇంట (తిరుమాళిగ) నుంచి, దిట్టము ప్రకారము నేతి సీరా (రవ్వకేసరి) తయారీకి కావలసిన సరంజామా అంతయు శ్రీవారి పాకశాల (పోటు)కు చేర్చెదరు. నాడు సాయంకాలము తమ ఇంటికి విచ్చేసేటి ఇంటి అల్లుడగు ఇందిరా రమణునికి, శ్రీవేంకటేశ్వరునికి, అనంతాళ్వాన్ వారి ఇంటి ఉభయము ఇదియే.

మధ్యాహ్న సమయమున అన్నదానము విరివిగ చేసెదరు.

అనంతాళ్వాన్ త్రవ్విన శ్రీరామానుజ పుష్కరిణి పరిసరాలను, అనంతాళ్వాన్ బృందావనమును, అనంతాళ్వాన్లు పుష్పమాలికా గ్రథనము చేసిన రాతి మండపమును, శ్రీవేంకటేశ్వరుడు వచ్చు మార్గములందు, వివిధ రకపు పుష్పాలంకరణల, మాలాలంకరణములు, విద్యుద్దీప కాంతుల, దీపాల వరుసలతో శోభాయమానముగ అలంకరించి, వివిధ వర్ణపు ముత్యాల ముగ్గులు వేసి, అనంతాళ్వాన్ తోటనంతయూ కడు సుందరముగ తీర్చిదిద్ది, మండపమున ధూప, దీపారాధనల భక్తితో చేసి, శ్రీవేంకటనాథుని రాకకై, అనంతాళ్వాన్ వంశస్థులు, భక్తజనులు వేయికన్నులతో ఎదురు చూచుచుందురు.

ఇంతలో పోటు నుండి నేతి సీరా (అనంతాళ్వాన్ల ఇంటి ఉభయము) ఆనందనిలయుని తరపున లడ్డూ, వడ మొదలగు నైవేద్యములు, భక్తులు తెచ్చిన జీడిపప్పు, కిస్మిస్, ఖర్జూర, అరటి, దానిమ్మ, మామిడి, ఆపిల్ మున్నగు పెక్కురకములగు ఫలముల, పదార్థములను పళ్ళెరముల పెట్టి మండపమున సిద్ధముగ నుంచుదురు.

తదుపరి ఆలయము నుండి ఇద్దరు అర్చకస్వాములు బయలుదేరి, వారిలో ఒక అర్చకుడు మండపమునకు రాగా, ఇంకొక అర్చకుడు పుష్కరిణిలో స్నానమాచరించి అనంతాళ్వాన్ ఇంటి వెలుపల వచ్చి నిలుచును.

అనంతాళ్వాన్ల వంశస్థులు హారతి కర్పూరము, తాంబూలము, ఫలములు ఏడు పళ్ళెరముల పెట్టుకుని, శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి బయలుదేరగనే, భక్తుల గోవింద నామస్మరణలు మాడవీధుల మార్మోగ, మంగళవాయిద్యముల, గజరాజులు, ఆలయ అర్చకులు, అధికారులు, దివిటీలు పట్టినవారు ముందు నడువ వయ్యారములు ఒలకపోసేటి, మన సింగారాల శ్రీనివాసుడు, అనంతాళ్వాన్ తోటకు దరిదాపుల రాగానే అనంతాళ్వాన్ వంశస్థులు ఇంటి అల్లునికి స్వాగతమనుచూ మొదటి కర్పూర నీరాజ హారతిని ఇచ్చెదరు.

ఆనందనిలయుడు, అనంతాళ్వాన్ తోటన అడుగిడగనే రెండవమారు, బృందావనము వద్ద మూడవమారు, రామానుజ పుష్కరిణి అంచున ఉన్న రాతిమండపు ద్వారము వద్ద నాలుగవ మారు కర్పూర హారతులనిచ్చి, అనంతాళ్వాన్ నిర్మించి పుష్పమాలికా గ్రథనము చేసిన మండపమున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వార్లను (ఉత్సవ విగ్రహములను) పల్లకిపైనే సుఖాశీనుల చేసి, అనంతాళ్వాన్ల ఇంటి ఉభయము (నేతి సీరా) అర్చకులు ఉభయము గావించి, తదుపరి ఆలయము పోటు నుండి వచ్చిన లడ్డు, వడ ప్రసాదముల, భక్తులు సమర్పించిన వివిధ రకపు నైవేద్యముల స్వామివారికి నివేదించి, అనంతాళ్వాన్ల వంశస్థులకు, ఆలయ అధికారికి ఆలయ మర్యాదలు అనగ పరివాట్టం (తలకు పట్టు వస్త్రమును కట్టుట) శఠగోపురము నిచ్చి, వేదపండితుల ఆశీర్వచనముల చేసి, అనంతరము అనంతాళ్వాన్ల వంశస్థుల అయిదవ కర్పూర

హారతి నిచ్చి ఆనందనిలయుని అనంతాళ్వాన్ల బృందావనము కడకు తెచ్చి, ఆనందనిలయుని శ్రీవేంకటేశ్వరుని శంఖపు మెడలోని కండువా, పూలదండ, అనంతాళ్వాన్ సూక్ష్మ స్వరూపమైన పొగడమానును అలంకరింపచేసి, శఠగోపము నిచ్చి, ఏడవ కర్పూర హారతిని, అనంతాళ్వాన్ల వంశస్థులు ఇచ్చిన పిమ్మట అనంతాళ్వాన్ ఇంటి బయట, లఘు సంప్రోక్షణాది కార్యక్రమములు పూర్తి అయిన తరువాత అనంతాళ్వాన్ వంశస్థులు ఆనందనిలయుని ఆనందనిలయమునకు సాగనంపుదురు.

ఇంతవరకు బయట వేచి ఉన్న అర్చకుడు తాను తెచ్చిన పుణ్యపుష్కరిణి జలముతో పుణ్యాహవాచన చేసి, లఘు సంప్రోక్షణాది కార్యముల పూర్తి గావించి, ఆ పుణ్యజలముల అనంతాళ్వాన్ వంశస్థుల, భక్తజనుల, ఆలయ అధికారుల, పల్లకి బోయీల, అర్చకుల మరియు తక్కిన సిబ్బంది శిరములపై జల్లి ఆ అర్చకుడు తదుపరి తన తక్కిన విధులను నిర్వర్తించుకొనును.

ఈ తిరువాడి పూరోత్సవమును చూడ రెండు కన్నులు, పొగడగ వేయి నాల్కలు సరిపోవు. ఇది తిరుమల దర్శించు ప్రతి ఒక్క భక్తుడూ చూచి తరియించవలెను.

నేటికీ అనంతాళ్వాన్ ఖ్యాతి, శ్రీవేంకటాద్రీశునికి, అనంతాళ్వాన్ కు గల సంబంధ బాంధవ్యములు తెలిసిన భక్తులందరూ ప్రపంచ నలుమూలల నుండి విచ్చేయుచున్నారు.

గత 20 సంవత్సరములుగ, అక్కడే తోటలోన స్థిర నివాసముంటున్న అనంతాళ్వాన్ల 26వ తరమునకు చెందిన శ్రీ టిఎపి రంగాచారి గారు అనంతాళ్వాన్ వంశము తరపున ఈ తిరువాడి పూరోత్సవము ఏర్పాట్లను పర్యవేక్షించుచు అందరినీ కూడగట్టి తన 79వ ఏట కూడా అతి ఉత్సాహముతో నిర్వర్తించుచూ, అనంతాళ్వాన్ల వంశస్థునిగ ఆలయ మర్యాదల అందుకొనుచూ శ్రీవేంకటాద్రీశునితో సత్కరింపబడుచున్నారు. అట్లే అనునిత్యమూ, అనంతాళ్వాన్ తోటనుండి తులసి, పుష్పముల అరటి ఆకున కట్టి శ్రీవేంకటేశ్వరుని అర్చనకు తానే స్వయముగా ఆనందనిలయమున జియ్యరు, అర్చకుల చేతుల మీదుగా శ్రీవేంకటేశ్వరునికి ప్రథమ అర్చన యందు సమర్పణ చేయుచున్నారు. ప్రతి నిత్యమూ శ్రీవేంకటేశ్వరుని దర్శించుకొనుచూ, ఉభయముల సమర్పించుచూ, సహస్ర దీపాలంకరణ ముగిసిన పిమ్మట నాలుగు మాడ వీధుల శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి, ఊరేగి వచ్చేవేళ ఆనంద నిలయమునకు పశ్చిమ దిశలోని (వెస్ట్ మాడ స్ట్రీట్) మాడ వీధిలో, డబ్ల్యూ –1 గేట్ వద్దనున్న హారతి (హెచ్) పాయింట్ వద్ద కర్పూర నీరాజనములర్పించుచున్నారు.

ఇక్కడ భక్తజనులకు నేను మనసారా చేయు విజ్ఞప్తి ఏమన, మీరు అందరూ అనంతాళ్వాన్ తోటను దర్శించినపుడు అచ్చటనే నివాసముంటూ తన జీవితమును శ్రీవేంకటేశ్వరుని కైంకర్యములకై వెచ్చించునట్టి అనంతాళ్వాన్ వంశస్థులగు శ్రీ టిఎపి రంగాచారి గారి దివ్య ఆశీస్సులను, తీర్థ ప్రసాదములను స్వీకరించి ధన్యులవ్వ చూడవలయునని మనవి.

**రథోత్సవము నాడు టెంకాయ – హారతుల స్వీకారము :**

ప్రతి బ్రహ్మోత్సవములప్పుడు, చక్రస్నానము ముందు రోజు జరుగు రథోత్సవమున, తిరుమల నాలుగు మాడ వీధుల, శ్రీనివాసుడు ఎక్కడా హారతులుగాని, నైవేద్యములు గాని స్వీకరించడు.

కాని ఒకే ఒక్క అనంతాళ్వాన్ తోట ముందు, అనగా పశ్చిమ మాడవీధి, దక్షిణ మూలన, శ్రీ శ్రీనివాస విభుని, శ్రీవేంకటాద్రి విభుని రథమును ఆపగానే, అనంతాళ్వాన్ వంశస్థులు తమ ఇంటి అల్లునికి 3 టెంకాయలు, 3 రూపాయలు వరదక్షిణగా సమర్పించి, కర్పూర నీరాజన హారతులిస్తారు. తదుపరి శ్రీస్వామివారి రథమును ముందుకు కదిలించెదరు.

మహాద్వారమున బయలుదేరిన శ్రీవారి రథోత్సవము తిరిగి మహాద్వారము వద్దకు చేరువరకు, వేరెక్కడా శ్రీవేంకటనాథుడు హారతులు గాని, నైవేద్యములు గానీ ఆనాడు స్వీకరించడు, ఒక్క అనంతాళ్వాన్ తోటముందు తప్ప.

**2.బ్యాక్ సవారీ లేదా బాగ్ సవారీ :**

బ్రహ్మోత్సవములు ముగిసిన మరునాడు, శ్రీ మలయప్ప స్వామి ఒక్కరే ఆనందనిలయము నుండి బయలుదేరి, తూర్పుమాడ వీధి నుండి, ఉత్తర పడమర వీధుల మీదుగా అనంతాళ్వాన్ తోటకు వచ్చి అప్రదక్షిణముగనే అనగా పడమర వీధిలోని దక్షిణమూల మీదుగా అనంతాళ్వాన్ తోట నుండి, తూర్పు మాడవీధి చేరి, మహాద్వారము గుండా, తన ఆనందనిలయము లోనికి చేరుకొనును. అనగా యాంటీ క్లాక్ వైజ్ (అప్రదక్షిణముగ) డైరెక్షన్ లో స్వామివారు వెడలి పోవుదురు.

సాధారణ రోజులలో స్వామివారి పల్లకి తూర్పుమాడవీధిన బయలుదేరి, దక్షిణ మాడవీధి, పడమర, ఉత్తర మాడవీధుల గుండా పుష్కరిణి వద్ద కుంభహారతి స్వీకరించి మహాద్వారము గుండా, ఆనందనిలయమునకు చేరును. అనగా క్లాక్ వైజ్ డైరెక్షన్ (సవ్యదిశలో).

కారణమేమియన అనంతాళ్వాన్, శ్రీరామానుజ పుష్కరిణి తవ్వుతున్నప్పుడు, బాలుని రూపమున వచ్చి మట్టితట్టల మోసి, సహాయము చేయచూసిన శ్రీవేంకటనాథుని, అగ్రహోదగ్రుడైన అనంతాళ్వాన్ తన గునపమును పైకెత్తి చేబట్టి ఆ బాలుని వెంబడించి కొట్టబోవ, ఆ వటువు ఆనందనిలయమునకు,

పడమరవైపు, దక్షిణమూల నుండి పరుగులు పెట్టి అనంతాళ్వాన్ విసిరిన గు నపము గడ్డముపై తగిలి, రక్తము ఓడుతున్ననూ తూర్పువైపున యున్న ఆనందనిలయము మహాద్వారములను తె రుచుకుని లోన దూరి గడియ వేసుకొనెను. అనగా ఆనందనిలయుడు, అనంతాళ్వాన్ తోటలోని రామానుజ పుష్కరిణి నుండి అపసవ్య దిశలో, అప్రదక్షిణముగా (యాంటీ క్లాక్ వైజ్ డైరెక్షన్), వెనుకకు పరుగులిడెను. కావున అనంతాళ్వాన్ తోటన జరిపెడి ఈ ఉత్సవమును బ్యాక్ సవారీ లేదా బాగ్ సవారీ అందురు.

అనంతాళ్వాన్ గునపపు దెబ్బ తగిలి, గడ్డము పగిలి, నెత్తుటి ధారలు కారేంతగా తనను కొట్టినా, తదుపరి పశ్చాత్తాప హృదయుడైన అనంతాళ్వాన్ తన గడ్డమునకు పచ్చకర్పూరము అద్దిన కారణముగ, అనంతాళ్వాన్ అనుపమాన చిత్త స్థైర్యమునకు, కార్యదీక్షతకు, గుర్వాజ్ఞ పాలనా దక్షతకు మెచ్చి ప్రతి సంవత్సరము తాను అప్రదక్షిణముగ వెనుకకు (బ్యాక్) పరుగులిడినందులకు గుర్తుగా అనంతాళ్వాన్ లను మెచ్చి, తానే వచ్చి వారి వంశస్థులకు ఆలయ మర్యాదలు తానే దగ్గరుండి జరిపించెడి ఉత్సవమే బ్యాక్ సవారీ లేదా బాగ్ సవారీ.

మహంతుల కాలములో ఈ ఉత్సవములు అనంతాళ్వాన్ తోటలో జరుగుచున్నందున హిందీలో తోటను 'బాగ్' అనుట వలన పల్లకినెక్కి శ్రీస్వామి వారు వచ్చుటను సవారీ అందురు కనుక, క్రమేపీ ఈ ఉత్సవమునకు బాగ్ సవారీ యని పేరు స్థిరపడి పోయెను.

ఆంగ్లేయుల కాలము వచ్చుసరికి, ఈ పల్లకి అపసవ్యదిశలో వెనుకకు (బ్యాక్) వచ్చుతీరు వలన 'బ్యాక్ సవారీ' యను పేరు ఈ ఉత్సవమునకు వచ్చెను.

ఈ బ్యాక్ సవారీ ఉత్సవమున, శ్రీవేంకటేశ్వరుడు (మలయప్పస్వామి) ఒక్కరే అనంతాళ్వాన్ తోటకు వచ్చును.

శ్రీ మలయప్ప స్వామివారు వచ్చుసరికి, తిరువాడి పూరోత్సవములలో వలెనే, అనంతాళ్వాన్ తోటయంతయూ వివిధ రీతుల శోభాయమానంగా అలంకరించి, రాతి మండపమున ధూపదీపముల వెలిగించి, ఏడు హారతుల నీయ, ఇంటి అల్లుడను స్వాగతించ, అనంతాళ్వాన్ వంశస్థులు సర్వము సిద్ధము చేసుకుని తయారుగ నుందురు.

యథావిధిగ తిరువాడి పూరోత్సవములో వలెనే, శ్రీమలయప్పస్వామి, అనంతాళ్వాన్ ఇంటి ముందుకు రాగానే కర్పూర నీరాజనములనిచ్చి మొదటి హారతితో ఆహ్వానించెదరు. పిమ్మట తోటలో అడుగిడగనే, రెండవ హారతి, మండపము ముందుకు రాగానే మూడవ హారతి, మండపమున ఆసీనుడవ్వగనే ఉభయము సమర్పించి పోటు నుండి వచ్చిన నైవేద్య ప్రసాదముల నివేదనల చేసి, భక్తులు తెచ్చిన ప్రసాదముల స్వామివారికి ఆరగింపు చేసి, ఉత్సవ ఏర్పాట్లు చేసి, సమీక్షించిన ఆలయ అధికారికి, అనంతాళ్వాన్ వంశస్థులకు పరివాట్టం, శఠగోపము మున్నగు ఆలయ మర్యాదల చేసి, నాలుగవ హారతినిచ్చిన తరువాత మండపము నుండి శ్రీస్వామివారు బయలుదేరి అనంతాళ్వాన్ బృందావనము చేరి, అనంతాళ్వాన్ ల వారి సూక్ష్మశరీర రూపమైన పొగడమాను రూపమునకు తన మెడలోని కండువా, పూలదండ వేసి శఠారినిప్పించి ఐదవ హారతి గైకొని, తోట బయట ఆరవ హారతిని అందుకుని పడమర మాడవీధి, దక్షిణమూల నుండి బయలుదేరి అవసవ్య మార్గమున లేదా అప్రదక్షిణ మార్గమున (యాంటీ క్లాక్ వైజ్) ఆలయ మహాద్వారము కడ చేరి, అక్కడ తనకై వేచి చూసేటి శ్రీదేవి, భూదేవి ఇరువురు ఎదురేగి రాగా కొంత తడవు సేదతీరి, కర్పూర నీరాజనముల నందుకుని, ఆలయ మహాద్వారము గుండా, ఆనందనిలయుడు ఆనందనిలయములోనికి చేరుకొనును.

ఈవిధముగా అనంతాళ్వాన్ తోటన ప్రతి సంవత్సరము రెండు పర్యాయములు అనగా తిరువాడి పూరమ్, బ్యాక్ సవారీ ఉత్సవముల తానే పాల్గొని నెరపి, అనంతాళ్వాన్ లకు తాను ఇచ్చిన మాటను నిలుపుకొనుచున్నాడు. శ్రీవేంకటనాథుడు సత్యవాక్పరిపాలకుడు, కలియుగ ప్రత్యక్ష దైవము, వైభవోపేతముగ జరుగు ఈ ఉత్సవముల గూర్చి చదివి సంతసించుట కన్న చూసి సంతోషించి తరియించ చూచిన ఎంతయో బాగుండును.

### 3.దివ్య ప్రబంధ గోష్ఠి :

అనంతాళ్వాన్ ల వారికి ప్రబంధములన్న, దైవచింతన, సేవా కార్యక్రమములన్న బహుప్రీతి. అందువలననే అనంతాళ్వాన్ ల వారి అవతర దినోత్సవము సందర్భముగ, అనంతాళ్వాన్ 950వ తిరునక్షత్రము సందర్భముగ (జన్మదినోత్సవము) అనగా 2004వ సంవత్సరము నుండి, అనంతాళ్వాన్ వంశస్థులు, దివ్యప్రబంధ గోష్ఠి నిర్వహించ మొదలిడిరి. ఇది ప్రతి సంవత్సరము అనంతాళ్వాన్ తిరునక్షత్రము నాడు నిరాటంకముగా, నిర్విఘ్నముగా, అనంతాళ్వాన్ వంశస్థులు నేటికీ నిర్వహించుచున్నారు. అనంతాళ్వాన్ లను జ్ఞప్తికి తెచ్చు తీరుగా తిరుమలై పురిశైవా రి వంశస్థులు అనేక శ్రమల కోర్చి నిర్వహించుచున్నారు.

అనంతాళ్వాన్ అవతార దినోత్సవము నాడు, అనంతాళ్వాన్ వారి చిత్రపటమును, పలువిధముల అలంకరణలు చేసి, బృందావనముపైన చేర్చి నిలిపి, ధూప, దీప నైవేద్యముల నర్పించి, పలురీతుల అర్చించి దేశము నలుమూలల నుండి, తాము ఆహ్వానించగా వచ్చిన జియ్యరు స్వాములు, శ్రీవైష్ణవ

పీఠాధిపతులు, శ్రీవైష్ణవ శిష్య శిఖామణులతో కూడి, నాలాయిర్ దివ్యప్రబంధ పఠనముల (నాలుగు వేల) చేయుచూ, అనంతాళ్వాన్‌కు, శ్రీ రామానుజుల వారికి, శ్రీవేంకటనారాయణునికి గల సంబంధముల వర్ణించుచూ, కర్ణామృతముగా గాన పఠనముల చేయుచుండ బృందావనమున పొగడమాను స్వరూపులైన అనంతాళ్వాన్‌లు తన్మయులు అగుదురు.

ఈ ప్రబంధ పఠనము తమిళములో జరుపుచున్ననూ, అది విను మన మనస్సు తీవ్రమైన శాంతికి లోనై ముప్పేటల కష్టములు శ్రీ అనంతగురుని ఆశీర్వాదముల వలన ఇట్లే తొలగిపోయి, అతి సులువుగ భవజలధిని దాటి, శ్రీమన్నారాయణుని దివ్య పదకమలముల చేరుట తథ్యము.

అట్లే శ్రీవిష్ణుని, శ్రీవేంకటేశ్వరుని నామ సంకీర్తనములు, ఆళ్వారుల విశిష్టత, ప్రవచనములను తిరుమల తిరుపతి దేవస్థానము దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి ఆధ్వర్యమున అనంతాళ్వాన్ తిరుమాళిగ (నివాస స్థానము) నందు నిర్వహించబడుతున్నది.

కనుక మనమందరూ తగు సమయమును, ఏర్పాట్లను గావించుకుని శ్రీవేంకటేశ్వరుని దర్శించి తదుపరి అనంతాళ్వాన్ల తోటలో జరిగేటి దివ్య ప్రబంధోత్సవములలో పాల్గొని తరియించెదము.

తిరుమలలో జరిగే అనేక కైంకర్యములు, సంస్కరణలు అనంతాళ్వాన్ వారు తన శ్రీగురుని ఆజ్ఞానుసారము ప్రవేశపెట్టినవే.

తిరుమలలో జరిగే పుష్పయాగ మహోత్సవము కూడా అనంతాళ్వాన్ ప్రవేశపెట్టినదే.

తదుపరి కాలక్రమమున తితిదే పాలకమండలి ఆధ్వర్యమున జరుగ మొదలిడెను.

నాడు అనంతాళ్వాన్ ఒక్కడే అన్నీ తానై, నిర్మితము గావించిన పుష్పోద్యానవనముల పెంపకము, అభివృద్ధి, వాని పర్యవేక్షణకై నేడు ఏకముగ ఒక ప్రత్యేక శాఖనే, అనగా ఉద్యానవన శాఖయే ఏర్పాటు చేయవలసివచ్చినది. కొన్నివేలమందికి ఇపుడు ఉద్యోగ అవకాశములు కలిగి వారికి బ్రతుకుతెరువు అయినది.

పరిపూర్ణమైన భక్తితో ఒక్కరిగనే మనము అనంతాళ్వాన్ల దివ్య చరితమును చదివి, ఆకళింపు చేసుకుని, పలువురిచే చదివించి అనంతాళ్వాన్ల దివ్య జీవిత చరిత్రను ప్రచారము గావింపవలయును. లేనియెడల, ఎందరో శ్రీవేంకటనాథుని భక్తుల చరిత్రల వలె, తన జీవితమునే పణముగ పెట్టి, ఫలితము యన్నదే ఆశించక, శ్రీవేంకటాద్రీశుని కైంకర్యములు చేసిన అనంతాళ్వాన్ చరితము కూడా మరుగున పడిపోవును. ఇంతటి సేవల, గుర్వాజ్ఞ పాలితుని దివ్యచరితము మరుగున పడిపోవునట్లు మనము చరించిన, అది మన హైందవ సాంప్రదాయమునకే పెద్ద మచ్చ యగును.

అంతియేగాక, అనంతాళ్వాన్ల దివ్య చరితము పారాయణము చేసిన, మనకు గురు–శిష్య–దైవ సంబంధములెట్లుండునో, నిజమగు గురువు, శిష్యుల తీరు ఎట్లుండునో, గురువు ద్వారా శిష్యుడు దైవమును ఎట్లు పొంది సేవించి తరియించగల్గునో ఇట్లే పసికట్టి, పాటించి, అనంతాళ్వాన్ వంటి నిజగురువుల ఆశ్రయించి, దైవమగు శ్రీవేంకటేశ్వరుని పరమ పావన పద్మపాదముల చెంత చేరి మోక్షమును బడయవచ్చును.

**తిరుమలలో పుష్పములు ధరియించరాదు :**

వేదములే శిలలై, యక్ష, యజ్ఞ, గంధర్వ, కిన్నెర, కింపురుష, మునిపుంగవులే నానారీతుల సూక్ష్మ శరీర రూపులై సంచరించేటి ముక్కోటి దేవతలు, ముదముగ వచ్చి నిలచేటి తిరుమలగిరుల పూచేటి పుష్పములన్నియు శ్రీ తిరుమలేశుని సేవకు, అలంకరణములకు మాత్రమే నిర్దేశింపబడినవి. మానవ మాత్రులమగు మనము తిరుమల గిరుల పుష్పములు కోయుట, అచ్చటి ఉద్యానవనములలోని మొక్కలు మన ఇండ్లకు తీసుకొనిపోవుట, పుష్పములు ధరియించిన అతిపెద్ద పాపకర్మములు మనల చుట్టుముట్టి కష్టాలపాలు చేయును. దీనివెనుక దాగియున్న కథను కూడా మీకు సవివరముగ తెలుపుట ధర్మమని భావించి ఇచ్చట పొందుపరచటమైనది.

ఒకానొకనాడు శ్రీశైల పూర్ణార్యుని శిష్యుడొకడు శ్రీవేంకటనాథునికి అలంకరించిన అతి సుందరమగు పుష్పమాల సౌరభ సుగంధ సువాసనల మైమరచి ఆ పుష్పమాలను అతడు తన శిరమున ధరియించినాడు.

ఆనాటి రాత్రి శ్రీశైల పూర్ణార్యుని స్వప్నములోన శ్రీవేంకటేశ్వరస్వామి కాన్పించి ఓయీ! శ్రీశైల పూర్ణార్యా! నీ శిష్యుడు ప్రకృతి వశంగతుడై నా యెడ పరిమళ ద్రోహమొనర్చెను. ఇది కడు అపరాధము. అట్టి మాలల నేను స్వీకరించను అని పలికి అదృశ్యుడాయెను.

అంత మేల్కొన్న శ్రీశైల పూర్ణార్యుడు శ్రీభగవానుని వద్దకేగి నిలచి స్వామీ శ్రీనివాసా! నేటి మొదలు తిరుమల శిఖరముల పుష్పించెడి పుష్పములన్నియూ నీ సేవకి, నిన్నే పుష్పాలంకరణ మాలాలంకృతుడ చేయుటకే ఉపయోగింప, నిర్మాల్యమును ఎవ్వరూ త్రొక్కని, తాకని ప్రదేశమున భద్రముగ వేయుదుమన, శ్రీవేంకటనాథుడు తాను ధరియించిన పుష్పమాలికలు పరివార దేవతలకు ఇచ్చుట కాని, లేదా బావి మొదలగు వానియందు నిక్షేపింప తగినవని స్పష్టముగ ఆజ్ఞాపించెను.

కనుక భక్త మహాశయులారా! తిరుమల సందర్శకులారా చేతులెత్తి శ్రీవేంకటాద్రీశుని వేడి, విన్నవించునది ఏమన ఎట్టి

పరిస్థితులలో తిరుమల గిరుల పూలు ధరియించుట గాని, అలంకరణముల చేసుకొనుట గాని, తిరుమల నుండి ఎటువంటి మొక్కల, పుష్పముల మాలలు ఇండ్లకు తీసుకొని పోవుట గాని చేయవద్దు. ఎవరైనా వారి స్వలాభమునకై ప్రలోభ పెట్టి అంటకట్ట చూచిన లొంగవద్దు. కోరి కష్టముల కొని తెచ్చుకొనవద్దు.

మన తిరుమల దర్శనము, మన పూర్వ పాపకర్మల పంకిలముల తొలగించుటకే గాని, కోరి క్రొత్తగా కలి కష్టముల కొని తెచ్చుకొనుటకు కాదని, విజ్ఞులమయ్యి తెలుసుకుని, తెలివిగ తెప్పల రాయని, శ్రీవేంకటరాయని, శ్రీ గోవింద నామముల పలుకుచూ, దర్శించి పునీతులమయ్యేము. అనంతాళ్వాన్ తోటన కాలిడి, మన పాపకర్మల కాల్చగ చేసుకుని కార్యోన్ముఖులమై, కలి చేతల బడక, కమలాక్షు పదముల శిరములనిడి అర్చించి శ్రీవిష్ణు పథమును చేరెదము.

**"అన్యథా శ్శరణం నాస్తిత్వమేవ శరణం, మమ**
**తస్మత్కారుణ్యభావేన రక్షరక్ష శ్రీవేంకటనాథ ప్రభో"**

తిరువేంగడ ముడియాన్ ఉన్ తిరువడిగళే శరణమ్
ఇతిః శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము
అనంతాళ్వాన్ తోటన జరిగెడి ఉత్సవములను
పదునెనిమిది అధ్యాయము సంపూర్ణః
శ్రీమాన్ అనంతాళ్వాన్ దివ్యచరితము సంపూర్ణః

**సర్వేజనా సుఖినోభవంతు శ్రీమతే రామానుజాయ నమః**

**ఓం నమో వేంకటేశాయ**

# మీ ప్రశ్న మా సమాధానం

**నిర్వహణ:**
**డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం**

**1. ఏ దేవాలయంలోనైనా 'ప్ర'పంచకం విధానాన్ని అనుసరించాలి అని విన్నాను. వాటి గురించి క్లుప్తంగా వివరించమని మనవి.**

**– రంగనాయకి, మెహిదీపట్నం**

జవాబు – అవును. మీరు విన్నది నిజమే. ప్రపంచంకం అంటే 5 'ప్ర'లు.

మొదటి ప్ర = దేవాలయంలోకి ప్రవేశం
రెండవ ప్ర = ప్రదక్షిణం
మూడవ ప్ర = ప్రణామం
(ముందు బలిపీఠానికి, ధ్వజస్తంభానికి, లోపల మూలవిగ్రహానికి ఎదురుగా ఉన్న గరుడ, హనుమ, నంది మొదలగు వారికి, తరువాత అక్కడే ఉన్న గురువుల, అమ్మవార్ల విగ్రహాలకు)
నాల్గవ ప్ర = ప్రస్తుతి (ప్రార్థన)
ఐదవ ప్ర = ప్రసాదం
అడిగైనా ప్రసాదం తీసుకుని అనుకూలతని బట్టి దానిని ఇతరులతో పంచుకోవాలి.

**2. భక్తి అంటే జ్ఞాన సంపాదనేనా? మనకు అసలు గురువు అవసరం ఏమిటి? – గోదా గిరిజ, పీర్జాదిగూడ**

జవాబు – కాదు. భక్తి అంటే

1. మనుష్యుల మీద ఉండే ప్రేమ
2. ఇహ పర సాధనమైనది
3. ముక్తికి నిరపాయ సోపానం
4. భగవంతుని పట్ల తైలధారగా అవిచ్ఛిన్నంగా ప్రవహించే ప్రేమభావన
5. భగవత్ ప్రాప్తికి సులభమైన ఉపాయం
6. కలికాలంలో అందరం తరించేందుకై అందుబాటులో ఉన్న ఏకైక మార్గం
7. ఆరని అమృతధార
8. భగవద్రతితో పారవశ్యాన్ని చెందే పరిణితమైన చిత్త పరిపాకమే భక్తి.

గురువు అంటే మనలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానమనే కాంతిని మనలో నింపేవాడు. దైవం వైపు మనల్ని నడిపించేవాడు. అవసరమైతే మన స్థాయికి దిగి మనల్ని తన ఆధ్యాత్మిక శక్తితో తరింపచేసేవాడు. గురువు మనల్ని దైవంతో అనుసంధానం చేయిస్తాడు.

★ ★ ★

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



## సప్తగిరులు

### ఏడు పడగలే – ఏడు కొండలు

ఎన్నో యుగాల నుండి వైకుంఠంలోని క్షీరాబ్ధిలో శయ్యగా, ఛత్రంగా మరెన్నో రకాలుగా శ్రీమహావిష్ణువుకు సేవలందిస్తున్న ఆదిశేషుడు, శ్రీవేంకటేశ్వరుని రూపంలో వెలసిన విష్ణుమూర్తిని భూలోకంలో కూడా సేవింపదలచి తన ఏడు పడగలను ఏడు కొండలుగా అవతరింపచేసి, వాటిపై శ్రీనివాసుణ్ణి కొలువుంచుకున్నాడని పురాణాల్లో చెప్పబడింది.

వందలకొద్దీ మైళ్ళ పొడవున్న శేషాచల పర్వత శ్రేణుల్లో తిరుమల ప్రాంతాన్ని ఆదిశేషువు శిరస్సు లేదా పడగలు గాను, అహోబిలం, మహానంది, త్రిపురాంతకం ప్రాంతాన్ని ఆదిశేషువు యొక్క నడుము భాగంగాను, శ్రీశైల శిఖరాలను ఆదిశేషువు యొక్క తోకగాను భక్తులు భావిస్తుంటారు. శేషాచల సానువులన్నీ శ్రీవారికి నెలవులే. ఆ పర్వత ప్రాంతాలన్నింటినీ తరచూ పర్యటిస్తూనే ఉంటారు. పద్మావతీ పరిణయ సందర్భంలో, పెండ్లిభోజనాల పంక్తులు శేషాచల శ్రేణుల్లో తిరుమల నుండి అహోబిలం మీదుగా శ్రీశైలం వరకు విస్తరించి యున్నట్లు మనం ఇంతకుముందే తెలుసుకున్నాం.

**కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ**
**తట్టెలాయ మహిమలే తిరుమల కొండ ||**
**వేదములే శిలలై వెలసిన కొండ**
**యేదెస పుణ్యరాసులే యేరులైనది కొండ**
**గాదిలి బ్రహ్మాది లోకముల కొనల కొండ**
**శ్రీదేవుడుండేటి శేషాద్రి ఈ కొండ**

అన్న కీర్తనలో అన్నమాచార్యుడు సప్తగిరుల పౌరాణిక ప్రాశస్త్యాన్ని, మహత్యాన్ని కళ్ళకు కట్టినట్లు ఇలా వర్ణించాడు – కళ్ళెదుటే కానవచ్చే కలియుగ వైకుంఠం వంటి తిరుమల కొండ మహా మహిమాన్వితమైనది. బ్రహ్మాది లోకాలతో సమమైన ఈ కొండపై చతుర్వేదములు బండశిలలుగాను, సమస్తదేవతల యొక్క పుణ్యరాశులు సెలయేళ్ళుగాను – అవతరించి ఉన్నాయి. ఈ శేషాద్రి పర్వతంపై దేవదేవుడు వెలసి యున్నాడు. పూర్వపు యుగాలలో సైతం అంజనాద్రిగా పిలువబడే ఈ పొడవాటి కొండపై సర్వదేవతలు, గంధర్వులు మృగజాతుల, వృక్షాల రూపంలో అవతరించి యున్నారు. కోరిన వరాల నొసగే ఈ కొండ స్వర్ణకాంతులీనుతూ, సర్వసంపదలకు ఆలవాలమైన గుహలతో నిండి ఉండి, 'వేంకటాద్రి' నామంతో అలరారుతున్నది.

శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలోను, శ్రీనివాస గద్యంలోను సప్తగిరుల ప్రస్తావన కానవస్తుంది. ఈ కొండలు – శేషాచలము, గరుడాచలము, వేంకటాచలము, నారాయణాచలము, వృషభాచలము, వృషాచలము, అంజనాచలము అనే లోకప్రసిద్ధమైన నామాలతో ఒప్పారుతున్నాయి. 'అచలము' అనగా చలించనిది, లేదా పర్వతము అని అర్థము. పర్వతానికి అద్రి అనే మరో పేరు కూడా ఉండటం వల్ల వీటిని 'శేషాద్రి', 'గరుడాద్రి' మొదలగు పేర్లతో కూడా పిలుస్తారు. పూర్వ యుగాలన్నింటిలోను కొద్దిపాటి మార్పులతో సప్తగిరులన్నీ ఇవే పేర్లతో పిలువబడుతుండేవి.



సప్తగిరులలో ప్రతి పర్వతానికి యుగయుగాల ప్రశస్తి, ఆయా యుగాలలో వినుతికెక్కిన పుణ్యపురుషులతో విడదీయరాని అనుబంధం ఉన్నాయి. వివిధ పురాణాల్లో విస్తృతంగా వర్ణించబడ్డ ఆయా గిరిరాజాల వైశిష్ట్యాన్ని ఒక్కొక్కటిగా పరికిద్దాం.

## వృషభాద్రి లేదా వృషభాచలం

ఒకానొకప్పుడు వెయ్యి వృషభాల శారీరక దృఢత్వం కలిగిన 'వృషభుడు' అనే దైత్యుడు ఈ కొండపై నివసించేవాడు. శ్రీమహావిష్ణువుకు పరమభక్తుడైన ఆ అసురుడు తన ఇష్టదైవాన్ని కటాక్షింప చేసుకోవడం కోసం ఘోరమైన తపస్సు నాచరించాడు. ప్రతిదినము తుంబుర తీర్థంలో స్నానమాడి, నిరాహారుడై ఐదువేల సంవత్సరాలు తపమాచరించడం వల్ల విష్ణువు కృపతో ఆ రాక్షసుడు మరింత శక్తివంతుడయ్యాడు. ఆ రాక్షసుడు శ్రీహరిని అర్చించే విధానం విలక్షణంగా, అద్వితీయంగా ఉండేది.

ప్రతిదినము తన శిరస్సును తన ఖడ్గచాలనంతో తానే స్వయంగా తెగ నరకుకొని ఆ శిరస్సును భగవంతునికి భక్తితో సమర్పించేవాడు. తదనంతరం తన తపఃశ్శక్తితో శ్రీహరి కటాక్షంతో విగతజీవి అయిన తన మొండానికి తలను తిరిగి జత చేసేవాడు. అతని అచంచల భక్తికి, ప్రాణాధారమైన శిరస్సును సైతం తృణప్రాయంగా అర్పించగలిగిన అతని చొరవకు ముగ్ధుడైన శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమై భక్తవాత్సల్యంతో కావలసిన వరాన్ని కోరుకోమన్నాడు. ఇహలోక సంపదలు, జన్మరాహిత్యము, కైవల్యము ఇవేవీ కోరకుండా, తన సహజసిద్ధమైన దైత్యప్రవృత్తితో, అహంభావంతో శ్రీమహావిష్ణువును తనతో ద్వంద్వ యుద్ధం చేయవలసిందిగా వరం కోరాడు. తాను ఇచ్చిన వరానికి కట్టుబడిన శ్రీమహావిష్ణువు, రాక్షసుని కోర్కె తీర్చే నిమిత్తం అతనితో 27 ఏళ్ళ పాటు సలిపిన ఆ యుద్ధంలో ఆ అసురుడు పరాజితుడవుతాడు. శ్రీహరి చేతిలో మరణం పొందటం కూడా తన సుకృతంగా భావించిన వృషభాసురుడు తన చిట్టచివరి కోరికగా తాను 5000 సంవత్సరాలు తపమాచరించి శ్రీమహావిష్ణువును ప్రత్యక్షం చేసుకొని శ్రీహరితో యుద్ధం చేసిన సంగతి సమస్త లోకాలకు, భావి తరాల వారికి తెలిసేటట్లుగా, వారిరువురు యుద్ధం చేసిన ఆ పర్వతరాజానికి తన పేరు వచ్చేటట్లుగా అనుగ్రహించమని శ్రీహరి వేడుకున్నాడు. భక్తసులభుడైన శ్రీమహావిష్ణువు ఆ దైత్యభక్తుని కోరిక నెరవేర్చడంతో, అప్పటినుండి ఈ పర్వతం వృషభాద్రిగా పేరు గాంచింది. భవిష్యోత్తర పురాణాన్ననుసరించి జనకవంశపు రాజపురోహితుడైన శతానందుడు జనక మహారాజుకు, అతని పరివారానికి వేంకటాచలమాహాత్మ్యం వివరిస్తూ వృషభాద్రి వృత్తాంతాన్ని పైవిధంగా విశదీకరించాడు.

## అంజనాచలం లేదా అంజనాద్రి

వాయుదేవుని అంశతో హనుమంతుణ్ణి పుత్రునిగా పొందిన అంజనాదేవి తపస్సు గావించిన ఈ పర్వతం అంజనాద్రిగా పేరు గాంచింది.

పూర్వజన్మ యందు అంజనాదేవి దేవలోకవాసి అయిన 'పుంజికస్థల' అనబడే ఒక గంధర్వకన్య. ఒకానొకప్పుడు తన చెలికత్తెలతో బాటుగా భూలోక విహారానికి వచ్చిన సందర్భంలో ఆమె, తాను గంధర్వకన్యననే మిడిసిపాటుతో తపస్సులో నిమగ్నమై ఉన్న ఒక మునిపుంగవుణ్ణి చూసి ఎగతాళి చేసింది. వానర చేష్టలతో తన తపస్సుకు భంగం కలిగించడంతో కృద్ధుడైన ఆ మునీశ్వరుడు గంధర్వకన్యను వానరరూపం ఎత్తమని శపించాడు. మహాతపస్సంపన్నుడైన ఆ జడధారి

శాపవచనాల వల్ల ఆమె వానరంగా జన్మించి 'కేసరి' అనే పేరుగల వా నరవీరుణ్ణి వివాహమాడింది. శ్రీమహావిష్ణువును ఎంతో భక్తితో ఆరాధించే ఆ దంపతులకు చాలాకాలం సంతాన భాగ్యం కలగకపోవడంతో వారు సమీపంలో ఉన్న మాతంగముని ఆశ్రమానికి వెళ్ళి వారిని సేవించుకుని, తమకు పుత్రసంతానం కలిగే మార్గం చెప్పవలసిందిగా వేడుకుంటారు. మునివర్యుల ఆదేశాన్ననుసరించి అంజనాదేవి – కేసరి దంపతులు శేషాచలానికేతెంచి, స్వామిపుష్కరిణిలో స్నానమాడి, ఆదివరాహుణ్ణి దర్శించుకుని, ఉత్తరదిక్కున ఉన్న 'ఆకాశగంగ' అనే తీర్థానికి చేరుకుంటారు.

అంజనాదేవి ప్రతిదినము ఆ పవిత్రతీర్థంలో స్నానమాడి, ఆ ప్రదేశంలోనే పన్నెండు సంవత్సరాల పాటు నిరాహారియై కఠోర సాధన చేసింది.

భగవదేచ్ఛననుసరించి వాయుదేవుడు ప్రతిసంవత్సరం ఆకాశగంగా తీర్థంలో అంజలి ఘటిస్తున్న అంజనాదేవి దోసిలిలో ఒక దివ్యఫలం రాలేటట్లుగా చేశాడు. అంజనాదేవి దానిని మాత్రమే ఆహారంగా స్వీకరించేది. పన్నెండవ సంవత్సరం పూర్తవగానే వాయుదేవుడు తన వీర్యంతో నింపిన ఫలాన్ని అంజనాదేవి దోసిలిలో పడేటట్లు చేశాడు. యథాప్రకారం ఆ ఫలాన్ని భుజించిన అంజనాదేవి వెంటనే గర్భం దాల్చింది. వాయుదేవుని అంశతో, అంజనాదేవి సకలసద్గుణ సంపన్నుడు, పరాక్రమవంతుడు, మహాబలశాలి యైన హనుమంతుణ్ణి పుత్రుడిగా పొందింది.

అంజనాదేవి పన్నెండు సంవత్సరాలు తపస్సు చేసి హనుమను పుత్రునిగా పొందిన ప్రదేశం 'అంజనాద్రి' లేదా 'అంజనాచలం'గా పేరు గాంచింది.

ఇపుడు 'జాబాలి తీర్థం'గా పిలువబడుతున్న ప్రదేశంలోనే మాతంగముని ఆశ్రమం ఉండేదని, అంజనాదేవి అక్కడే తపమాచరించిందని భక్తుల నమ్మకం.

## శేషాద్రి లేదా శేషాచలం

ఈ శిఖరానికి శేషాద్రి లేదా శేషాచలం అనే నామధేయం రావడానికి వెనుక చాలా ఆసక్తికరమైన కథనాలున్నాయి. ఒకప్పుడు వైకుంఠవాసియైన శ్రీమహావిష్ణువు మందిరానికి ద్వారపాలకులుగా ఉండే జయవిజయులు శాపవశాత్తూ భూలోకంలో రాక్షసులుగా జన్మించినప్పుడు, ఆపద్ధర్మంగా ఆదిశేషుడు వైకుంఠద్వారానికి కాపలా కాస్తున్నాడు. శ్రీమహావిష్ణువుకు పర్యంకముగా, తల్పముగా, ఛత్రముగా ఇంకా అనేకరకాలుగా యుగయుగాలనుండి సేవలందించడం వల్ల శ్రీమహావిష్ణువుకు శ్రీమహాలక్ష్మి తరువాత అత్యంత సన్నిహితంగా మెలగటం వల్ల, ప్రస్తుతం ద్వారపాలకునిగా అదనపు బాధ్యత చేపట్టడం వల్ల అతనిలో కొద్దిగా అహంకారపు ఛాయలు పొడచూపాయి. దానిని గమనించిన శ్రీమహావిష్ణువు ఆదిశేషునికి తగిన గుణపాఠం నేర్పి, సరైన బాటలో పెట్టాలని తగిన అవకాశం కోసం వేచి చూస్తున్నాడు.

ఇదిలా ఉండగా ఒకనాడు అష్టదిక్పాలకులలో ఒకడు శ్రీమహావిష్ణువుకు పరమభక్తుడు, వినయ విధేయతలతో అణగిమణిగి ఉండే వాయుదేవుడు విష్ణుమూర్తి దర్శనార్థం వైకుంఠానికి ఏతెంచి, ద్వారపాలకునిగా ఉన్న ఆదిశేషువుతో శ్రీహరి దర్శనానికై అనుమతి కోరాడు. వాస్తవానికి దేవతల తారతమ్యంలో వాయుదేవుడు ఆదిశేషువు కంటే పై కక్ష్యలోనివాడు. కానీ ఆదిశేషువు తరతమ భేదాలను గుర్తించకుండా వాయుదేవునికి అహంకారపూరితంగా, నిర్లక్ష్యంతో సమాధానమిచ్చాడు. అత్యవసర విషయమై శ్రీమన్నారాయణునితో సత్వరమే సమావేశమవ్వాలని తెలియపరచినప్పటికీ ఆదిశేషుడు ఏకపక్షంగా వ్యవహరించి వాయుదేవుణ్ణి అడ్డుకుని, పరుష పదజాలాన్ని ఉపయోగించాడు. దాంతో స్వతహాగా నిగర్వి, శాంతస్వభావి అయిన వాయుదేవుడు కూడా కోపోద్రిక్తుడై ఆదిశేషువుని తూలనాడాడు. శ్రీమహావిష్ణువుకు అతి సమీపంలో తాను ఉంటానని, వారికి తాను అత్యంత ప్రీతిపాత్రుడనని ఆదిశేషుడు వాదించగా, విసుగుచెందిన వాయుదేవుడు ఇంటి యజమానికి సమీపంలో ఉన్నంత మాత్రాన కాపలాగా ఉంచుకున్న శునకం గొప్పదెలా అవుతుందని పరుషంగా ప్రశ్నించాడు.

అలా వారిరువురికి చాలాసేపు వాదోపవాదాలు జరుగుతుండగా, వారి సంభాషణలను అన్యాపదేశంగా విన్న విష్ణుమూర్తి తన పీఠం నుంచి తరలి ప్రవేశద్వారం వద్దకు వచ్చాడు. దాంతో కక్షిదారులిరువురు శ్రీమహావిష్ణువుకు తమ తమ వాదనలను వినిపించారు. అంతేకాకుండా వారిద్దరిలో ఎవరు గొప్పవారో తేల్చి చెప్పవలసిందిగా శ్రీహరిని కోరారు.

ముల్లోకవాసులందరికీ ప్రాణాధారమైన తాను గొప్పవాణ్ణని వాయుదేవుడు, భూమండలమంతటిని తన పడగలపై మోస్తున్నందున తానే గొప్పవాణ్ణని ఆదిశేషుడు ఇలా ఎవరికి వారు తమ గొప్పతనాన్ని శ్రీమహావిష్ణువుకు చెప్పుకున్నారు. శ్రీమన్నారాయణుడు ఎప్పటినుంచో వేచి చూస్తున్న తరుణం రానే వచ్చింది. అదే అదనుగా ఆదిశేషువుకు తన స్థానం ఏమిటో తెలియపరచదలచుకున్నాడు. వారిరువురిని ఉద్దేశించి ఇరువురు తమ తమ స్థానాలలో, కర్తవ్యనిర్వహణలో తిరుగులేని వారేనని, వారిలో ఎవరు అధికులో తేల్చటం అత్యంత కష్టతరమని బోధపరిచి వారిరువురికి ఒక పరీక్ష పెట్టదలచుకున్నట్లు

చెప్పాడు.

వైకుంఠంలో అల్లంతదూరాన ఉన్న 'ఆనందుడు' అనే పర్వతాన్ని చూపించి ఆదిశేషువు తన పడగలతో ఆ పర్వతాన్ని గట్టిగా చుట్టుకుని ఉండాలని, వాయుదేవుడు శక్తినంతా ఉపయోగించి తన వాయుతాడనంతో ఆదిశేషుడు చుట్టుకొని ఉండగా ఆ పర్వతాన్ని కదిలించడానికి ప్రయత్నించాలని ఆదేశించాడు. పర్వతం కదిలితే వాయుదేవుడు గెలిచినట్లు, లేదంటే విజయం ఆదిశేషువు దన్నమాట.

ఆ పందానికి అంగీకరించిన వారిరువురు ఈ పరీక్షకు సన్నద్ధమయ్యారు. అపరిమిత బలశాలి అయిన ఆదిశేషువు ఆనందపర్వతాన్ని చుట్టుకొని, పడగలతో గట్టిగా అదిమిపెట్టి తన బలానికి తానే మురిసిపోయాడు. వాయుదేవుడు ఆ పర్వతాన్ని ఏమాత్రం కదలించలేడన్న ధీమాతో నిశ్చింతగా ఉన్నాడు.

అటు వాయుదేవుడు భారమంతా శ్రీమహావిష్ణువుపై వేసి ఆ దేవదేవుని మనసులోనే స్మరించుకుంటూ ఒక్క ఉదుటన ఉధృతమైన ప్రభంజనాన్ని సృష్టించాడు.

సాక్షాత్తు శ్రీమన్నారాయణుని మహిమ ముందు, అహంకారంతో విర్రవీగే ఆదిశేషుడి శక్తి ఏపాటిది? చండప్రచండంగా వీచిన వాయువు ధాటికి ఆనందుడు అనబడే ఆ పర్వతం ఆదిశేషుడితో సహా ఎగిరి కొన్ని వేల యోజనాల దూరంలో ఉన్న భూలోకంలోని సువర్ణముఖి నదీ తీరాన వచ్చి పడింది.

మరో కథనం ప్రకారం ఈ పోటీ జరుగుతున్న సమయంలో శ్రీమన్నారాయణుని సంకేతాన్ననుసరించి నారదమహర్షి వైకుంఠానికేతెంచి ద్వారం ముందు నిలిచి తన వీణతో మృదుమధురమైన నాగస్వరం పలికించాడు. నాగులకు సహజమైన ప్రవృత్తితో ఆ నాగస్వరానికి మైమరచిన ఆదిశేషుడు తన పట్టును కొద్దిగా సడలించి, తన్మయత్వంతో నాట్యం చేయసాగాడు. అదే అదనుగా వాయుదేవుడు విజృంభించి తన ప్రచండమారుతంతో ఆదిశేషువుతో సహా ఆనంద పర్వతాన్ని భూలోకంలోకి విసిరివేశాడు. అలా ఎగురవేయబడ్డ పర్వతం స్వర్ణముఖీ నదీతీరం వద్ద ప్రతిష్ఠితమైంది.

తిరుమల కొండపై ఇపుడు కొలువుదీరి యున్న ఆనందనిలయం ఆ పర్వతం పైనే నెలకొని ఉంది.

ఈ సంఘటన జరిగిన తర్వాత వైకుంఠవాసి అయిన మేరుపర్వతం శ్రీమహావిష్ణువు వద్దకు వచ్చి వైకుంఠం నుండి భూలోకంలోకి వాయుదేవుని ద్వారా విసిరివేయబడ్డ ఆనందుడు అనే పర్వతం తన తనయుడని, ఆదిశేషునికి, వాయుదేవునికి మధ్య గల తగాదాలతో ఏమాత్రం సంబంధం లేని తన కుమారుడు తనకూ, వైకుంఠానికి దూరమై చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నాడని, తాను తన తనయుడు శ్రీహరిని భక్తిశ్రద్ధలతోతో యుగ యుగాలుగా సేవించుకుంటున్నామని, ఎలాగైనా తన తనయుడిని అనుగ్రహించాలని మొరపెట్టుకుంది. మేరుపర్వతం మొరను ఆలకించిన శ్రీమహావిష్ణువు ఇదంతా తన సంకల్పమేనని, ముందు ముందు రాబోయే 28వ కలియుగంలో తాను శ్రీవేంకటేశ్వరునిగా భూలోకంలో అవతరిస్తానని, అప్పుడు తాను మేరుపర్వతం తనయుడైన ఆనందపర్వతం పైనే కొలువుండి కలియుగాంతం వరకు ఉండి భక్తులను ఉద్ధరిస్తానని, తద్వారా ఆనందుని జన్మ సార్థకమై అజరామరమైన కీర్తిప్రతిష్ఠలతో వర్ధిల్లుతాడని సెలవిస్తాడు.

ఆ విధంగా శ్రీనివాసుడు కొలువై యున్న శేషాచల పర్వతానికి 'ఆనంద పర్వతమ'నే మరో పేరు కూడా వచ్చింది. అలాగే శ్రీనివాసుడు కొలువై యుండే ఆలయానికి కూడా 'ఆనందనిలయం' అనే సార్థక నామధేయం ఏర్పడింది. సాక్షాత్ భగవంతుణ్ణే మోయగల సామర్థ్యం కలవాడు, ఈ భూమండలాన్నంతటినీ తన పడగలపై మోయగల శక్తిసంపన్నుడు అయిన ఆదిశేషువు సైతం అజ్ఞానపూరితమైన అహంకారానికి లోను కావడం వలన పరాభవాన్ని మూటకట్టుకున్నాడు. ఆవిధంగా ఎంతటి గొప్పవారికైనా డాంబికము, గర్వము, అహంకారము, అహంభావము తగవని శ్రీమహావిష్ణువు తెలియజెప్పాడు. అంతేకాకుండా వినయ విధేయతలతో నుండి, భారాన్నంతా తనపై వేసి, యథాశక్తి తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన వారి పక్షాన నిలిచి వారికి విజయాన్ని ప్రసాదిస్తానని కూడా శ్రీమహావిష్ణువు చాటి చెప్పాడు.

ఆదిశేషుని వృత్తాంతాన్ని, శేషాచల వాసుణ్ణి తలపుకు తెచ్చుకున్నప్పుడు, అహంకారం ఎంతటి అనర్థాలు తెస్తుందో గుర్తుకు వస్తుంది. శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థం తిరుమల క్షేత్రానికి భక్తిభావంతో విచ్చేయాలే తప్ప అధికారదర్పం, అతిశయం ప్రదర్శిస్తే, యాత్ర సాఫల్యం కాకపోవడమే కాకుండా అనేక అనర్థాలకు కూడా దారి తీస్తుందన్న విషయాన్ని ఈ ఉదంతం స్ఫురణకు తెస్తుంది.

## గరుడాద్రి లేదా గరుడాచలం


సప్తగిరులలోని మరో శిఖరం 'గరుడాద్రి' శ్రీమహావిష్ణువు ఆదివరాహస్వామి అవతారం దాల్చి భూమండలమంతటినీ చాపగాచుట్టేసిసముద్రగర్భంలోనిక్షిప్తంచేసినహిరణ్యాక్షుడుఅనే రాక్షసుణ్ణి వధించి భూదేవిని రక్షించాడు. తనకు పునర్జీవితాన్ని ప్రసాదించిన ఆదివరాహుణ్ణి తనతోనే ఉండవలసిందిగా భూదేవి అర్థించింది. ఆమె కోరికను అంగీకరించిన శ్రీమహావిష్ణువు తాను భూలోకంలో స్థిరనివాసమేర్పరచుకొనే

నిమిత్తం, వైకుంఠంలో తాను కొలువై ఉండే క్రీడాపర్వతాన్ని తెచ్చి భూమిపై ప్రతిష్ఠించవలసిందిగా గరుత్మంతుణ్ణి ఆదే శిస్తాడు. అలా గరుడుని ద్వారా రప్పించబడి, స్వర్ణముఖి నదీతీరాన ప్రతిష్ఠించబడిన క్రీడాపర్వతమే గరుడాద్రిగా ప్రసిద్ధి చెందింది. ఆదివరాహుడు ఈ కొండపై కొలువుంటూ, తన తరువాతి అవతారమైన శ్రీవేంకటేశ్వరునికి కొంత స్థలాన్ని కానుకగా ఇచ్చాడు. ఇప్పుడు ఆనందనిలయంగా పిలువబడే ఆ ప్రదేశంలోనే శ్రీనివాసుడు కొలువై ఉన్నాడు. గరుత్మంతుడు వైకుంఠం నుంచి క్రీడాచలాన్ని తెచ్చి భూలోకంలో ప్రతిష్ఠించిన శుభదినాన్ని మనం 'గరుడపంచమి'గా జరుపుకుంటాం.

గరుడాద్రికి సంబంధించిన మరో పురాణగాథ ప్రకారం నాగులకు తల్లి అయిన కద్రువ, గరుడుని తల్లి మరియు తనకు సవతి అయిన వినతను వంచించి, మాయోపాయంతో ఆమెను తన దాసిగా చేసుకుంటుంది. తన మాతృమూర్తి దీనావస్థకు కలత చెందిన గరుత్మంతుడు ఆమెను దాస్యం నుండి విముక్తి చేయాలని, అందు నిమిత్తం ఏ మూల్యం చెల్లించటానికయినా తాను సిద్ధమని తన పినతల్లిని వేడుకుంటాడు.

ఆమెను దాస్య విముక్తురాలిని చేయడానికి ఏమాత్రం ఇష్టపడని కద్రువ, గరుత్మంతుడికి ఆచరణ సాధ్యం కాని షరతు విధించింది. దేవలోకంలో కట్టుదిట్టమైన కాపలాతో నిక్షిప్తంగా ఉండే అమృతాన్ని తెచ్చి తనకు ఇస్తే, వినత దాస్య శృంఖలాలను తొలగిస్తానని మాట ఇచ్చింది. అమిత పరాక్రమవంతుడు, మహాబలశాలి, అసాధారణ మాతృభక్తి కలిగిన గరుత్మంతుడు అనితర సాధ్యమైన ఈ షరతుకు అంగీకరించి అత్యంత దృఢమైన తన రెక్కల సాయంతో స్వర్గలోకానికి ఎగిరి వెళ్ళి, దేవతలను ఎదిరించి అమృతభాండాన్ని సాధించి తెచ్చి తన పినతల్లికి ఇవ్వడం ద్వారా తన తల్లిని దాస్యపు చెరనుండి విముక్తురాలిగా చేశాడు. తల్లిపై గరుత్మంతునికున్న నిరుపమానమైన ప్రేమకు, తెగువకు, పరాక్రమానికి ముగ్ధుడైన శ్రీమహావిష్ణువు గరుత్మంతునికి సాక్షాత్కరించి ఏదైనా వరం కోరుకోమనగా, గరుత్మంతుడు నిస్వార్థ బుద్ధితో తనకు ఇహపరమైన సౌఖ్యాలు ఏమీ అక్కరలేదని, నిరంతరం శ్రీమహావిష్ణువును సేవించుకొనే భాగ్యాన్ని ప్రసాదించమని వరంగా కోరుకుంటాడు. దానికి ప్రసన్నుడైన శ్రీహరి కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా భూలోకంలో అవతరిస్తానని, అపుడు గరుత్మంతుడు గరుడాద్రి అనే పర్వత రూపంలో అవతరించి తనకు నివాస స్థానంగా ఉంటాడని వరమిస్తాడు. శ్రీమన్నారాయణుని వరప్రభావంతో సాక్షాత్తు గరుత్మంతుడే గరుడాచలంగా మారి, శ్రీనివాసుణ్ణి సేవించుకుంటున్నాడని పురాణ ప్రశస్తి.

**(ఇంకా ఉంది)**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 56వ కళ్యాణం

తేది 29-10-23 ఆదివారం నాడు శంకర్ నగర్, పీర్జాదిగూడ, ఉప్పల్ లో జరిగింది. దీనిని భజగోవిందం భక్తబృందం పీర్జాదిగూడ వారు నిర్వహించారు. వైఖానస ఆగమోక్తంగా అత్యంత వైభవంగా జరిగింది. దీనితో మొత్తం సంకల్పంలో సగము పూర్తయింది.

## 57వ కళ్యాణం

తేది 19-11-23 ఆదివారం నాడు శ్రీ కంచికామకోటి పీఠం, శ్రీ కైలాసగిరి మల్లికార్జునగిరి దేవస్థానం వారి ఫంక్షన్ హాలు, హెచ్.బి.కాలనీ, మౌలాలీ, హైదరాబాద్ లో ఉదయం 10.30 నుండి జరిగింది. దీనిని శ్రీమాన్ ఉప్పల చంద్రగుప్త, శిరీష దంపతులు, సముద్రాల కృష్ణమూర్తి, లక్ష్మి దంపతులు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా, అన్నమాచార్య కీర్తనల మధ్య జరిగింది.

# నమామి శ్రీ శనైశ్చరమ్

- డా. దేవులపల్లి పద్మజ

**నీలాంజన సమాభాసం రవి పుత్రం యమాగ్రజం !**
**ఛాయా మార్తాండ సంభూతం తన్నమామి శనైశ్చరమ్ !!**

సకల జీవులను స్మరణమాత్రముచే భయభ్రాంతులకు గురిచేసే గ్రహరూపం శ్రీ శనీశ్వరులు. ఈయన కృపా కటాక్షవీక్షణములు గలిగిన వ్యక్తి తిరుగులేని వ్యక్తిగా వుంటాడని ప్రతీతి. ఈయన అనుగ్రహం లేకపోతే జాతక చక్రములో ఎన్ని గ్రహములు అనుకూలంగా వున్నప్పటికీ అనేక కష్టాలు అనుభవించవలసి వస్తుంది. జ్యోతిష శాస్త్రం ప్రకారం శ్రీ శనీశ్వరులు స్వతంత్రముగా ఫలితాలు ఇవ్వగలిగిన అత్యంత ప్రభావవంతమైన గ్రహం. నవగ్రహాలలో ఈయన యువరాజు.

లోకానికి ప్రత్యక్ష దైవం అయిన శ్రీ సూర్యునికి, ఛాయదేవికి జన్మించిన కుమారుడు శ్రీ శనీశ్వరుడు. ఈయన విభవ నామ సంవత్సరములో మాఘమాసం బహుళ చతుర్దశి నాడు భరణి నక్షత్రములో కాశ్యపస గోత్రములో జన్మించెను. ఈయన నీల వర్ణం కలిగి వుండి, నలుపు లేదా నీల వస్త్రాలు ధరించి, గ్రద్ధ వాహనంగా, నాలుగు చేతులతో, శూలమును ఆయుధంగా ధరించి, యముడు అధి దేవతగాను, ప్రజాపతి ప్రత్యధి దేవతగాను, యమునకు సోదరుడుగాను కలిగివుండి జ్యోతిర్మండలములో సంచరిస్తూ జీవుల స్థితి గతులను, కర్మ ఫలితాలను నిర్ణయిస్తూ వుంటాడు. ఈయన తమోగుణ ప్రధానుడు.

సూర్యుని భార్య అయిన సంధ్యాదేవి తన భర్త యొక్క తాపాన్ని భరించలేక తనకు మారు రూపుగా ఛాయను తయారుచేసి తన భర్త మరియు తనకు కలిగిన పిల్లల ఆలన పాలన చూచుకొమ్మని, తాను తపస్సు చేసుకునేందుకు వెడలిపోతుంది. తరువాత ఛాయాదేవికి జన్మించిన కుమారుడే శని భగవానుడు. ఆయన తల్లి గర్భంలో వుండగా, సూర్యుని ప్రచండ వేడి వలన దేహం అంతా నల్లగా మారిపోతుంది. అందువలనే ఈయన రంగు నీలం లేదా నలుపు వర్ణములో వుంటుంది.

ఈయన దృష్టిలో ఎటువంటి భేదభావములు ఉండవు. మహారాజైనా, బికారైనా సమానముగా దృష్టి కలిగివుంటాడు. భరత భూమిని పరిపాలించిన హరిశ్చంద్రుడు, నలుడు, పురూరవుడు, సగరుడు వంటి అనేక మంది రాజులు ఈయన చెడు దృష్టి సోకడంతో అనేక కష్టాలను అనుభవించారు.



ఈయనను మందగామి అని పిలుస్తారు. ఈయన నీతి, న్యాయములకు, ధర్మ వర్తనకు ప్రసిద్ధి చెందినవాడు. న్యాయ మార్గమును వీడక యుండిన వారిని ఈయన తప్పక కరుణిస్తాడు. ఈయన ప్రసాదించే ఫలితాలు అసాధారణంగా వుంటాయి.

ఆయుష్షును ఇచ్చే శని భగవానుడి అనుగ్రహం పొందుటకు ధర్మాచరణమే ఉత్తమ మార్గము. అనుగ్రహం, ఆగ్రహం రెండు శని భగవానుడి పరిధిలో అధికంగానే ఉంటాయి. అనుగ్రహ దశలో ఊహాతీతమైన అభివృద్ధి, ఆగ్రహ దశలో అధ:పాతాళానికి నెట్టివేయటం రెండూ ఆయన వలనే జీవితంలో సంభవిస్తాయి. కారణం లేకుండా ఆగ్రహించని సున్నితమైన మనసు శని భగవానుడిది.

బ్రహ్మాండ పురాణములో ఈయన గురించి ఒక కథ కనబడుతుంది. సహజంగా శనీశ్వరుడు శ్రీకృష్ణుని ధ్యానంలో నిమగ్నుడై వుంటాడు. ఒక రోజు ఆయన ధ్యానంలో ఉండగా ఈయన భార్య సంతానం కోసం తన భర్తను దరిజేరుతుంది. కాని ఆయన తన భార్యను గుర్తించడు. దానితో ఆయన భార్య కోపం పొంది ఈయన దృష్టి సోకితే చెడు ఫలితాలు కలుగుతాయని శపిస్తుంది. కొద్ది సేపటికి శనీశ్వరుడు ధ్యానం

నుండి బయటకు వచ్చి, జరిగినది తెలుసుకుంటాడు మరియు తన ధ్యాన విషయాన్ని భార్యకు వివరిస్తాడు. నిజం తెలుసుకున్న భార్య పశ్చాత్తాపం చెందుతుంది. కాని తాను ఇచ్చిన శాపం మరలించలేక పోతుంది. అప్పటి నుంచి శనీశ్వరుని దృష్టి చెడు ఫలితాన్ని ఇవ్వటం ప్రారంభమైనదని కథ వివరిస్తుంది. అప్పటినుంచి ఆయన తన దృష్టి కొద్దిగా వంచి అమాయకులను రక్షించటానికి గమనం సాగిస్తాడని ప్రతీతి.

శనీశ్వరునికి ప్రసిద్ధి చెందిన మరియు అత్యంత మహిమాన్వితమైన పది నామాలు కలవు. అవి కోణ, మంద, కృష్ణ, సూర్యపుత్ర, యమ, పంగు, శనైశ్చర, సౌరి, కాల మరియు ఛాయాసుత. ఈ నామాలను భక్తి శ్రద్ధలతో పఠిస్తే శనైశ్చర అనుగ్రహము తప్పక కలుగుతుంది.

శనీశ్వరుడు కర్మ ప్రదాత. అందరూ భావించినట్లు ఈయన చెడు ఫలితాలను ఈయడు. జీవి యొక్క కర్మ ఫలములను అనుభవించేటట్లు చేసి కర్మ బంధాలనుండి విముక్తుని చేస్తాడు. పరమేశ్వరుని తరువాత ముక్తిని ఈయగల శక్తిమంతుడు శ్రీ శనీశ్వరుడు. ధర్మబద్ధమైన జీవనం గడిపేవారికి కష్టాలు ఆరంభంలో కలిగినా, తదనంతర కాలంలో అద్భుతమైన ఫలితాలు ప్రాప్తమౌతాయి. జాతకుని జన్మకుండలిలో జన్మరాశి నుండి 12,1,2 స్థానాలలో ఈయన సంచారం చేస్తున్నప్పుడు ఏలిననాటి శని దశయని, 4వ స్థానంలో సంచరిస్తున్నప్పుడు అర్ధాష్టమ శని దశయని, 8వ స్థానంలో సంచరిస్తున్నప్పుడు అష్టమ శని దశయని వ్యవహరిస్తారు. ఈయన సూర్యుని చుట్టూ తిరిగి రావటానికి 30 సంవత్సరాల కాలం పడుతుంది. అందువలనే ఈయనను మందగామి అంటారు.

సాధారణంగా ప్రతి మనిషి జీవితంలో రెండు లేదా మూడు సార్లు ఏలిననాటి శని దశ వస్తుంది. అందులో ఒక్కొక్క భాగము 2½సంవత్సరాలుగా విభజిస్తే ఒక భాగము అధమ లేక నీచ స్థితి, మరొక భాగము సాధారణ లేక మధ్యమ స్థితి, మూడవ భాగము ఉన్నత స్థితిలోనూ నడుస్తుంది. ఇటువంటి దశలలో నిరాశ, నిస్పృహలకు లోనుగాకుండా విపరీత నిర్ణయాలు తీసుకోకుండా చిన్న చిన్న పరిహారాలతో శని భగవానుని అనుగ్రహము పొందవచ్చును. అవి ప్రతి శనివారం శివాలయంలో ఉమ్మెత్త పువ్వులు సమర్పించటం, నవగ్రహ ఆలయంలో 19 ప్రదక్షిణలు చేయటం, "ఓం శం శనైశ్చరాయ నమ:" అను మంత్రమును జపం చేసుకోవటం, వృద్ధులకు సేవ చేయటం, ఉదయం వేగంగా నడుస్తూ వాహ్యాళి చేయటం, నువ్వులు బెల్లం కలిపిన వుండలు పిల్లలకు పంచటం, మంగళవారం పేద దంపతులకు ఎండు ఖర్జూరం దానం చేయటం వంటి కార్యక్రమములు శని భగవానుని అనుగ్రహం పొందటంలో సహాయం చేస్తాయి. మరీ కష్టమైన స్థితిలో వున్నవారు ఎనిమిది శనివారములు ఒక ఇనుప ప్రమిదలో నూపప్పు నూనె పోసి, ఒక నల్లని వస్త్రములో కొన్ని నల్ల నువ్వులు మూట కట్టి దానిని వత్తిలా చేసి, దానిని ప్రమిదలో పెట్టి, శివాలయంలోని శని భగవానుని ఎదుట వెలిగించాలి. నువ్వుల నూనెతో శని భగవానునికి తైలాభిషేకం చేయటం కూడా ఉత్తమము. ఆయన పాదాల వద్ద నువ్వులు ఉంచి, ఒక ఆకులో బెల్లం, నువ్వులు నైవేద్యము పెట్టి, తమ సమస్యలను విన్నవించుకుని విముక్తి కలిగించమని వేడుకోవటం వలన కూడా అతి శీఘ్రముగా మంచి ఫలితాలనిస్తుంది

శ్రీ శనైశ్చరులు నిత్య వైరాగ్యభావంతో, తపోదృష్టితో, నిత్య సంతృప్తిగా, శాంతమూర్తిగా, మహాయోగిగా, శుచిప్రియునిగా, ధర్మపరునిగా, కర్మబంధాలకు అతీతుడుగా విలసిల్లుతూ వుంటాడు. ఈయన అనుగ్రహము పొందటానికి ఎంతటి కష్టమైనా ధర్మాచరణమునకు మించిన తరణోపాయం లేదు.

శనీశ్వరులకు చెందిన అనేక ప్రముఖ పుణ్య క్షేత్రములు మనకు భారతదేశములో దర్శనయోగ్యముగా వున్నాయి. వాటిలో సప్త శని క్షేత్రములు అత్యంత మహిమాన్వితమైనవి. అవి తమిళనాడులోని తిరునళ్ళారు, ఆంధ్రప్రదేశ్ లోని మందపల్లి, నర్సింగోలు, పావగడ మరియు విజయవాడ, మహారాష్ట్రలోని రాక్షసభవన్ మరియు శింగనాపూర్. వీటిని నిత్యము భక్తులు సందర్శించి తమ తమ అభీష్టములు నెరవేర్చుకుంటూ వుంటారు.

మహారాష్ట్రలోని శని శింగనాపూర్ క్షేత్రములో సాక్షాత్తు శనీశ్వరులు కొలువై వున్నారని భక్తులు విశ్వసిస్తారు. అక్కడ ఒక నల్లని రాయి రూపంలో స్వామివారు దర్శన మిస్తారు. ఆ గ్రామంలో ఏ ఇంటికీ గాని, వ్యాపార స్థలములకు గాని తలుపులు ఉండవు. ఎటువంటి దొంగతనాలు జరగవు. గతంలో కొన్ని దొంగతనాలు జరిగితే తక్షణం ఆ దొంగలు రక్తం కక్కుకుని చనిపోయారని ప్రతీతి. అందువలన ఎవరూ దొంగతనం చేయటానికి సాహసించరు.

ఈయన పరమాత్మ అంశ కూర్మావతారం కావటం వలన, కూర్మావతార ధ్యాన శ్లోకములు మంచి ఫలితాలను కలుగ చేస్తాయి. ఈయనను ప్రసన్నం చేసుకునేందుకు దశరథ ప్రోక్త శని స్తోత్రము, శని కవచ స్తోత్రము, ఉమా మహేశ్వర స్తోత్రము, హనుమాన్ చాలీసా, కాలభైరవాష్టకము మొదలైనవి ప్రముఖమైనవి.

**మంథానాచల ధారణహేతో దేవాసుర పరిపాలవిభో**
**కూర్మాకార శరీరనమో భక్తంతే పరిపాలయమామ్ !**
**రామస్మరణా ధన్యోపాయం నహి పశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తవనామ వదామి సదాన్నహరే !!**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఈ నెల సామాన్యంగా ఉంటుంది. ఆర్థికంగా కొంతమేర పుంజుకోగలరు. ప్రతి విషయంలో ఆచితూచి నడుచుకోగలరు. ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండటం మంచిది. మహాన్యాస రుద్రాభిషేకం, నవగ్రహ ప్రదక్షిణలు చేస్తే అనుకూలంగా ఉంటుంది.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు చేస్తున్న పనిలో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. అనారోగ్య సూచనలు ఉన్నాయి. అకస్మిక ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. ఒకదానికి, రెండవ దానికి వ్యత్యాసాలు ఉన్నాయి. మాట పట్టింపులు రాకుండా చూసుకోవాలి. దైవాన్ని పూజించడం వల్ల అనుకూలంగా ఉండును. దేవతారాధనలు తప్పనిసరిగా చేయాలి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఎవరితోనైనా సమన్వయం కలిగి సామరస్య దోరణితో మాట్లాడాలి. ఎంత పెద్ద సమస్య అయిన ఇట్టే పరిష్కారం అవుతుంది. అకస్మికంగా ధన రాబడి ఉంది. చక్కగా ప్లాన్ చేసుకోండి. గురువుని పట్టుకోనిన పనులు పూర్తి అగును.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలంగా ఉంటుంది. అలాగే సమస్యలు కూడా పక్కనే ఉంటాయి. ప్రయత్న లాభం ఉంటుంది. అందరి మెప్పు పొందుతారు. అకస్మిక ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలి. విద్యార్థులు చాలా ఓర్పుతో ఉంటే పరీక్షల్లో విజయం సాధిస్తారు.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలంగా ఉంది. పట్టుదలతో పనులు పూర్తి చేస్తారు. అష్టమ శని వలన ఏదైన సమస్య వస్తే, శనికి తైలాభిషేకం, దానాలు, జపాలు చేయించి విజయం పొందండి. మహాన్యాస రుద్రాభిషేకం వల్ల సత్ఫలితాలు కలుగుతాయి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. భక్తి విశ్వాసాలతో ఉండటం వలన గతం కంటే కొంత మెరుగ్గా ఉంటుంది. దినదిన గండంగా గడుస్తుంది. నవ గ్రహ ప్రదక్షిణలు చేయండి. వివాదాలకు దూరంగా ఉండండి. గొడవ వస్తే, నోట్లో నీరు పెట్టుకొండి. గ్రహాలను ఆరాధించడం మంచిది.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా సంతృప్తికంగా ఉంటుంది. దైవ బలంతో ప్రతి వ్యతిరేక విషయాన్ని మీకు అనుకూలంగా మార్చుకుంటారు. వివాహ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. నూతన ఆభరణాలు, వస్తు వాహన యోగములు సమకూర్చుకునేందుకు ఇది సరైన సమయం. సత్యదేవుని వ్రతం చేయడం మంచిది.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉండదు. ఇంటా బయటా ఏ రూపంలోనూ మనశ్శాంతి అనేదే ఉండదు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఉంటాయి. ఎన్ని సమస్యలు ఉన్నా, అనారోగ్య సమస్యలు ఉన్నా, మృత్యుంజయ జపం, నవగ్రహ ప్రదక్షిణాలు ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల లోపు 45 ప్రదక్షిణాలు చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. తొందరపాటు లేకుండా భక్తితో గోవింద నామాలు చేయడం వల్ల ఎంతటి సమస్య అయిన ఇట్టే పరిష్కారం అవుతుంది. మీ ఓర్పే మీకు రక్షగా ఉంటుంది. తక్కువగా మాట్లాడుతూ మౌనంగా ఉండటం వల్ల లాభం ఉంటుంది.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సాధారణంగా ఉంటుంది. ఆదాయం ఉంది. ప్రతి విషయం నిదానంగా పూర్తి అవుతుంది. మీరు ప్రశాంతంగా ఉండండి. చక్కటి ఫలితాలు పొందుతారు. దూర ప్రయాణాల్లో అనుకూలంగా ఉంటుంది. నవగ్రహ ప్రదక్షిణాలు చేయండి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు చాలా జాగ్రత్తగా ఉండాలి. డబ్బు విషయంలో కేర్‌ఫుల్‌గా ఉండండి. ఎవరికైనా డబ్బులు ఇస్తే, అవి తిరిగి రావడానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. విమర్శలకు చోటు ఇవ్వొద్దు. అధిక ప్రేమ, అనవసర విషయాల వలన తెలియని సమస్యలు వస్తాయి. నిరాశ నిస్పృహలకు లోనవుతారు. నవగ్రహ ఆరాధన చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ప్రతి విషయంలో పట్టుదల కలిగి కార్యదీక్షాపరులుగా అనుకున్న పనిని సాధించగలరు. వర్గ భేదాలతో ఉండరాదు. ఇది మీకు చాలా అమూల్యమైన సమయమని గుర్తించండి. కుటుంబంలో సమస్యలు ఉన్నాయి. వివేకంగా ఆలోచన చేసి పరిష్కరించుకోండి. గ్రహారాధన చేయడం అవసరం.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**





శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక


ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. వైరాగ్యాలు ఎన్ని? ఏవి?
2. మహాలక్ష్మీదేవి చేతిలో మరణించింది ఎవరు?
3. దొంగలను సన్మార్గులుగా చేసిందెవరు?
4. స్త్రీగా మారిన రాజు ఎవరు?
5. కుంభకర్ణుని భార్య ఎవరు?
6. కాపవ్యునిది ఏ జాది?
7. బుధుని కొడుకు ఎవరు?
8. కర్కటి మొదటి భర్త ఎవరు?
9. 'శ్రీ గోదా చతుః శ్లోకి' వ్రాసిందెవరు?
10. సంత్ జ్ఞానదేవ్ సోదరి ఎవరు?
11. చక్రతీర్థానికి పండుగ ఎప్పుడు?
12. ముక్తాబాయి రచనలను ఏమంటారు?
13. స్వామివారికి ఆవుపాలు, వెన్న, పచ్చకర్పూర తాంబూలం ఎక్కడి నుండి చేరుతాయి?
14. శ్రీవారి పాదాలు ఎక్కడ ఉన్నాయి?
15. "సంత్"అటే ఏమిటి?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. కేళిని, 2. భాద్రపద శుక్ల దశమినాడు, 3. నయనాదేవి, 4. శ్రీకృష్ణుడు, 5. భోగవతి, 6. ఉతథ్యుడు, 7. గంధర్వుడు, 8. సత్యవ్రతుడు / సత్యతపుడు, 9. నారదుడు, 10. స్వామిపుష్కరిణి తీరంలో, 11. తెనాలి రామకృష్ణుడు, 12. పగిలిన మట్టి కుండ, 13. ఆశారం బల్జోత్, 14.కేశవన్, 15. ఉపశమింపచేసేది.

## సరైన సమాధానాలు రాసినవారు

1. జయశ్రీ జనమంచి

పేరు: ______

చిరునామా: ______

______

______

______

పిన్‌కోడ్: ______

ఫోన్: ______

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**జయశ్రీ జనమంచి**



Postel Registration No: HSE/879/2022-2024
Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month
RNI No.: APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక



If Un delivered please return to:

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**
H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq